అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 10-03-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 09 సంచిక : 10 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్‌చంద్ర పౌడెల్



ఖాట్మండు: నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్ చంద్ర పౌడెల్ ఎన్నికయ్యారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన 78 ఏండ్ల పౌడెల్‌కు 33,702 ఎలక్టొరల్ ఓట్లు (64 శాతం)లభించగా, ఆయన ప్రత్యర్థి సీపీఎన్(యుఎంఎల్)కు చెందిన సుభాష్ చంద్ర నెంబ్‌వాంగ్‌కు 18,518 ఓట్లు (35.23 శాతం) లభించాయి. దీంతో పౌడెల్ ఎన్నికైనట్లు నేపాల్ ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. ఎలక్టొరల్ కాలేజీలో మొత్తం 882 మంది... 5లో

మోటార్లకు మీటర్లే కాదు...

మోటార్ల దగ్గర మీటర్లు పెట్టాలని మోడీ సర్కారు 2022 సవరణ ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదట మీటర్లు పెట్టించడం, ఆ తర్వాత చార్జీలు వడ్డించడం ఈ సవరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

మొత్తం కార్పొరేట్లకే

ప్రజల్ని లూటీ చేసే విద్యుత్ సవరణ బిల్లు

సెలెక్ట్ కమిటీలో ఉన్నా...మెడపై వేలాడే కత్తే • సామాన్యుల పోరాటాలే పరిష్కారాలు

ఢిల్లీ రైతాంగ ఉద్యమం తర్వాత మళ్ళీ ఆ స్థాయిలో రావల్సింది విద్యుత్ ఉద్యమమే. మోడీ సర్కార్ తెచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాల మోసం రైతాంగానికి అర్థమై, రోడ్లపైకి వచ్చారు. ఇప్పుడు సామాన్యుడికి సైతం అర్థం కావల్సింది విద్యుత్ చట్టమే. మనిషి బతకాలంటే శ్వాస తర్వాత మళ్లీ అవసరమైంది కరెంటే. కొన్ని చోట్ల ఆ శ్వాస పీల్చడానికీ కరెంటే అవసరం. ఇప్పుడు మోడీ సర్కార్ ఆ కరెంటునే కార్పొరేట్లకు కట్టబెట్టి, ప్రయివేటు 'దందా'కు కుట్రలు చేస్తున్నది. కేవలం విద్యుత్ ఉద్యోగులు మాత్రమే ఈ కుట్రల్ని ఛేదించ లేరు. సామాన్యుడు చేయి కలపాలి. అలా జరగా లంటే ముందు 'తనకు' ఏం నష్టం జరుగుతుందో తెలియాల్సిందే.

రాష్ట్రంలో 27.3 లక్షల మంది వ్యవసాయ వినియోగదారులు 10,591 మిలియన్ యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వాడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి రూ.8,970.57 కోట్లు సబ్సిడీగా చెల్లిస్తున్నది. మోటర్ల దగ్గర మీటర్లు పెడితే ఆ భారం మొత్తం రైతులే భరించాల్సి ఉంటుంది.

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

CPIM జన చైతన్య యాత్ర

కార్పొరేట్లకు ఇలా...: 2003 విద్యుత్ చట్టమే ప్రయివేటుకు పెద్దపీట వేసేందుకు చేయబడింది. ఇప్పుడు కేంద్రంలోని మోడీ సర్కారు కరెంటును పూర్తిగా కార్పొ రేట్లకు కట్టబెట్టేందుకు విద్యుత్ సవరణ చట్టం-2022 తెచ్చింది. ప్రభుత్వరంగంలో ఉన్న విద్యుత్ సంస్థలన్నీ, తమ ఆస్తులకు అద్దెలు వసూలు చేసుకోవడానికే పరిమితం అవుతాయి. ఆ ఆస్తుల్ని కార్పొరేట్లు స్వాధీనం చేసుకొని విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ సహా అన్ని బాధ్యతల్ని పూర్తిగా వారే నిర్వహిస్తారు. కరెంటు బిల్లులు, యూనిట్ రేట్ల నిర్ణయం కూడా వారిదే. భారం భరించాల్సింది మాత్రం సామాన్యులే.

రాష్ట్రాల అధికారాలు గుంజుకొనుడే..: 2003 విద్యుత్ చట్టం ప్రకారం కరెంటు అంశం కేంద్రం అజమాయిషీలో రాష్ట్రాల పరిధిలోనిది. కరెంటు చార్జీల నిర్ణయం కోసం నియంత్రణ మండళ్ల (ఈఆర్సీ) ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశారు. మోడీ సర్కారు ప్రతిపాదించిన 2022 సవరణ బిల్లులో ఆ అధికారాన్ని రాష్ట్రాల నుంచి లాగేసుకొని, ఈఆర్సీ ఛైర్మెన్లను తామే నియమిస్తామని సవరణ చేసుకుంది. ఈ ప్రభావం రాష్ట్రంలో రైతులు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, రజకులు, క్షౌరవృత్తిదారులు



ఉద్యోగులే ఆపారు

ఇప్పటి వరకు ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకుండా విద్యుత్ ఉద్యోగులే ఆపగలిగారు. అనేక ఆందోళనల ద్వారా తమ నిరసనలు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఈ బిల్లును మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినప్పుడు దేశంలోని 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు సామూహికంగా సమ్మెలోకి వెళ్లి కేంద్రాన్ని హెచ్చరించారు. ప్రతిపక్షపార్టీలు పార్లమెంటును స్తంభింప చేశాయి. మరో గత్యంతరం లేక మోడీ ప్రభుత్వం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపింది. అయినా ఈ బిల్లు ప్రజల మెడపై వేలాడుతున్న కత్తే. దాన్ని ఒడిసిపట్టి, యుద్ధానికి సిద్ధం కావల్సింది ప్రజలే!

పంపిణీ ప్రయివేటుకు

మోడీ సర్కారు ప్రతిపాదించిన సవరణల ప్రకారం ఒక ప్రాంతంలో ఒకే విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఉండరాదు. ఆ పరిధిలో ఎన్నయినా ప్రయివేటు పంపిణీ సంస్థలు ఉండొచ్చు. అవన్నీ ఇప్పటి వరకు ప్రభుత్వరంగంలో నిర్మాణమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫారాలు, కరెంటు లైన్లు, స్తంభాలకు నామమాత్రంగా అద్దె చెల్లించి లేదా పూర్తి ఉచితంగా తమ వినియోగదారులకు కరెంటును సరఫరా చేసుకోవచ్చు. ఫలితంగా ఇప్పటి వరకు పెద్ద వినియోగదారుల నుంచి పేద, మధ్య తరగతి ప్రజలకు క్రాస్ సబ్సిడీ పేరుతో బదిలీ అవుతున్న సొమ్ము కార్పొరేట్ల జేబుల్లోకి వెళ్లిపోతుంది. మళ్ళీ అంతిమంగా పేదలపై టారిఫ్ భారం పెరుగుతుంది.

వివరాలు 5లో..

అవి మోడీ సమన్లు

ఈడీ, సీబీఐ, ఐటీ తోలుబొమ్మలు



- బీజేపీలో చేరితే పునీతులా?
- రాజకీయ దురుద్దేశ్యంతోనే ప్రతిపక్షాలపై దాడులు
- ఎమ్మెల్సీ కవితనూ అలాగే బెదిరిస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్మెల్సీ కవితకు వచ్చింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు కాదనీ, అవి మోడీ సమన్లని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే ప్రతిపక్షనాయకులపై నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తున్నదని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత న్యాయపోరాటానికి బీఆర్ఎస్ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ భయపడబోరని తేల్చిచెప్పారు. గురువారంనాడాయన హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ జాతీయ ... 5లో

4 లక్షల ఎకరాలకు

పోడు పట్టాలు

ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి

- ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ...భారీ జనసమీకరణ
- ఉమ్మడి రాష్ట్రంలో ఇండ్లు నిర్మించుకున్న పేదల అప్పు మాఫీ
- రెండో విడత దళిత బంధుకు నిర్ణయం • ఏప్రిల్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ
- కాశీ, శబరిమలలో వసతి గృహాల నిర్మాణం • రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పేదల ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించింది. దళితబంధు, పోడు భూముల పట్టాల పంపిణీ, జీవో 58,59, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, కాశీ, శబరిమలలో రాష్ట్ర ప్రభుత్వ వసతి గహాలను నిర్మించాలని నిర్ణయించింది. అనంతరం రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, వి శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ



శంబీపూర్ రాజు, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ఛైర్మెన్ రవీందర్‌సింగ్‌తో కలిసి ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మీడియాకు వివరించారు.

ఇండ్లు లేని పేదల కోసం కొత్త పథకం

రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం 'గృహలక్ష్మి పథకం'లో నాలుగు లక్షల మందికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థికసాయమందిస్తుందన్నారు. సొంత జాగా ఉండి ఇండ్లు కట్టుకునే వారి కోసం తీసుకొచ్చిన ఈ పథకాన్ని ఆ ఇంటి ఇల్లాలు పేరుతోనే మంజూరు చేస్తామన్నారు. తొలి విడుతలో 4లక్షల మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి మూడువేల చొప్పున 119 నియోజకవర్గాల్లో... 2లో



నిన్న సీబీఐ..నేడు ఈడీ

మనీశ్ సిసోడియా అరెస్టు

- మనీలాండరింగ్ ఆరోపణలపై అదుపులోకి తీసుకున్న ఈడీ
- బెయిల్ విచారణకు ముందురోజే ఘటన



న్యూఢిల్లీ : ఆమాద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను మరొక కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ అరెస్టు చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్‌పై నేడు (శుక్రవారం) విచారణ జరగనున్నది. దీనికి ముందు రోజే ఈడీ ఆయనను అరెస్టు చేయడం గమనార్హం. కొత్త లిక్కర్ పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై రెండు రోజుల పాటు మనీశ్ సిసోడియాను ఈడీ విచారించింది. అనంతరం ఆయనను అరెస్టు చేసింది. సీబీఐ కోర్టు నుంచి మనీశ్ సిసోడియా బెయిల్‌ను కోరుతున్న తరుణంలో ఇప్పుడు ఈడీ అరెస్టు చేయడంతో పరిస్థితులు ఆయనకు సంక్లిష్టంగా మారాయి. ఈడీ ఆయనను నేడు (శుక్రవారం) కోర్టులో ప్రవేశపెట్టనున్నది. ఇదే రోజు ... 5లో

ఏ విచారణనైనా ధైర్యంగా ఎదుర్కొంటా

నా వైపు సత్యం, న్యాయం, ధర్మం ఉన్నాయి



- తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర
- 'వన్ నేషన్.. వన్ ఫ్రెండ్' సర్కార్ వద్దని పిలుపు
- 27 ఏండ్లుగా కోల్డ్ స్టోరేజ్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు : కవిత

న్యూఢిల్లీ : ఏ విచారణనైనా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె కవిత అన్నారు. ఈడీ, సీబీఐ ఏ దర్యాప్తు సంస్థలు పిలిచినా విచారణకు హాజరవుతానని చెప్పారు. 'ఎన్నికల నేపథ్యంలో మా పార్టీ నేతలను భయభ్రాంతులకు గురిచేయడమే బీజేపీ లక్ష్యం. మా వైపు సత్యం, ధర్మం, న్యాయం ఉన్నాయి. ఏ విచారణనైనా ధైర్యంగా ఎదుర్కొంటాం' అని కవిత అన్నారు. 'యతో ధర్మహా... తతో జయహా' అన్న గాంధారి మాటలకు అనుగుణంగా ధర్మమే గెలుస్తుందని చెప్పారు. జైలులో పుట్టిన కృష్ణుడు, అజ్ఞాత వాసంతో అర్జునుడు, వనవాసం తర్వాత శ్రీరాముడు మరింత శక్తివంతులయ్యారని గుర్తు చేశారు. కేంద్రం తాము భగవంతుడికన్నా బలవంతులమనీ, ఈడీ, ... 5లో

నేడు జంతర్ మంతర్‌లో కవిత దీక్ష

వివరాలు 3లో..

కేసీఆర్‌పై కోపంతో బీజేపీ వైపు చూస్తే..

పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే..



- కరీంనగర్ గడ్డపై రాష్ట్రాన్ని ఇస్తామని చెప్పిన చరిత్ర కాంగ్రెస్‌ది
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి • యాత్ర ఫర్ ఛేంజ్‌లో భాగంగా కరీంనగర్‌లో బహిరంగసభ • కాంగ్రెస్‌ది ఛత్తీస్‌గఢ్ మోడల్ : ఆ రాష్ట్ర సీఎం భూపేష్ భగేల్
- వేలాదిగా తరలొచ్చిన జనం.. కిక్కిరిసిన అంబేద్కర్ స్టేడియం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'కేసీఆర్‌పై కోపంతో బీజేపీ వైపు చూస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే అవుతుంది. గుజరాత్ మోడల్ కావాలో.. ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో విజ్ఞులు ఆలోచించాలి. తెలంగాణ మోడల్ కావాలో.. ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ఆలోచన చేయాలి. ఎవరి చేతిలో పెడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుందో నిర్ణయించుకోవాలి' అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ... 2లో

ప్రజలు మౌనం వీడాలి...లేదంటే అంతా నష్టమే

స్వతంత్ర సంస్థల పరిరక్షణకు ప్రజా ఉద్యమం చేపట్టాలి

- ఎస్వీకే వెబినార్‌లో జస్టిస్ నాగమోహన్‌దాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీబీఐ, ఈడీ వంటి సంస్థలు స్వతంత్రంగా పని చేయకుండా ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల నుంచి వాటిని కాపాడుకోవాలని కర్నాటక హైకోర్టు రిటైర్డ్ జడ్జి నాగమోహన్ దాస్ పిలుపునిచ్చారు. ప్రజలు మౌనం వీడాలని, లేకపోతే అంతా నష్టపోతారని హెచ్చరించారు. రాజ్యాంగం, స్వతంత్ర సంస్థల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం అవసరమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో 'దృఢమైన రాజ్యాంగ సంస్థలు - నేటి ఆవశ్యకత' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా నిర్వహించిన వెబినార్‌లో ఆయన ప్రసంగించారు. పాలనా వ్యవస్థ, శాసనవ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పోయిందని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థపై ఉన్న కొద్ది విశ్వాసం సన్నగిల్లకముందే ప్రజా అనుకూలంగా, క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ కారణాలతో సుప్రీంకోర్టు సిఫారసులను సైతం అమలు చేయకుండా ఆలస్యం చేస్తున్నారని గుర్తుచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యుల నియామకంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, మిగిలిన స్వతంత్ర సంస్థలను కూడా పరిరక్షించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. కేంద్రం నోట్ల రద్దు, జీఎస్టీతో రాష్ట్రాలను ఆర్థికంగా



బలహీనపరుస్తూ, తానే ఆర్థిక కేంద్రంగా మారుతున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాదారులు, శ్రేయోభిలాషులుగా ఉండాల్సిన గవర్నర్లు రాజకీయ ప్రతినిధులుగా మారడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుంచి 2022 సంవత్సరం వరకు 537 మంది న్యాయమూర్తులను నియమిస్తే అందులో 79 శాతం అగ్రకులాల నుంచి, 11.7 శాతం ఓబీసీలు, 2.8 శాతం షెడ్యూల్డ్ కులాలు, 1.3 శాతం షెడ్యూల్డ్ తెగల నుంచి ఉన్నారని తెలిపారు. ఇది బహుళత్వ భారత సమాజాన్ని ఏ విధంగా ప్రతిబింబిస్తుందని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థల అధిపతులకు జవాబుదారీతనం ఉండాలని, సామాన్యుడికి చట్టబద్ధ, మానవ హక్కులు కాపాడబడాలని ఆకాంక్షించారు. దీని కోసం సుప్రీంకోర్టు మరింత చురుగ్గా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. రిటైర్డ్ జడ్జీలు, ఉన్నతాధికారులను రాజ్యసభ సభ్యులు, ఇతర పోస్టుల్లో నియమిస్తున్న విషయంపై వేసిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆయా పదవుల నియామకాలకు తగిన మార్గదర్శకాలుంటే ఇలాంటివి అరికట్టే వీలుంటుందని తెలిపారు. కొలీజియంకు కూడా మార్గదర్శకాలు అవసరమన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



నవతెలంగాణ-మంచాల

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఉపాధ్యాయులను కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మాణిక్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడే గొంతుక కావాలంటే మాణిక్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం టీఎస్‌యూటీఎఫ్‌తోనే సా ధ్యం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ... 5లో

బిజినెస్

గృహ రుణాలపై బిఒబి బంపర్ ఆఫర్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన గృహ రుణ గ్రహీతలకు ఆకర్షణీయ ఆఫర్‌ను ప్రకటించింది. గృహ రుణాలపై వడ్డీ రేటును 40 బేసిస్ పాయింట్లు (0.40%) తగ్గించి 8.50గా నిర్ణయించినట్లు తెలిపింది. అదే విధంగా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) రుణాలపై ప్రారంభ వడ్డీ రేటును 8.50గా ప్రకటించింది. ఈ రెండు ఆఫర్లు 2023 మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. " నూతన ఈ వడ్డీ రేట్లు పరిశ్రమలోనే అతి తక్కువ.. వడ్డీ రేట్ల తగ్గింపునతో పాటు ఈ నెల చివరి వరకు గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును 100 శాతం రద్దు చేస్తున్నాం. ఎంఎస్ఎంఇ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజులో 50 శాతం రాయితీని కల్పిస్తున్నాం." అని బిఒబి తెలిపింది. నూతన గృహ రుణాల జారీపై మాత్రమే వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు తెలిపింది. అది కూడా రుణ గ్రహీతల సిబిల్ స్కోర్ ఆధారంగా అని పేర్కొంది. ప్రత్యేక కాల పరిమితి కింద ఈ రుణ ఆఫర్లను అందిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ కె ఖురానా తెలిపారు. చౌక ధరల గృహాలను కొనుగోలు చేసే వారికి ఇదో మంచి అవకాశమన్నారు. ఎంఎస్ఎంఇలకు మద్దతును అందించే ఉద్దేశ్యంతో ఆ రంగానికి వడ్డీ రేట్లను తగ్గించామన్నారు. బిఒబి వాల్డ్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ లేదా బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే గృహ రుణాలకు వేగంగా అనుమతులు ఇస్తోన్నట్లు తెలిపింది. లేదా తమ బ్యాంక్ శాఖలను సంప్రదించవచ్చని పేర్కొంది.

రూపాయి అస్థిరతపై సన్నద్ధంగా ఉండాలి

- ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్



ముంబయి : విదేశీ మారకపు మార్కెట్‌లో తలెత్తే అనివార్యమైన రూపాయి అస్థిరతను నిర్వహించడానికి సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎటువంటి పరిమితులు లేకుండా దిగుమతి, ఎగుమతి కోసం రూపాయి కరెన్సీని ప్రోత్సహించడం ద్వారా అస్థిరతను ఎదుర్కోవచ్చున్నారు. గత జూలైలో ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులను సులభతరం చేయడం లక్ష్యంగా అంతర్జాతీయ వాణిజ్యాన్ని రూపాయల్లో స్థిరీకరించడానికి ఆర్‌బిఐ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

మూడు రోజుల లాభాలకు బ్రేక్

- సెన్సెక్స్ 542 పాయింట్ల పతనం



ముంబయి : వరుసగా మూడు రోజులు లాభాల్లో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్ల పరుగుకు గురువారం తెర పడింది. అమెరికా సహా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లు పెంచనున్నాయనే సంకేతాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 542 పాయింట్లు లేదా 0.9 శాతం కోల్పోయి 59,806కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 165 పాయింట్లు తగ్గి 17,590 వద్ద ముగిసింది. బిఎస్ఇ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్ 0.55 శాతం చొప్పున తగ్గాయి. సెన్సెక్స్-30లో ఎంఅండ్ఎం 3 శాతం, రిలయన్స్ 2 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఎన్‌టిపిసి షేర్ 0.50 శాతం పెరిగి రూ.179.75కు చేరింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ 5 శాతం రాణించింది. వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛీఫ్ జెరోమ్ పావెల్ ఇచ్చిన సంకేతాలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేశాయి. దీంతో అమెరికా సహా ఇతర కేంద్ర బ్యాంకులు మరోసారి వడ్డీ రేట్లు పెంచుతాయనే అంచనాల నేపథ్యంలో పలు దేశాల మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

లింగ సమానత్వంపై అవగాహన

- రత్న దీప్‌లో ప్యానెల్ చర్చ



హైదరాబాద్ : మూడు దశాబ్దాలు పైగా రిటైల్ రంగంలో ఉన్న రత్నదీప్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని 8, 9 తేదిల్లో ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం నిబద్ధతపై అవగాహన కల్పించినట్లు ఆ సంస్థ పేర్కొంది. సికింద్రాబాద్ విక్రంపురిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రత్యేక ప్యానెల్ చర్చను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. స్త్రీలు సమానత్వానికి మూలమని రత్నదీప్ ఎండి సందీప్ అగర్వాల్ పేర్కొన్నారు.

ఎస్‌బీఐ శాఖ మార్పు



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సైఫాబాద్ పరిధిలోని తన బెల్లా విస్టాలోని శాఖను వేరే భవనంలోకి మార్చినట్లు తెలిపింది. ఈ శాఖను రాజ్ భవన్ రోడ్‌లోని బెల్వెడర్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీన్ని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం అమిత్ జింగ్రాన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దేబాశిష్ మిత్రా, ఆర్ బాలానంద్, రోహిత్ కుమార్, సివి రఘురామ్ పాల్గొన్నారు.

ఇంటర్ హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచాలి

- ఇంటర్ బోర్డుకు బీసీ సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయిని గురువారం హైదరాబాద్‌లో బీసీ సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. తక్షణమే ఇంటర్ బోర్డు అధికారులు విద్యార్థులకు అందుబాటులో హాల్‌టికెట్లను ఉంచాలని కోరారు. కాలేజీలతో సంబంధం లేకుండా వెబ్‌సైట్‌లో ఉంచాలని తెలిపారు.

ఫీజులు చెల్లించడం లేదనే సాకు చూపించి కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఫీజు కట్టిన వారికి హాల్‌టికెట్లు ఇస్తూ ఫీజు కట్టని వారికి నిరకారిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్ బోర్డు అధికారులు తక్షణమే స్పందించిక పోతే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదముందని తెలిపారు. శుక్రవారం నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాతామని జయప్రదబాయి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

కాలేజీలతో సంబంధం లేకుండా వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావొచ్చని సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధి బృందంలో తాటికొండ విక్రం, గొడుగు మహేష్ యాదవ్, కనకాల శ్యాంకుర్మ, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, సాయితేజ్, ఇంద్రం తదితరులున్నారు.

4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇండ్లు నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. లబ్దిదారులకు మూడు లక్షల రూపాయాలను ఒక్కో దఫాలో లక్ష రూపాయల చొప్పున ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. లబ్దిదారుడు తన ఇంటిని తనకు నచ్చిన విధంగా కట్టుకునే విధంగా నిబంధనలను సులభతరం చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ఈ పథకానికి రూ.12వేలకోట్లు ఖర్చవుతాయనీ, బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించినట్టు వివరించారు. గత కాంగ్రెస్, తెలుగుదేశం హయాంలో ఇచ్చిన రూ.40వేలు, రూ.60వేలల్లో అప్పులు ఉండేవనీ, గతంలో అప్పులన్నీ మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. దాదాపు రూ.4వేలకోట్లు పేదలపై అప్పులుంటే, ఆ అప్పులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు.

పండుగలా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని (ఏప్రిల్ 14న) 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు హరీశ్‌రావు వెల్లడించారు. నక్లెస్‌రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బిడ్డలను హైదరాబాద్‌కు పిలిపించి.. లక్షలాది మంది మధ్య అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని చెప్పారు.

రెండో విడతలో 1.30 లక్షల మందికి 'దళితబంధు'

సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకాన్ని కొనసాగించనున్నట్టు మంత్రి తెలిపారు. రెండో విడతలో 1.30లక్షల మందికి దళితబంధు ఇస్తామన్నారు. ఇప్పటికే తొలి విడతలో పలు నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు యూనిట్లు అందజేయగా...త్వరలో రెండో విడత ప్రక్రియను చేపట్టనున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించి వెంటనే అమలు ప్రక్రియ ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశించినట్టు తెలిపారు. దళితబంధు పథకం ఆగస్టు 16, 2021న ప్రారంభమైందనీ, ప్రతియేటా అదే రోజు వేడుకలను నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి 1,100 మందికి దళితబంధును రెండో విడతలో అందించనున్నట్టు తెలిపారు.

పోడు రైతులకు శుభవార్త

పోడుసాగుదార్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో నాలుగులక్షల ఎకరాల పోడు భూములకు సంబంధించి 1,55,393 మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు హరీశ్‌రావు చెప్పారు. ఇప్పటి వరకు గుర్తించిన లబ్ధిదారులకు పట్టాలు ముద్రించి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పోడు భూముల పంపిణీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించినట్టు పేర్కొన్నారు.

గొర్రెల పంపిణీకి ఓకే

రెండో విడత పంపిణీ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించి ఆగస్టు నెలఖారుకల్లా పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో గొర్రెల పంపిణీ కోసం 7.31లక్షల మంది లబ్ధిదారులను గతంలోనే గుర్తించినట్టు తెలిపారు.

ఇండ్ల క్రమబద్ధీకరణ

ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇండ్ల క్రమబద్ధీకరణ కోసం జీవో 58, 59 కింద సకాలంలో కొందరు దరఖాస్తు చేసుకోలేకపోయారని హరీశ్‌రావు తెలిపారు. కటాఫ్ డేట్ రిలాక్సేషన్ ఇవ్వాలంటూ ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు అందాయని చెప్పారు. వాటిని దృష్టిలో ఉంచుకుని మరోసారి వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. జీవో 58 కింద ఇప్పటి వరకు 1,45,668మందికి పట్టాలు పంపిణీ చేశామనీ, 59 జీవో కింద ఇప్పటి వరకు 42 వేల మంది లబ్ధి పొందారని చెప్పారు.

తెలంగాణ భక్తుల కోసం కాశీ, శబరిమలలో వసతి గృహాలు

తెలంగాణ రాష్ట్ర భక్తుల సౌకర్యార్థం కాశీ, శబరిమలలో వసతి గృహాలను నిర్మించాలని నిర్ణయించినట్టు హరీశ్‌రావు చెప్పారు. కాశీలో నిర్మించే వసతి గృహానికి రూ.25కోట్లు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ స్థలం లభ్యం కాకపోతే ప్రయివేటు స్థలం కొనుగోలు చేసి అన్ని వసతులతో కూడిన సముదాయం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శబరిమలలో కూడా రూ.25కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇక్కడి నుంచి వెళ్లే భక్తుల కోసం అన్ని వసతులతో కూడిన భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే కేరళ ప్రభుత్వం అంగీకరించినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గవర్నర్ దగ్గర పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇదిలా ఉండగా శుక్రవారం ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత తలపెట్టిన దీక్షకు రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ నాయకలు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

కేసీఆర్‌పై కోపంతో బీజేపీ వైపు చూస్తే..

(మొదటిపేజీ తరువాయి)

కరీంనగర్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. యాత్ర ఫర్ ఛేంజ్ పాదయాత్రలో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మనగర్ బైపాస్ రోడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 'కరీంనగర్ కవాతు బహిరంగ సభ'లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇదే అంబేద్కర్ స్టేడియం వేదికగా 2004లో తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చారని గుర్తు చేశారు.

మాట తప్పక మడమ తిప్పక.. సోనియా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రం ఎవరిపాలైందో ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఒక్క హామీనైనా నెరవేర్చారా అని, కనీసం కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. 'తెలంగాణ ఉద్యమకారులను నిరుద్యోగులను ఈ వేదికగా ప్రశ్నిస్తున్నా.. ఇక్కడ ఎంపీలుగా గెలిచిన కేసీఆర్, ఆయన కుటుంబం కరీంనగర్‌కు ఏం చేశారు? పొన్నం ప్రభాకర్‌ను గెలిపిస్తే.. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారు. జైపాల్ రెడ్డి చొరవతో, వ్యూహంతో ఆనాడు తెలంగాణ ఏర్పడింది. తల్లిని చంపి పిల్లను బతికించారని మోడీ అవహేళన చేసిన మాట గుర్తుంచుకోవాలి' అన్నారు. రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి పేదవాడికీ ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. పేద రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని టీపీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్వేషాన్ని వీడి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు చూసి ఇక్కడి బీఆర్ఎస్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామన్న ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆ హామీని గాలికొదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో సామాజిక తెలంగాణ ఏర్పడలేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. 'తెలంగాణ వచ్చింది.. కానీ నిధులు మాయమైపోయాయి. ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ ఏర్పడలేదు. ప్రాణహితకు అంబేద్కర్ పేరును తొలగించారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేకపోయారు' అని అన్నారు. బహిరంగసభలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, జైరాం రమేష్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహా రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

కాంగ్రెస్ ది ఛత్తీస్‌గఢ్ మోడల్
ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్

'దేశ సంపద ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇది బీజేపీ మోడల్. తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలోకి వెళ్లిపోయింది. ఇది తెలంగాణ మోడల్.. ఛత్తీస్‌గఢ్‌లో రైతాంగానికి మద్దతు ధర, నిరుద్యోగులకు భృతి ఇలా అనేక సంక్షేమాలను అమలు చేస్తున్న ఆ రాష్ట్ర మోడల్ కాంగ్రెస్‌ది' అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ అన్నారు. దేశంలోకెల్లా రైతులకు ఎంతో మేలు చేసిన ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ సర్కారుదని చెప్పారు. నిరంకుశ పాలన నుంచి.. పేదలు, రైతుల సంక్షేమాన్ని కోరే కొత్త తెలంగాణ ఏర్పాటు చేసుకోవాలన్నారు. 'కరీంనగర్.. తెలంగాణ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. తెలంగాణను ఎప్పుడు గుర్తు చేసుకుంటే అప్పుడు కరీంనగర్ గుర్తొస్తుంది. తెలంగాణ వచ్చినా రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించలేదు' అన్నారు.

డిగ్రీ కాలేజీలకు మూడేండ్ల వరకు గుర్తింపు

ఈ విద్యాసంవత్సరం ముగిసేలోగా అఫిలియేషన్లు పూర్తి

- జులై నుంచి తరగతులు ప్రారంభం
- కొత్తగా బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సు
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు డిగ్రీ కాలేజీలకు ఇక నుంచి మూడేండ్ల వరకు విశ్వవిద్యాలయాలు అనుబంధ గుర్తింపును ప్రకటిస్తాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసేలోగా అఫిలియేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆరు సంప్రదాయ విశ్వవిద్యాలయాల వీసీలు, కళాశాల విద్యాశాఖ కమిషనర్‌తో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, వీసీలు డి రవీందర్, టి రమేష్, సిహెచ్ గోపాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్, ఎస్ మల్లేష్, డి రవీందర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో లింబాద్రి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం జులైలో ప్రారంభమవుతుందని చెప్పారు. జులై నుంచే డిగ్రీ ప్రథమ సంవత్సరంతోపాటు మిగిలిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. ఈలోగా అఫిలియేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఆలస్యం కావడం వల్ల కాలేజీలు, ఉన్నత విద్యామండలి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఒక కొత్త కోర్సు కోసం గతంలో 20 కోర్సులకు గుర్తింపు ఇవ్వకుండా ఆపడం సరైంది కాదన్నారు. ఇకనుంచి డిగ్రీ కాలేజీలకు మూడేండ్ల వరకు అనుబంధ గుర్తింపు ఇస్తామని చెప్పారు. మొదటి ఏడాది అఫిలియేషన్ ఫీజు కట్టాలనీ, రెండు, మూడో ఏడాది ఆన్‌లైన్‌లో వివరాలను సంబంధిత విశ్వవిద్యాలయాలకు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అఫిలియేషన్ల కోసం వర్సిటీల వారీగా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ అందుబాటులో ఉంటుందని వివరించారు. కోర్సులకు ఇచ్చే అఫిలియేషన్లలో కూడా మార్పులు చేస్తున్నామని అన్నారు. ఒక్కో కోర్సుకు ఒక గుర్తింపు ఇవ్వబోమని చెప్పారు. ఉదాహరణకు మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ ఉండే సబ్జెక్టులకు బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సుకు గుర్తింపును ప్రకటిస్తామని వివరించారు. వీసీలు, రిజిస్ట్రార్లు, అధ్యాపకులు కాలేజీలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్తగా బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సును ప్రవేశపెడతామన్నారు. కంప్యూటర్ సబ్జెక్టుకు ఎక్కువ క్రెడిట్లు, మ్యాథ్స్ సబ్జెక్టుకు తక్కువ క్రెడిట్లు ఉంటాయని అన్నారు. డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెడుతున్నామని చెప్పారు. విద్యార్థులు కోవిడ్ సమస్యలను అధిగమించే విద్యాసంవత్సరంగా మారుస్తామని వివరించారు. జాతీయస్థాయిలో పీజీ ప్రవేశాలకు రాతపరీక్షలను దృష్టిలో ఉంచుకుని అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందిస్తామని చెప్పారు. డిగ్రీ కాలేజీలకు న్యాక్ గుర్తింపును పొందడంపైనా దృష్టి కేంద్రీకరిస్తామని అన్నారు. న్యాక్ పొందే కాలేజీకి సీడ్ మనీ కింద రూ.లక్ష ప్రోత్సాహకంగా ఉన్నత విద్యామండలి ఇస్తుందన్నారు. సెమినార్లు నిర్వహించి న్యాక్ ప్రాధాన్యతను వివరిస్తామని చెప్పారు. త్వరలో వర్సిటీల వారీగా డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వర్సిటీల వీసీలతో న్యాక్ డైరెక్టర్‌తో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

నేడు జంతర్ మంతర్‌లో కవిత దీక్ష

మహిళా రిజర్వేషన్ల బిల్లు సాధనకు ఒక రోజు నిరాహార దీక్ష

- 18 రాజకీయ పార్టీల మద్దతు
- హాజరుకానున్న 29 రాష్ట్రాల మహిళా హక్కుల ప్రతినిధులు
- భారీ ఏర్పాట్లు చేసిన భారత జాగృతి సంస్థ



న్యూఢిల్లీ : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె కవిత నేడు నిరాహార దీక్ష చేపట్టనున్నారు. జంతర్ మంతర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ధర్నా కొన సాగనుంది. ఉదయం ఈ నిరాహార దీక్షను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారనీ, ఇందులో శివసేన పార్టీకి చెందిన ప్రియాంక చతుర్వేది, ఇతర నేతలు హాజరవుతారని చెప్పారు. తనతో పాటు దాదాపు 500ల మంది నిరహార దీక్ష చేపడుతారని చెప్పారు. మహిళా హక్కుల కోసం తాను చేస్తోన్న ఈ పోరా టానికి దేశంలోని 18 పొలిటికల్ పార్టీలు మద్దతు తెలి పాయని గురువారం కవిత వెల్లడించారు. బీఆర్ఎస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, అకాలీదళ్, టీఎంసీ, జేడీయూ, ఆర్జేడీ, సమాజ్ వాదీ పార్టీ, సీపీఐ(ఎం), సీపీఐ, డీఎంకే, ఎన్సీపీ, శివసేన, ఆప్, ఆర్ఎల్డి, జేఎమ్ఎమ్ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరై సంఘీభావం తెలపనున్నట్టు చెప్పారు. అలాగే 29 రాష్ట్రాలకు చెందిన మహిళా హక్కుల పోరాట సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. మొత్తంగా 5 నుంచి 6 వేల మంది ఈ ఆందోళనలో పాలుపంచు కుంటారని చెప్పారు.

ధర్నాకు భారీ ఏర్పాట్లు...

'చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల' సాధన కోసం ఎమ్మెల్సీ కవిత తలపెట్టిన ఒక రోజు నిరాహార దీక్ష కు జాగృతి సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. కాగా, సభావేదిక గురించి కొంత గందరగోళం నెలకొంది. ముందుగా తమకు కేటాయించిన స్థలాన్ని ఢిల్లీ పోలీసులు మార్చారని జాగృతి నేతలు ఆరోపించారు. ఆ స్థలాన్ని ఇతర ఆందోళనలు చేసే సంస్థలతో పంచుకోవాలని సూచించినట్టు చెప్పారు. కానీ, చివరకు అంతా ప్రశాంతంగానే సభ ఏర్పాట్లను చేసుకున్నారు.

ఏచూరితో కవిత భేటీ...

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీతో గురువారం ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. గోల్ మార్కెట్ లోని సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. మహిళా రిజర్వేషన్ల సాధన దీక్షపై దాదాపు అరగంటకు పైగా నేతలిద్దరు చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సీతారాం ఏచూరిని దీక్షకు ఆహ్వానించినట్లు చెప్పారు. 1996 లో అప్పటి ప్రధాని దేవగౌడ మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రయత్నం చేశారని చెప్పారు. అనంతరం ప్రతి ప్రధాని అనేక రకాలుగా ప్రయత్నాలు చేసారన్నారు. కానీ ప్రస్తుత ప్రధాని మోదీ కి మాత్రం మహిళా రిజర్వేషన్ల బిల్లు తెచ్చే ఆలోచన చేయలేదన్నారు. రానున్న బడ్జెట్ సెషన్ రెండో దఫాలో బిల్లు పెట్టుకునే అవకాశం ఉందన్నారు. 131 ఫైనాన్స్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం పాస్ చేసుకుందని, జీఎస్టీ, ట్రిపుల్ తలాక్ బిల్లు, సిటిజన్ షిప్ అమెండ్మెంట్ బిల్లు ఇలాంటి బిల్లులను గంటలలో చర్చలు లేకుండా పాస్ చేసుకున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికి నష్టం లేదని, దేశానికి, ప్రజాస్వామ్యానికి ఉపయోగకరమైందన్నారు. బిల్లు తెచ్చి చిత్తశుద్ధిని చాటుకోవాలని బీజేపీ నేతలకు సూచించారు.

ఎమ్మెల్యే కోటాలో మండలి అభ్యర్థుల నామినేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్లను గురువారం అసెంబ్లీలో దాఖలు చేశారు. అభ్యర్థులుగా దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులకు సమర్పించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నామినేషన్లకు సంబంధించిన అన్ని అంశాలనూ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలు కంటే ముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

వసతి గృహం బాధిత మహిళలకు మనోధైర్యం


- స్టే హోం ప్రారంభంలో శ్రీమతి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కుటుంబంలో సమస్యలు ఎదురైనప్పుడు, ఒంటరిగా ఉన్న పుడు భద్రత, భరోసా కల్పించే విధంగా షార్ట్ స్టేహోమ్ ఉపయోగపడు తుందని ఐద్వా జాతీయ అధ్యక్షులు పీకే శ్రీమతి తెలిపారు. వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం సందర్భంగా తాత్కాలిక వసతి గృహాన్ని ప్రారంభించారని ట్రస్ట్ కార్యదర్శి బి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐలమ్మ ట్రస్టును 2014లో ఏర్పాటు చేశామనీ, దీని ద్వారా ఉచిత కుటుంబ న్యాయ సలహా కేంద్రాలు,మెడికల్ క్యాంపులు, బాలోత్సవాలు, బాలికలకు కరాటే శిక్షణా కేంద్రాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు. ఈ క్రమంలోనే తాత్కాతిక వసతి గృహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అధ్యక్షత వహించగా, ట్రస్టు కార్యదర్శి బత్తుల హైమవతి, కోశాధికారి కె.ఎస్ ఆశలత, ట్రస్టు సీనియర్ సభ్యులు టి. జ్యోతి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షులు ఆర్, అరుణజ్యోతి, ఐద్వా నాయకులు, శాంతకుమారి, ఎమ్ వినోద, పి, శశికళ, కమలకుమారి, కౌన్సిలింగు కేంద్రం కన్వీనర్, విశాలాక్షి, జర్నలిస్టు ఉదయలక్ష్మి, గాయత్రి, కమలమ్మ, న్యాయవాది లీలావతి సైకాలజిస్టు అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

13న పీఈసెట్ నోటిఫికేషన్

- 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) షెడ్యూల్‌ను గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈనెల 13న పీఈసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు రూ.500, ఇతరులు రూ.900 దరఖాస్తు ఫీజు కట్టాలని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు మే ఆరో తేదీ వరకు గడువుందని తెలిపారు. ఆలస్య రుసుం రూ.500తో అదేనెల 15 వరకు, రూ.రెండు వేలతో 20 వరకు, రూ.ఐదు వేలతో 25వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. 26 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు ఫిజికల్ టెస్టులను నిర్వహిస్తామని వివరించారు. అదేనెల మూడోవారంలో ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు http://pecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, శాతవాహన వర్సిటీ వీసీ ఎస్ మల్లేష్, ఎంజీయూ వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, పీఈసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీ6, వెలుగుపై కేటీఆర్ వ్యాఖ్యలకు టీడబ్ల్యూజేఎఫ్ ఖండన

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు వి6 ఛానెల్, వెలుగు దినపత్రికను బ్యాన్ చేస్తామని బెదిరించడం సమంజసం కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఎప్పుడు బ్యాన్ చేయాలో తెలుసంటూ వ్యాఖ్యానిం చడం దారుణమని అభిప్రాయపడింది. వి6, వెలుగులో బీఆర్ఎస్ పార్టీ, లేదా ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన వార్తలు, చేసిన ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య సూచించారు. కాగా మంత్రి కేటీఆర్, మీడియా ముఖంగా మీడియాకే అల్టిమేటమ్ ఇవ్వడం ప్రజా స్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ఇష్టారాజ్యంగా మాట్లాడటం కేటీఆర్‌కు శోభనివ్వదని పేర్కొన్నారు. మోడీ ముఖ్యమంత్రిగా గుజరాత "లో చోటుచేసుకున్న అల్లర్లు, మూక దాడులపై రూపొందించిన బీబీసీ డాక్యుమెంటరీని దేశంలో నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి కేటీఆర్ ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య

- మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసిన బీసీ నాయకులు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలేజీ, పాఠశాల విద్యార్థులకు, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. 2017లో మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సుల కంటే ముఖ్యమంత్రి మెస్ చార్జీలు ఎక్కువ చేసి పెంచారని, ఇప్పుడు కూడా అదే విధంగా పెంచాలని కోరారు. ఆరు సంవత్సరాల కాలంలో మెస్ చార్జీలు పెంపుదల లేదన్నారు. కానీ నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగాయని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం చేసిన ప్రతిపాదనలు 25 శాతం సరిపోదని, దీనిని కనీసం 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు నెలకు రూ.1500 నుంచి రూ. 3 వేలకు, పాఠశాల హాస్టల్, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలు 8 నుంచి పదవ తరగతి వరకు రూ.1100 నుంచి రూ.2500కు, మూడో తరగతి నుంచి ఏడో తరగతి వారికి రూ.950 నుంచి రూ. 2000కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థులకు జనాభా ప్రకారం 500 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు పాకెట్‌మని మంజూరు చేయాలని కోరారు. హాస్టళ్లలో వర్కర్లు సరిపోను లేరని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, ఇంటర్ చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులు ప్రభుత్వమే భరించాలని, ర్యాంకుల నిబంధన ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం పెండింగ్‌లో ఉన్న ఐదు లక్షల 40 వేల మందికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని తగు విధంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. మెస్ చార్జీలు 50 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి.. పెంచేలా నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, రాజ్ కుమార్, వేముల రామకృష్ణ, వెంకట్ యాదవ్, నందా గోపాల్, నిఖిల్, నిమ్మల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ఉపయోగం

- టీఎస్‌కాస్ట్‌తో బాసర ఆర్జీయూకేటీ అవగాహన ఒప్పందం
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో సంతకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్ కాస్ట్‌తో బాసర ఆర్జీయూకేటీ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్జీయూకేటీ వీసీ వి వెంకటరమణ సమక్షంలో టీఎస్ కాస్ట్ మెంబర్ సెక్రెటరీ ఎం నగేష్, ఆర్జీయూకేటీ డైరెక్టర్ వి సతీష్‌కుమార్ ఆ ఒప్పంద పత్రంపై గురువారం హైదరాబాద్‌లో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల టీయస్ కాస్ట్ - బాసర ఆర్జీయూకేటి రెండూ ఉమ్మడి ఆసక్తి ఉన్న రంగాలైన పరిశోధన, శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు ఎంతగానో ఉపయోగపడు తుందని చెప్పారు. ప్రయోగశాల నుంచి సాంకేతికతలను జోడిస్తూ ఉమ్మడి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టలతోపాటు సెమినార్లు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు చేపట్టేందుకు టీఎస్ కాస్ట్ ద్వారా ఆర్జీయూకేటీ యూజీ, పీజీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించుకోవడం, విద్యార్థుల్లో వాటి పట్ల మరింత ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో బాసర ఆర్జీయూకేటిలో మౌలిక వసతులు ఎంతో మెరుగుపడ్డాయని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు అభ్యసిస్తున్నారని అన్నారు. ఆర్జీయూకేటి సహకారంతో నిర్మల్ జిల్లాను ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్జీయూకేటీ వీసీ వి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అంకుర సంస్థల ఏర్పాటుకు తాము కృషి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే నిర్మల్ జిల్లాలో ఆర్జీయూకేటికి అనుబంధంగా నిర్మల్ ఇన్నోవేషన్ హబ్ (ఎన్ఐహెచ్)ను ఏర్పాటు చేస్తామన్నారు. నిజామాబాద్‌తో పాటు నిర్మల్ జిల్లాలో కూడా డిజైన్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

నేడు మహిళా గోస..బీజేపీ భరోసా దీక్ష

- పాల్గొననున్న డీకే అరుణ, విజయశాంతి, మహిళా మోర్చా నాయకులు : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మహిళలకు సీఎం కేసీఆర్ కుటుంబం చేస్తున్న అన్యాయాలనూ, మోసాలను ఎండగట్టడమే ధ్యేయంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం 'మహిళా గోస...బీజేపీ భరోసా' పేరుతో దీక్ష చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా సమావేశాన్ని నిర్వహించారు. దీక్షలో తమ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతి, మహిళా మోర్చా నాయకులంతా పాల్గొంటారని తెలిపారు.

హక్కు పత్రాలివ్వొద్దని హైకోర్టులో పిల్

- గిరిజన సంక్షేమ శాఖ కౌంటర్ పిటిషన్ వేయాలి : తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే సంస్థ కు చెందిన పద్మనాభరెడ్డి హైకోర్టులో పబ్లిక్ లిటిగేషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ తక్షణమే కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. శతాబ్దాలుగా అడవుల్లో అంతర్భాగంగా ఉన్న గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించడంలో స్వాతంత్రం ముందు, తర్వాత కూడా పాలక ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని గుర్తుచేశారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ను వామపక్షాల ఒత్తిడితో నాటి యూపీఏ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. అడవుల్లో అంతర్భాగంగా ఉన్న గిరిజనులు, పేదలకు అటవీ భూములపై హక్కులు కల్పించటం వలన అడువులు నాశనమవుతాయనీ, పర్యావరణం దెబ్బతింటుందని ఆనాడే కొందరు పర్యావరణవేత్తలు సుప్రీంకోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. వాటన్నిటిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతనే..ఉన్నత న్యాయస్థానం చట్టాన్ని అమలు చేయాల్సిందేనని తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంటు, సుప్రీంకోర్టు సైతం అంగీకారం తెలిపిన చట్టాన్ని నిలుపుదల చేయాలని ఇప్పుడు పద్మనాభరెడ్డి వంటివారు హైకోర్టులో పిల్ వేయడం హాస్యా స్పదంగా ఉన్నదని విమర్శించారు. పర్యావరణం పట్ల పద్మనాభ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తూ పర్యావరణాన్ని ధ్వంసం చేసేవిధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెస్తున్న అటవీ సంరక్షణ నియమాలు 2022 బిల్లును ఎందుకు వ్యతిరేకించటం లేదని ప్రశ్నించారు. అడవుల్లో జీవిస్తున్న గిరిజనులు అడవులను కాపాడుతున్నారని గుర్తుచేశారు. నామమాత్రంగా చట్టాన్ని అమలు చేయటం వలన నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం తెలంగాణ పరిధిలో 15 లక్షల ఎకరాలకు గాను కేవలం 3 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కుపత్రాలిచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చట్టాన్ని తిరిగి అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన ఫలితంగా 2021లో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తానని అంగీకరించారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం న్యాయపరమైన ఆటంకాలను అధిగమించి అందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీ అయి నందున ఆ శాఖ ఆధ్వర్యంలో కౌంటర్ పిటిషన్ వేయాలని తెలంగాణ గిరిజన సంఘం, ఇతర గిరిజన సంఘాలను కూడా ఈ పిటిషన్ లో ఇంప్లీడ్ అయ్యే విధంగా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు .





40 మంది కేబీజీవీ విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారమే కారణమా ?

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని సిగ్నల్ కాలనీలో ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో 40 మంది బాలికలు అస్వస్థతకు గురికావడంతో గురు వారం ఉదయం వారిని హుటా హుటిన మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిం చారు. పాఠశాల ఎస్ఓ భవాని తెలిపిన కథనం ప్రకారం.. బుధవారం రాత్రి బాలికలు టమాటా కూరతో భోజనం చేయడంతో రాత్రి నుంచి కొంత మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలైనట్టు తెలి పారు. విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం గోప్యంగా ఉంచి వైద్య అధికారులను పిలిపించి పాఠశాలలోనే చికిత్స అందించారు. ఉదయం మరికొంతమంది విద్యా ర్థులు కూడా అస్వస్థతకు గురికావడంతో భయాం దోళనలకు గురైన పాఠశాల సిబ్బంది విద్యార్థుల అస్వస్థత విష యాన్ని ఉన్నతాధి కారులకు వివరిం చారు. వారి ఆదే శాల మేరకు బాలి కలను ఉదయం హుటా హుటిన 108 అంబులెన్స్‌తో పాటు కార్లలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. పాఠశాల భోజనం తయా రీలో కలుషితమైన నీటిని వాడారా? టమాటా కర్రీలో ఏమైనా పడిందా? అనే విషయం తెలియడం లేదు. ఈ ఘటనలో మొత్తం 40 మంది బాలికలు అస్వస్థ తకు గురైనట్టు తెలు స్తోంది. అధికారులు పాఠశాల లోని తాగునీరు, భోజనం సీజ్ చేసి ఫోరెన్సిక్‌కు పంపించినట్టు సమా చారం. అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న కేజీబీవీ విద్యార్థినీలను ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, మున్సి పల్ చైర్మెన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి పరామర్శిం చి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. కాగా, బాలికలు అస్వస్థతకు గురైన విష యాన్ని పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమా చారం ఇవ్వకపోవడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోమటిరెడ్డి ఆధిపత్య అహంభావాన్ని భరించలేం..

ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించాలి విలేకర్ల సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డా. చెరుకు సుధాకర్

నవతెలంగాణ - నల్లగొండ

భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధిపత్య అహంభావాన్ని ఇక భరించలేమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. పలు కుల సంఘాలు, విద్యార్థి, ప్రజాసంఘాలు, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నవ్య ఆస్పత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కుటుంబం 40 ఏండ్లుగా అనేక కష్టాలను చూసిందన్నారు. తన జీవితంలో ఇలాంటి మాటలు పడాల్సి వస్తదని ఏనాడూ కలలో కూడా ఊహించలేదన్నారు. కోమటిరెడ్డి ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉండి 'నా కుమారున్ని, నన్ను తిట్టిన తీరు చూస్తే కన్న తల్లిని అవమానపర్చినట్టే ఉందని' అన్నారు. మరోవైపు న్యాయస్థానంపై గౌరవం ఉందని మాట్లాడుతుంటే సమాజం సిగ్గు పడుతుందన్నారు. ఇవాళ పున్నా కైలాష్ నేతను బెదిరిస్తున్నారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి కోసం డబ్బులు పంచింది 'మీరు' కాదా అని ప్రశ్నించారు. 'నీ క్షమాపణ అవసరం లేదు. నీ ప్రవర్తన మార్చుకో.. నీకు కోర్టుల మీద, రాజ్యాంగం మీద గౌరవముంటే గిట్లనేనా మాట్లాడేది' అని ప్రశ్నించారు. నల్లగొండ ఎంపీగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ విషయంలో స్పందించాలన్నారు. కోమటిరెడ్డికి పాశ్చాత్తాపం లేదని, ఏనాడూ ఆయన చేసిన వ్యాఖ్యలను పున:పరిశీలన చేసుకోలేదని విమర్శించారు. పార్టీకి అక్కరొచ్చే పని చేయమంటే.. కాళ్లల్ల కట్టెలు పెడుతున్నారన్నారు. 'నా జీవితంలో ఏనాడూ వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదు.. నిరూపిస్తే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాస్తా' అని అన్నారు. కోమటిరెడ్డి తీరు మార్చుకోకపోతే ప్రజలే గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు తీగల ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ.. చెరుకు సుధాకర్‌ని పార్టీలకతీతంగా ఉద్యమకారునిగా బహుజన వర్గాలకు చెందిన నాయ కునిగా సమాజం చూస్తుందన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి భావోద్వేగంతో మాట్లాడిన మాటలు కావు.. అగ్రకుల అహంకారంతో మాట్లాడినట్టే ఉందన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మాట్లాడుతూ.. చెరుకు సుధాకర్‌పై వెంకటరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనేక గ్రూపులు తయారు చేసి పంచాయితీలకు తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి విధానం సరిగ్గా లేదన్నారు. ఈ సమావేశంలో తిప్పర్తి జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరి కంటి కాశయ్య, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తలమల్ల హుస్సేన్, ఎంఎస్పీ నాయకులు ఆడెపు నాగార్జున, యాతాకుల రాజయ్య, బకరం శ్రీనివాస్ మాదిగ, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మెన్ పందుల సైదులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐతగోని జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు.

కవిత సమస్య వేరు... ప్రజల సమస్యలు వేరు

- ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లిక్కర్ స్కాంలో ఈడీ నోటీసులు అందుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమస్య వేరనీ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వేరని టీజేఎస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మార్చి 10న నిర్వహించనున్న తెలం గాణ బచావో సదస్సు బ్రోచర్‌ను ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కవిత అయినా, ఆదానీ అయినా సరే విచా రించాల్సిందేనని తెలిపారు. 12 ఏండ్ల క్రితం నిర్వహించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగించి, తెలంగాణను కాపాడుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం తెలంగాణ ఉద్యమకారులతో హైదరా బాద్ బాగ్‌లింగంపల్లి లోని వీఎస్టీ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ బచావో సదస్సును నిర్వహిస్తు న్నట్టు తెలిపారు.

సంపాదకీయం

సవాళ్లు అధిగమిస్తూ... కొత్త అడుగులేస్తూ...

ప్రపంచంలో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం చైనా. కొనుగోలు శక్తి (పిపిపి)పద్ధతిలో లెక్కించినపుడు జీడీపీలో అది తొలి స్థానంలో ఉంది. సాంప్రదాయ లెక్కింపులో త్వరలో అమెరికాను అధిగమించి అగ్రస్థానానికి చేరనుందని అందరూ చెబుతున్నదే. దీని అర్థం అమెరికా లేదా ఐరోపా ధనిక దేశాల స్థాయికి చేరిందని కాదు. ఇటీవలి

> చైనా పార్లమెంటు ప్రస్తుతం చర్చిస్తున్న మరో ప్రధాన అంశం ఆర్థిక, విత్తరంగాల డిజిటలైజేషన్ వంటి కృత్రిమ మేధ పద్ధతుల ద్వారా జనానికి, ఇతర దేశాలకు సులభంగా సేవలను అందించటం, అమెరికా, ఐరోపా దేశాలతో పోటీ పడేట్లు తీర్చిదిద్దటం. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు అందకుండా కట్టడిచేసేందుకు ఆ రంగంలో ముందున్న దేశాలను కూడ గట్టుకొని అమెరికా సాంకేతిక పోరును ప్రారంభించింది. దాన్ని అధిగమించకపోతే చైనా పురోగమనానికి తాత్కాలికంగానైనా కొన్ని ఆటంకాలు తలెత్తుతాయి. అందుకే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన శాస్త్ర, పరిశోధన అభివృద్ధి రంగాలను నడిపించాలని చైనా నిర్ణయించింది.

కాలంలో తలెత్తిన సమస్యల పూర్వరంగంలో చైనా ద్రవ్య లేదా విత్త రంగాన్ని మరింతగా క్రమబద్ధీకరించే పెనుమార్పులను ప్రకటించారన్నది తాజావార్త. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో దానికి తుదిరూపం ఇస్తారు. మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా మారకపోతే అదే పెద్ద ఆటంకంగా మారుతుంది. చైనాలో ఏం జరిగినా అది కొంత మందికి వింతగానూ మరి కొందరికి ప్రతికూలంగా కనిపిస్తుంది. అనేక దేశాల్లో ముందుగానే టాంటాం వేస్తే ఒక విధానంపై చైనాలో అంతర్గతంగా చర్చ జరిపి సిద్ధంకాగానే ప్రకటన అమలు చేస్తారు. ఏ పద్ధతిలో చేశారు అనేదాని కంటే ప్రకటించిన విధానం ఎలాంటి ఫలితాలను ఇచ్చిందన్న దాన్ని గీటురాయిగా తీసుకోవాలి. మన దేశ మార్కెట్‌ను స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విదేశాలకు తెరిచాం. కానీ చైనా 1978లో ఆ పని చేసింది. రెండు దేశాలూ సాధించిన వృద్ధిని చూస్తే నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా కనిపిస్తుంది.

తమదేశ లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం జరుపుతున్నట్లు చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. దానిలో భాగంగానే గత నాలుగున్నర దశాబ్దాల్లో వచ్చిన అనుభవాలు, తలెత్తిన ప్రతికూల సమస్యలు, తాజాగా అమెరికా, ఇతర ధనిక దేశాల నుంచి ఎదురవుతున్న కొత్త సవాళ్ల నేపథ్యంలో విత్త రంగ నియంత్రణలో పెనుమార్పులను తలపెట్టింది.



బ్యాంకింగ్, బీమా రంగాల్లో ఉన్న సంపద విలువ 400లక్షల కోట్ల ఇవాన్‌లు లేదా 57.7లక్షల కోట్ల డాలర్లు. ఇటీవలి కాలంలో కొన్ని చోట్ల పేలినట్లు చెబుతున్న నిర్మాణ రంగ బుడగలు, దివాలాతీసిన బ్యాంకులు, వీధుల్లోకి వచ్చిన జనం, జాక్ మా వంటి వారు చిన్న కంపెనీలను మింగివేసేందుకు చూడగా అదుపుచేసిన తీరు, కంపెనీల్లో మదుపుదార్లకు రక్షణ వంటి అనేక అంశాలు ఒక సమగ్రమైన నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చాయి. అంతేకాదు బిఆర్ఐ పేరుతో వివిధ దేశాల్లో పెడుతున్న పెట్టుబడులు, ఇస్తున్న రుణాల గురించి పెద్ద ఎత్తున చైనా వ్యతిరేకులు చేస్తున్న తప్పుడు ప్రచారం గురించి తెలిసిందే. ఏక గవాక్షం ద్వారా ఇలాంటి వాటిని నడిపించటం, జవాబుదారీతనాన్ని పెంచటం కూడా తాజా మార్పుల వెనుక ఉంది.

దీని అర్థం అక్కడేదో అదానీ కంపెనీల వంటి భారీ కుంభకోణాలో, ఆర్థిక రంగాన్ని కుదేలు చేసే పరిణామాలో జరిగినట్లు కాదు. మన దేశం ప్రతి రాష్ట్రానికి ఒక రిజర్వుబాంకు శాఖ ఉంటే చైనా రిజర్వుబాంకు శాఖలు కేవలం పదకొండు మాత్రమే. మన జీడీపీ మూడున్నరలక్షల కోట్ల డాలర్లు కాగా పదిహేడున్నరలక్షల కోట్ల డాలర్లతో చైనా ఉంది. అందువలన చైనా రిజర్వుబాంకు విస్తరణ కూడా తాజాగా తలపెట్టిన మార్పుల్లో ఒకటి. వివిధ రంగాలకు ఉన్న నియంత్రణ వ్యవస్థలు ఒకదానికి మీదకు ఒకటి రావటం వంటి లోపాలను అవకాశంగా తీసుకొని అక్రమాలకు పాల్పడిన వారిని అనేక మందిని శిక్షించారు. పెద్ద సంఖ్యలో ఉన్న విదేశీ సంస్థలు వాటి ఆర్థిక, ద్రవ్య సంబంధ లావాదేవీలు, వాటి సంపద కూడా తక్కువేమీ కాదు. వాటన్నింటిని మరింతగా నియంత్రించాల్సిన అవసరం ఉంది. ఈ చర్యల ద్వారా చైనా కమ్యూనిస్టు పార్టీ, తద్వారా అధినేత షీ జిన్‌పింగ్ నియంత్రణ, అధికారం మరింతగా విస్తరించుకొనేందుకే అని విదేశాల్లో కొందరు చిత్రించటంలో అర్థం లేదు. తమ అక్రమాలకు దారులు బంద్ అవుతున్నాయనే ఏడుపు తప్ప మరొకటి కాదు.

చైనా పార్లమెంటు ప్రస్తుతం చర్చిస్తున్న మరో ప్రధాన అంశం ఆర్థిక, విత్తరంగాల డిజిటలైజేషన్ వంటి కృత్రిమ మేధ పద్ధతుల ద్వారా జనానికి, ఇతర దేశాలకు సులభంగా సేవలను అందించటం, అమెరికా, ఐరోపా దేశాలతో పోటీ పడేట్లు తీర్చిదిద్దటం. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనాకు అందకుండా కట్టడిచేసేందుకు ఆ రంగంలో ముందున్న దేశాలను కూడ గట్టుకొని అమెరికా సాంకేతిక పోరును ప్రారంభించింది. దాన్ని అధిగమించకపోతే చైనా పురోగమనానికి తాత్కాలికంగానైనా కొన్ని ఆటంకాలు తలెత్తుతాయి. అందుకే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన శాస్త్ర, పరిశోధన అభివృద్ధి రంగాలను నడిపించాలని చైనా నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న జాతీయ విత్త క్రమబద్ధీకరణ కమిషన్(ఎన్ఎఫ్ఆర్‌సి)లో ఇది కూడా భాగంగానే ఉండనుంది. షీ జింపింగ్ 2013లో అధికారానికి వచ్చిన తరువాత మూడు అంశాల పునర్వ్యస్థీకరణల మీద కేంద్రీకరించారు. ఒకటి ద్రవ్య స్థిరత్వం-అభివృద్ధి కమిషన్, రెండవది వృద్ధుల వ్యవహారాల మంత్రిత్వశాఖ, మూడవది తాజా అంశం. అనేక ఐరోపా దేశాలు వందల సంవత్సరాల పాటు అభివృద్ధి చెందిన తరువాత జనాభా పెరుగుదల తగ్గి, వృద్ధుల సంఖ్య పెరగటాన్ని చూశాం. ఇప్పుడు చైనా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉండగానే ఆ సమస్యలను ఎదుర్కొం టున్నది. సోషలిస్టు వ్యవస్థలో మానవాభివృద్ధి, దానిలో భాగంగా జీవితకాలం పెరగటం దీనికి ఒక కారణంగా చెప్పవచ్చు. అందువలన చైనా సమాజం ఈ సవాళ్లను కూడా అధిగమించే సత్తా, ముందు చూపు కలిగి ఉందని చెప్పవచ్చు.

పాకిస్థాన్ సంక్షోభం... ఒక పరిశీలన

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు ఎప్పటికప్పుడు జరుగుతున్నప్పటికీ, పాకిస్థాన్ నిజానికి మిలిటరీ ఆధ్వర్యంలో నడిచే దేశం. కాబట్టి సైన్యం ఇప్పుడు అక్కడ అన్నిటికన్నా ప్రాధాన్యత కలిగిన విభాగం. ఆ సైన్యానికే రెండు పూటలా భోజనం కష్టమవుతుండడం పాకిస్థాన్‌లో నెలకొన్న తీవ్ర సంక్షోభానికి దర్పణం పడుతోంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో పాటు తీవ్రవాద దాడులు కూడా పదే పదే జరుగుతున్నాయి. సైన్యం, పోలీసులకు వ్యతిరేకంగా ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) ఈ దాడులకు పాల్పడుతోంది. ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న పాకిస్థాన్‌లో రాజకీయ రంగం కూడా ఉత్కంఠ రేపుతోంది. దీని నుంచి పాకిస్థాన్ ఆర్మీ కూడా ప్రయోజనం పొందాలని చూస్తోంది.

పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ఆ దేశ విదేశీ అప్పు 1,30,000 కోట్ల డాలర్లు. దేశ బడ్జెట్‌లో సగం విదేశీ రుణం చెల్లించేందుకే సరిపోతుంది. ఆహార పదార్థాలు, ఇంధనం తదితరాలను దిగుమతి చేసుకోవడానికి అవసరమైన విదేశీ మారకద్రవ్య నిల్వలు కరువయ్యాయి. పాకిస్థాన్ తన విదేశీ రుణంలో భాగంగా వచ్చే ఏడాదిలో 22 బిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం తన దగ్గర ఉన్న విదేశీ మారకద్రవ్య నిల్వలు 300 కోట్ల డాలర్లు మాత్రమే. తాజా సమాచారం ప్రకారం, రోజువారీ వినియోగ వస్తువుల ధరలు నలభై శాతం పెరిగాయి. దీంతో పెట్రోల్ ధర రూ.267, డీజిల్ రూ.184, కిరోసిన్ ధర రూ.187 ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, పెట్టుబడిదారీ దేశాలు తమ రుణభారాన్ని తగ్గించుకోవడానికి అనుసరించిన పన్ను సంస్కరణలు

> పాకిస్థాన్‌లో మత ఛాందసవాదం, రాజకీయ నాయకుల అవకాశవాదం, సైనిక నాయకత్వం, అమెరికా సహకారంతో మత ఛాందసవాదం, ఉగ్రవాదం వెరసి పాకిస్థాన్‌ను సంక్షోభంలోకి నెట్టాయి. అమెరికా సహా ప్రపంచ ఆధిపత్య దేశాల క్రియాశీల మద్దతుతో, సైన్యం పాకిస్థాన్ రాజకీయాలపై పట్టు సాధించింది. పాకిస్థాన్‌లో నేడు మిగిలి ఉన్నది మత ఛాందసవాదం, ఉగ్రవాద దాడులు, అధికార దాహంతో కూడిన సైన్యం, ప్రజాస్వామ్యంలో పునాదిలేని రాజకీయ పార్టీలు, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థ, ప్రమాదకరమైన అణ్వాయుధాలు. అమెరికా విదిల్చే రొట్టెముక్కల కోసం, అది తెచ్చే ఒత్తిళ్లకు దాసోహమైనందుకు తన కాళ్ళ కింద నేల కదిలిపోతున్నా గ్రహించని దేశం యొక్క విషాద చిత్రమే నేటి పాకిస్థాన్ ముఖచిత్రం.

విఫలమయ్యాయి.

ఈ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవడానికిగాను... ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు తగ్గించడం, విదేశాలలో పనిచేస్తున్న పాక్ రాయబార కార్యాలయాల సంఖ్యను తగ్గించడం, కోత పెట్టడం వంటి తీవ్రమైన పొదుపు చర్యల వైపు పాకిస్థాన్ అడుగులు వేస్తోంది. పాక్ గూఢచారి సంస్థ (ఐఎస్ఐ)కి మాత్రం ఎలాంటి నిధుల కొరత లేదు. ఇది ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ప్రజలను మరింత దుర్భర పరిస్థితులలోకి నెడుతోంది.

ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి పాకిస్థాన్ ఎంచుకున్న చివరి మార్గం అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి అప్పు తీసుకోవడం. ఇప్పుడు అందజేసే సాయంతో పాటు, ఐఎమ్ఎఫ్ ఇప్పటికే 22సార్లు పాకిస్థాన్‌కు రుణాలు మంజూరు చేసింది. మరో 6.5 బిలియన్ డాలర్ల రుణం కోసం పాకిస్థాన్ ఐఎంఎఫ్‌తో చర్చలు జరుపుతోంది. అందుకుగాను ఐఎంఎఫ్ నిర్మాణాత్మక సంస్కరణలతో సహా అనేక చర్యలను ముందుకు తెచ్చింది. తన విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచుకోవడానికి, తన విదేశీ అప్పుల వాయిదాలను తిరిగి చెల్లించడానికి వాటిని అంగీకరించడం మినహా పాకిస్థాన్‌కు మరో మార్గంలేదు. అంతే కాకుండా సౌదీ అరేబియా, చైనా సహా పశ్చిమాసియా దేశాల సాయాన్ని కూడా అది కోరింది.

కోవిడ్ మహమ్మారి ప్రభావం నుండి కోలుకోక ముందే గత సంవత్సరం సింధ్, బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంక్వా రాష్ట్రాలను నాశనం చేసిన వరదలు పాకిస్థాన్ వెన్నెముకను విరిచేశాయనే చెప్పవచ్చు. మూడున్నర కోట్ల మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన ఈ వరదల్లో 1800 మందికిపైగా మరణించారు. 20 లక్షల మంది



నిరాశ్రయులయ్యారు. 1500 కోట్ల డాలర్ల ఆస్తి నష్టం జరిగింది.

పని చేయని అమెరికన్ ఏటీఎం

1951 - 2011 మధ్య ఆరు దశాబ్దాల పాటు పాకిస్తాన్‌కు అమెరికా 6,700 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం అందించింది. అయితే గత 20ఏండ్లలో 3,200 కోట్ల డాలర్లు ఆర్థిక సాయం మాత్రమే అందించింది. అంతే కాకుండా కోవిడ్ మహమ్మారిపై పోరాడేందుకు ఎనిమిది కోట్ల డాలర్ల సాయం కూడా అందించింది. ఈ ఆర్థిక సహాయంలో ఎక్కువ భాగం 1960ల నుండి పాకిస్థాన్ అనుసరిస్తున్న అమెరికా అనుకూల విదేశాంగ విధానంలో భాగం. ప్రొఫెసర్ అజరు దర్శన్ బెహ్రా ప్రకారం... 1960లలో జనరల్ యాహ్యా ఖాన్ హయాంలో, 1980లలో జనరల్ జియా-ఉల్-హక్ కాలంలో పాకిస్థాన్ అమెరికాకు తాబేదారుగా వ్యవహరించింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఆఫ్ఘనిస్తాన్‌లో జోక్యం చేసుకున్న అమెరికా పాకిస్థాన్‌ను పావుగా ఉపయోగించుకుంది. ఇందుకుగాను ఆ దేశానికి ఉదారంగా నిధులు అందజేసింది. ఆ తరువాత జనరల్

> ఆఫ్ఘనిస్తాన్‌లో ఓటమిని అంగీకరించి వెనక్కి తగ్గిన అమెరికాకు ఇప్పడు పాకిస్థాన్ అవసరం తీరిపోయింది.. అమెరికా భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు తోడ్పాటునందించడం పాకిస్థాన్ చేసిన ఘోర తప్పిదం. వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు జో బైడెన్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. పాకిస్థాన్ సహా సంబంధిత దేశాలకు అమెరికా ఏటీఎం కాకూడదని, అధికారంలోకి వస్తే పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం నిలిపివేస్తామని న్యూయార్క్ పోస్ట్‌లో రాసిన కథనంలో హేలీ పేర్కొన్నారు..

పర్వేజ్ ముషారఫ్ హయాంలో ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దాడులకు పాక్ సహకరించింది.

ఆఫ్ఘనిస్తాన్‌లో ఓటమిని అంగీకరించి వెనక్కి తగ్గిన అమెరికాకు ఇప్పుడు పాకిస్థాన్ అవసరం తీరిపోయింది.. అమెరికా భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు తోడ్పాటునందించడం పాకిస్థాన్ చేసిన ఘోర తప్పిదం. వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు జో బైడెన్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. పాకిస్థాన్ సహా సంబంధిత దేశాలకు అమెరికా ఏటీఎం కాకూడదని, అధికారంలోకి వస్తే పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం నిలిపివేస్తామని న్యూయార్క్ పోస్ట్‌లో రాసిన కథనంలో హేలీ పేర్కొన్నారు..

తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్

ఇది సంక్షోభంలో ఒక అంశం మాత్రమే. అసలు ఈ ఉగ్రవాద సంస్థ మొదట ఉనికిలోకి తెచ్చింది అమెరికానే. ఆర్మీ చీఫ్ జియా-ఉల్-హక్ సైనిక పాలకుడిగా ఉన్న సమయంలో సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా ఈ తాలిబాన్లను తెరపైకి తెచ్చింది. దాని ఉప ఉత్పత్తే తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టిటిపి). ఈ ఉగ్రవాద సంస్థ ఇప్పుడు పాకిస్థాన్ ప్రభుత్వానికే సవాల్ విసురుతోంది. ఆఫ్ఘనిస్తాన్ లాగా పాకిస్థాన్‌ను పూర్తిగా ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే టిటిపి లక్ష్యం. అందుకోసం అమాయకులను ప్రాణాపాయంలోకి నెట్టే ఉగ్రవాద దాడులకు తెగబడ్డారు.

2022 ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం ద్వారా ప్రధానమంత్రి పదవి నుండి తొలగించబడిన తెహ్రీ-కె ఇన్సాఫ్ పార్టీ నాయకుడు ఇమ్రాన్ ఖాన్ ఆందోళన బాట పట్టారు. సైన్యం జోక్యంతో ఆయన గద్దెనెక్కిన సంగతి తెలిసిందే. నవంబర్‌లో ఇమ్రాన్‌పై జరిగిన హత్యాయత్నం షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని మరింత బలహీనపరిచింది. ఇమ్రాన్‌పై విదేశీ నిధుల దుర్వినియోగం, దాడులు, హత్యాయత్నాలు, అనేక అవినీతి కేసులు ఉన్నప్పటికీ పాక్ కోర్టులు ఇమ్రాన్‌కు అండగా నిలుస్తున్నాయని బలమైన ఆరోపణ ఉంది.

గత పార్లమెంట్ ఎన్నికల్లో పాక్ ఆర్మీ జోక్యం వల్లే ఇమ్రాన్ ఖాన్ విజయం సాధించారని ఆరోపణలు వచ్చాయి. ఆర్మీలో ముఖ్యమైన పోస్టుల నియామకాల విషయంలో ఇమ్రాన్ ఖాన్‌కు, ఆర్మీ చీఫ్‌కు మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా ఆయన ప్రధాని పదవిని కోల్పోయారు. ఆ తర్వాత మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సోదరుడు షెహబాజ్ షరీఫ్ ప్రధాని అయ్యారు. ఆ మంత్రివర్గం ఏర్పాటులో సైన్యం పాత్ర కూడా ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే, సైన్యాన్ని విస్మరించి, వారితో పోరాడుతూ పాకిస్థాన్‌లో ఏ ప్రభుత్వమూ ముందుకు సాగదు. ఐఎమ్ఎఫ్ రుణం పొందడానికి, రక్షణ వ్యయం కూడా తగ్గించబడింది. ఒకవేళ ప్రభుత్వానికి దమ్ముంటే సైన్యం అంగీకరిస్తుందో లేదో చూడాలి. ఇది మరో సైనిక తిరుగుబాటుకు కూడా దారితీయవచ్చు.

> కోవిడ్ మహమ్మారి ప్రభావం నుండి కోలుకోక ముందే గత సంవత్సరం సింధ్, బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంక్వా రాష్ట్రాలను నాశనం చేసిన వరదలు పాకిస్థాన్ వెన్నెముకను విరిచేశాయనే చెప్పవచ్చు. మూడున్నర కోట్ల మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన ఈ వరదల్లో 1800 మందికిపైగా మరణించారు. 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 1500 కోట్ల డాలర్ల ఆస్తి నష్టం జరిగింది.

పాకిస్థాన్‌లో మత ఛాందసవాదం, రాజకీయ నాయకుల అవకాశవాదం, సైనిక నాయకత్వం, అమెరికా సహకారంతో మత ఛాందసవాదం, ఉగ్రవాదం వెరసి పాకిస్థాన్‌ను సంక్షోభంలోకి నెట్టాయి. అమెరికా సహా ప్రపంచ ఆధిపత్య దేశాల క్రియాశీల మద్దతుతో, సైన్యం పాకిస్థాన్ రాజకీయాలపై పట్టు సాధించింది. పాకిస్థాన్‌లో నేడు మిగిలి ఉన్నది మత ఛాందసవాదం, ఉగ్రవాద దాడులు, అధికార దాహంతో కూడిన సైన్యం, ప్రజాస్వామ్యంలో పునాదిలేని రాజకీయ పార్టీలు, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థ, ప్రమాదకరమైన అణ్వాయుధాలు. అమెరికా విదిల్చే రొట్టెముక్కల కోసం, అది తెచ్చే ఒత్తిళ్లకు దాసోహమైనందుకు తన కాళ్ళ కింద నేల కదిలిపోతున్నా గ్రహించని దేశం యొక్క విషాద చిత్రమే నేటి పాకిస్థాన్ ముఖచిత్రం.

వ్యాసకర్త: ప్రొఫెసర్ జోసెఫ్ ఆంటోనీ



మత్తు ముంగిట దేశ భవిష్యత్తు..!

ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా మన భారత్ విరాజిల్లుతోంది. వివిధ రంగాల్లో అభివృద్ధి మన యువత మీదనే ఆధారపడి ఉంటుంది అనేది వాస్తవం. నూతన పరిశోధనలకు, ఆవిష్కరణలకు నేటి యువత కృషి చేయవలసి ఉంటుంది. ఆ విధంగా యువత పురోగతి సాధించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ విద్య వైద్యం అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతీ ఒక్కరూ సమాన అవకాశాలు అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. ఇటువంటి మహా సంకల్పం సాధించడానికి ప్రభుత్వాలు తమ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాడంతో పాటు, కుటుంబ సభ్యులు ముఖ్యంగా తల్లిదండ్రులు పాత్ర కీలకం అని గ్రహించాలి. "మొక్కై వంగనది, మ్రానై ఒంగునా...." అని పెద్దలు చెబుతారు. అనగా చిన్ననాటి నుంచి పిల్లలకు చదువు, సంస్కారం, మంచి అలవాట్లు, ప్రవర్తన నేర్పాలి. అప్పుడు మాత్రమే కుటుంబాలకు, దేశానికి మంచి తరాలను అందించగలం. అయితే, ఇటీవల కాలంలో దేశంలో యువతలో చాలా మంది అనేక చెడు వ్యసనాలకు బానిలుగా మారుతూ అటు కుటుంబానికి, ఇటు దేశానికి అభివృద్ధి నిరోధకులుగా, సమాజానికి చీడ పురుగులుగా పరిణిమిస్తూ వివిధ సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హత్యలు, మానభంగాలు, ప్రేమ వేధింపులు కాదంటే యాసిడ్ దాడులు, మత్తులకు బానిసలు, సామాజిక మాధ్యమాల్లో విహరించడం, వివాహేతర సంబంధాలు, సైబర్ నేరాలు ఇలా అనేక విధాలుగా మునిగి తేలుతూ ఉంటున్నారు.

ముఖ్యంగా యువత మద్యం, డ్రగ్స్ మత్తులో మునిగిపోతున్నారు. మన దేశంలోకి డ్రగ్స్ ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలు నుంచి ఎక్కువ మోతాదులో చేరుతున్నాయి. పాక్, మయన్మార్ సరిహద్దు ప్రాంతాలు నుంచి ఈ డ్రగ్స్ కుప్పలు తెప్పలుగా దేశం నలుమూలల వచ్చి చేరుతూ యువతను అన్ని విధాలా నాశనం చేస్తున్నాయి. మయన్మార్‌లోని పర్వత ప్రాంతాల్లో పండిస్తున్న గంజాయి ముఖ్యంగా నల్లమందు (ఓపియం) అసోం, నాగాలాండ్, మణిపూర్, మిజోరం మీదుగా దేశంలో ప్రవేసిస్తూ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. 2018లో జరిపిన ఒక సర్వేలో దేశంలో 23.2కోట్ల మంది డ్రగ్స్‌కు బానిస అయ్యారని, వీరిలో 10-17 సంవత్సరం వయస్సు గలవారు సుమారు 1.5 కోట్ల మంది ఉన్నారు అని తెలిపింది. ఐక్యరాజ్యసమితి యు.ఎన్.ఓ.డి.సి. కూడా భారత్ యువతలోని మత్తులకు బానిసలు అవటం పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. 2022 ఫిబ్రవరిలో నాటికి ఒక్క అసోం రాష్ట్రంలోనే 2,878 కేసులు నమోదు చేసి, 4,691 మందిని అరెస్టు చేశారంటే ఎంత దారుణంగా ఈ దందా కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇక 2023, ఫిబ్రవరి 20వ తేదీ నాటికి 1273.65 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా మత్తు దందాలకు "గోల్డెన్ ట్రయాంగల్"గా పేరు పొందిన ఈ సరిహద్దు ప్రాంతాలు దేశ యువతకు "డెత్ ట్రయాంగల్"గా మారుతోంది.

ఇక మనదేశంలో హైస్కూల్ స్థాయి నుంచి కళాశాల విద్యార్థులు వరకూ, పల్లెటూరు నుంచి పట్టణం వరకు ఈ డ్రగ్స్ మహమ్మారి కరోనా వైరస్ కంటే వేగంగా, విస్తృతంగా వ్యాప్తి చెందుతూ దేశ యువతను కబళిస్తున్న వేళ.... అందరూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. డ్రగ్ పెడ్లర్స్‌పై ఉక్కుపాదం మోపాలి. సరిహద్దుల్లో నిఘా పెంచాలి. అనుమానిత విదేశీయులుపై డేగకన్నుతో పరిశీలించాలి. పబ్స్, బార్, వివిధ పార్టీల ప్రదేశాలపై నిఘా పెంచాలి. ఇటీవల కాలంలో సెల్, రకరకాల వెబ్ సైట్లు యాప్‌లు అందుబాటులోకి రావడంతో అన్ని ప్రదేశాలకు, అందరికీ ఈ డ్రగ్స్ రక రకాల మార్గాల ద్వారా సులభంగా చేరిపోతున్నాయి. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి. పారదర్శకంగా పని చేయాలి. అప్పుడు మాత్రమే ఈ మత్తు పీడను నివారించగలం.

- రావుశ్రీ

మనుగీతలపై యుద్ధం చేసిన యోధురాలు సావిత్రి బాయి

"మంటలు భగ భగ మండుతుంటే, మంటలు మండుతున్నాయ్, కొందరు కాలిపోతున్నారు 'అగ్ని దేవునికి కోపమొచ్చిందని, ఎవరు మంటల వద్దకు వెళ్ళొద్దని వెళ్తే బూడిదవుతారని భయపెడుతున్నారు. మంటలకు కొందరు ఎదురెల్లి కుండలు, బిందెలు, బకీట్లు, చెంబులు పట్టుకొని నీళ్ల గుప్పుతున్నారు, మరికొందరు నీళ్ల చల్లుతూనే మంటలు పెట్టిన దాన్ని ఆచూకీ గుట్టు రట్టు చెయ్యబూనుతున్నారు". మంటలు రగులుతుంటే ఆపకుండా అడ్డుకొని చలిగాచుకొనే సాంప్రదాయవాదులు, గట్టవతల ఉన్నోళ్లు మస్తుచెబుతారు వాళ్ళకి పోయేది ఏమీలేదు. పైగా కాల్చుకతినే బ్యాచ్ ఉండనే ఉంటది. వారిదే ఈ దేశపు మనువాద వారసత్వం. ఎదురెల్లి సేవ చేసే వాళ్ళు, ప్రాణాలకు తెగించి కారణాలపై యుద్ధం చేసే వాళ్ళు ఏ సమాజానికైనా అవసరం పడ్డ వాళ్ళు కావాలి. వాళ్ళే నిజమైన త్యాగధనులు. ఆ త్యాగధనుల కోవలోకి ఈ దేశంలో చార్వాకులు, లోకాయతులు, బుద్ధుడు, జ్యోతిరావు పూలే, అంబేద్కర్, మార్క్స్ ఫాలోవర్స్ చేరుతారు. మహిళల్లో సాంప్రదాయ మనుగీతలను చెరిపిన మొదటి యోధురాలు సావిత్రిబాయి పూలే నే .



ఎ. విజయకుమార్

తొమ్మిదేళ్ళకే పెళ్లయి వంటింటి కుందేళ్లుగా మారే ఈ దేశపు ముఖచిత్రం మీద రంగు అద్దిన చెరిగిపోని కుంచె సావిత్రిబాయి పూలే. ఆమె ఒక ఉపాధ్యాయురాలుగానే అందరికీ తెలుసు. కానీ ఇంగ్లీష్ చదివిన ఫస్ట్ విమెన్, ఇంగ్లీష్ బోధించిన మొదటి లేడీ టీచర్, ఇంగ్లీష్‌లో లెటర్, కవిత్వం రాసిన మొదటి విమెన్ పోయెట్ కూడా సావిత్రినే. ఆధునిక కవయిత్రి కూడా ఆమెనే. ఆమె చదివిన నూట డెబ్బయ్ ఏళ్ల తర్వాత కూడా ఇంగ్లీష్‌లో కవిత్వం అటుంచితే ఇంగ్లీష్ ముక్కలు తెలవని ఆధునిక మహిళలు డెబ్బయ్ శాతం ఉన్నారంటే ఆశ్చర్యం లేదు. అంతేకాదు తెలుగు అక్షరంతో కూడా దోస్తీ చెయ్యని నలభై శాతం తెలంగాణ ఆడబిడ్డల చేతులు ఖాళీగానే ఉన్నాయి. సావిత్రి టీచర్‌గా అందరికి పరిచయమే. కానీ సరస్వతి ఎందరికి టీచర్‌గా తెలుసు? ఏ రాష్ట్రంలో, ఏ జిల్లాలో, ఏ ఊర్లో చదువు చెప్పిందో తెల్వదు. ఎవరికి చెప్పిందో తెలియదు. పోనీ ఎక్కడ పుట్టిందో అదైనా తెలుసునా అంటే తెలియదు అనే సమాధానమే వస్తుంది. కానీ సావిత్రి ఎక్కడ పుట్టిందో, ఎక్కడ చదువు చెప్పిందో, ఎవరికి చెప్పిందో స్పష్టంగా ఎవరైనా చెప్పగలరు. అయినా తెలియని అసలు ఉన్నదో లేదో పుట్టిందో లేదో ఊహల్లో చెప్పే సరస్వతి ఫొటోలు పెట్టి, చదువుల తల్లి అని ఊహల తల్లిని ఈ దేశపు మెజారిటీ ప్రజల మస్తిష్కాల్లో రుద్ది. ఆ ఊహ చదువుల దేవత ఏమిచెబుతుందో అర్థం కాక ఏదో చెప్పిందని సంస్కృతాన్ని తెలియని బలవంతంగా బహుజనులకు అంటగట్టి కుట్ర పన్నింది బ్రహ్మణవర్గం. పైగా అది ఎవరూ చదవద్దని ఆంక్షలు పెట్టి, పొరపాటున ఎవరైనా వింటే చెవుల్లో సీసం పోసింది. అత్యధికులకు తెలియని, నిషేధించిన సరస్వతి చదువుల తల్లి అని ఎందుకొప్పుకోవాలి. అందుకే అందరికి తెలిసిన సావిత్రి బాయి పూలేనే బహుజనపు తల్లి. ఆమె చదువు నిషేధించిన దేవత అసలే కాదు. భౌతికంగా బతికి విద్యాబుద్ధులు చెప్పి జ్ఞానం కలిగించిన ఎక్కుపెట్టిన ఏకలవ్యుని బాణపు లక్ష్యపు గురిని బహుజనులకు బతుకు చూపిన సావిత్రి బాయి పూలేనే నిజమైన చదువుల తల్లి .

"పితా రక్షతి కౌమారే, భర్తా రక్షతి యౌవ్వనే
పుత్రా రక్షతి వార్ధక్యే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి"

స్త్రీలకు పెళ్లే విద్య, భర్తే గురువు, ఇంటిపనులే



అభ్యసన విషయాలు అనే మనుస్మృతి గీతలను మొదట చెరిపినది ఆమె. రక్షణకే భర్త కాదని రణమే ఆయుధమనే రణధీరుడు జ్యోతిరావుపూలే సహకారంతో తనే గురువయ్యింది. నాలుకతో దబుడాన్ని చీల్చి ఇంగ్లీష్ అక్షరాలతో నాట్యమాడించింది. చెవుల్లో పోసిన సీసాన్ని కరిగించిన చరిత్రను తిప్పి తిరుగుబాటు యోధుల గానాన్ని వినిపించింది, వంటింటికి కట్టేసిన బంధాలను తెంపి తన కాళ్లతో జ్ఞానపు బాటలు పరిచింది.

స్త్రీకి ఏ జ్ఞాన విద్యనైతే మనుస్మృతి నిరాకరించిందో దానిని ఆమె పొందటానికి తొలి విద్యా గురువు భర్త కాగా, అతని మిత్రులు సఖరం యాశ్వంత్ పరాంజపే, కేశవ్ శివరాం భావేల్కర్‌ల సహాయ సహకారాలతో అహమ్మద్ నగర్‌లో ఫరార్స్ సంస్థ లోను, పూణేలో ఎం.ఎస్ మిచెల్ నిర్మల్ స్కూల్‌లోనూ సావిత్రి బాయి చదువుకోవటానికి, టీచర్స్ ట్రైనింగ్ పూర్తి చేయటానికి అవకాశాలను కల్పించాడు జ్యోతిరావ్‌పూలే. ఆ రకంగా 1848లో ఆయన పూణేలో భీడే వాడాలో ఆడపిల్లల బడి ప్రారంభించే నాటికి అతని సంస్కరణ భావాలకు తగిన చైతన్యంతో సామాజిక కార్యాచరణలో చేదోడు వాదోడుగా నిలబడగల వ్యక్తిగా ఆమె ఎదిగింది.

సాంప్రదాయ సమాజం పురుషులే కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగాపోరాడితే సహించని పరిస్థితుల్లో ఒక మహిళ ఈ సమాజ గబ్బుని శుభ్రం చేస్తానని బయలుదేరుతా అంటే సహిస్తుందా? అనేక రంగాలలో స్త్రీల కృషిని నిరోధించటానికి, నియంత్రించటానికి వ్యతిరేక ప్రచారాలకు, భౌతిక దాడులకు, లైంగిక దాడులకు పాల్పడుతున్న పితృస్వామిక అధికార వికృతి మనకు తెలిసిన వర్తమానమే. కొదురుపాక రాజవ్వ నుండి, భన్వారీ బాయి, సోనె సోరీ వరకు, అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఆయేషా నుండి దిశ వరకు, ఢిల్లీ నిర్భయ నుండి ఉత్తరప్రదేశ్ మనీషా వరకు చదువుకై, ఉద్యోగానికై బయటికెళ్తే ఆధునిక మనువుల రాజ్యంలో లైంగిక దాడులకు ఆహుతవుతున్న ఘటనలు నేటి స్థితికి ఉదాహరణలు. నూటా యాభై సంవత్సరాల కితం ఆడపిల్లలకు చదువు చెప్పటానికి, అందులోనూ శూద్ర, అతి శూద్ర బాలికలకు చదువు చెప్పటానికి బయటకు వచ్చిన సావిత్రి బాయిని రాళ్లు రువ్వి, కుళ్ళిన కూరగాయలు, పేడ విసిరి వేధించారంటే ఆశ్చర్య పడవలసినది ఏమీ లేదు. వాటిని తన పనికి అభినందనగా విసరబడే పూలగా భావిస్తూ, వాళ్ళ చర్యలవల్ల పాడై పోయిన చీరను మార్చుకొనటానికి మరొక చీర కూడా వెంట తీసుకువెడుతూ ఆమె ఎంతో స్థిత ప్రజ్ఞత, నిబ్బరం, ఆశయం పట్ల దీక్ష ఆమెను నిలబడేలాచేసాయి. దేశంలోనే మొట్టమొదటిగా కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. వివాహాలు చేశారు. పురోహితులు లేకుండా పెళ్ళిళ్లు చేశారు. భర్త చనిపోయినప్పుడు భర్త చితికి ఆమె నిప్పు అంటించిన సంఘటన ఆరోజుల్లో భారతదేశ చరిత్రలోనే అరుదైనది. ఈ చర్యతో ఆమె సాంప్రదాయ స్త్రీ కాదని స్వతంత్ర వ్యక్తిత్వం, భావాలు, ధైర్యం గల స్త్రీ అని నిరూపించింది.

పూలేలో నిజమైన గొప్పతనం ఏమిటంటే వారు హిస్టరీని ఫాలో కాలేదు. రివర్స్ చేశారు. రివర్స్ గానే పరిశీలించారు. బ్రాహ్మణులు రాసింది. చెప్పింది అంతా వారికి అనుకూల గాథలే చెప్పారు. పూలే సేద్యగాని చర్నకోలా, గులాంగిరి కానీ వారి భావధారను తెలుపుతుంది. సావిత్రిబాయి కూడా తన కవితల్లో అద్భుతమైన రీతిలో బ్రాహ్మణ మనువాదం కుటిల దుర్నీతిని, గొప్పవాళ్లను చరిత్ర హీనులుగా, విలన్లుగా చేసిన తీరును సూటిగా విమర్శిస్తూ రాసింది. తన 'ఆత్మ కథనం' కవితలో పౌరాణికపాత్రల్లో తరచూకనిపించే బలిచక్రవర్తిని మహనీయుడుగా పొగిడి 'ఆ మహాదాత యోద్ధాకు నిజమైన వారసులం' అని సగర్వంగా చెప్పుకొన్నది.

సావిత్రి పూలే ఆలోచనలకు భిన్నంగా నేటి ఆధునిక మనురాజ్యం నడుస్తుంది. వేదాల్లో అంతా ఉందంటారు. ప్లాస్టిక్ సర్జరీ చేసిన దేశం అని, పుష్పక విమానాలు నడిపిన దేశం అని, రామరాజ్య నిర్మాణమే లక్ష్యంగా చెబుతూ నడుస్తున్నారు. తమ రాజ్యానికి ఆటంకం అనిపిస్తే గౌరీ లంకేష్ నీ, కలుబుర్గిని చంపినట్లు చంపి రామరాజ్యం తెస్తారా? ప్రశ్నను ఓర్వని పరిస్థితులు తెలంగాణలో నేడు నెలకొన్నాయి. అభ్యుదయాన్ని కూడా జీర్ణించుకోలేని స్థితిలో నేటి మనువాదులు ఉన్నారు. కోటగిరి టీచర్ మల్లికార్జున్ పై దాడి, నరేష్, రాజేష్, వింజమూరి టీచర్ కురుమూర్తి లపై ప్రత్యక్ష దాడి చేసి బెదిరిస్తున్నారు. సావిత్రి కాలంలో కూడా వారిపై అప్పటి మనువాదులు, సాంప్రదాయ వాదులు కించపరిచారు, అవమాన, ఆటంక పరిచారు. కానీ చంపలేదు. కానీ నేడు భౌతిక దాడులకు ఉసి గొలుపుతున్నారు. ఇంతటి దశకు సమాజం తిరోగమించిందా? పవర్ లో ఉన్నోల్లే పనికిరాని మనువాదాన్నీ నేడు పునర్జీవింప కుట్ర చేస్తున్నారు. నయా మనువాధన్ని రుద్దాలని యత్నిస్తున్నారు. సావిత్రి చూపిన దారిలో ఆ మనువాద విశపు కత్తులను చీల్చే జ్ఞానపు బుల్లెట్లుగా కావాలి నేటి యువత.

ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు సోకినప్పుడు ప్రజలందరికీ తిండి పెట్టి అదుకున్నది. చివరికి ఒక దళిత పిల్లాన్ని తన భుజాలపై మోస్తూ సేవ చేసి అదే ప్లేగు వ్యాధితో చనిపోయింది. ప్రజల కోసమే తన జీవితాంతం కృషి చేసింది. వారికి సేవ చేస్తూనే చని పోయింది. తను అనుకున్న నిర్మించుకున్న ఆశసౌధం కోసమే ఒడిదుడుకులు ఎదుర్కొని, ఛీత్కారాలను సహించి, చివరికంట నిలబడిన త్యాగపు కోట. మనువు గీతలపై దాటి అడ్డువచ్చిన, అడ్డుపడిన హద్దులను దాటి, వాటిపై యుద్ధం చేసినది సావిత్రిబాయి పూలే. అందుకే జ్యోతిభాను అన్నట్లుగానే ఆమె కూడా 'మహిళ లోకపు వినీలకాశంలో సావిత్రి బాయి ఓ చంద్రబింబం'. ఆమె చూపిన మార్గమే ప్రగతిశీల శక్తుల కర్తవ్య బాట.

(నేడు సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి)

సెల్:9573715656.

వికలాంగ హక్కుల ఛాంపియన్

తమిళనాడుకు చెందిన సుజాత కాంతన్‌కు జ్వరం వచ్చినప్పుడు వయసు కేవలం ఒకటిన్నర సంవత్సరాలు. ఆ జ్వరం కేవలం రెండు గంటలు మాత్రమే ఇబ్బంది పెట్టింది. కానీ అదే పోలియోకి కారణమైంది. జీవితాంతం వికలాంగురాలుగా మిగిలిపోయింది. ఇప్పుడు 42 సంవత్సరాల వయసులో సుజాత అక్క (ఆమెను ముద్దుగా పిలుస్తారు) వికలాంగ హక్కుల ఛాంపియన్‌గా, న్యాయవాదిగా తమిళనాడు చుట్టుపక్కల ఉన్న వందలాది మంది వికలాంగుల జీవితాలను మార్చేస్తుంది. తన రాష్ట్రంలో వికలాంగ మహిళల హక్కుల కోసం పనిచేసే ట్రస్ట్ నడుపుతూ వికలాంగ మహిళల అభివృద్ధి వేదిక వ్యవస్థాపకురాలిగా ఉంది.



"నేను ఆరోగ్యకరమైన బిడ్డగా పుట్టాను. నా మొదటి పుట్టినరోజుకు ముందు నడవడం ప్రారంభించాను. బట్ట ఊయలలో నుండి బయటకి రాలేక మళ్లీ నిలబడలేక పడిపోయిన ఆ రోజును మా నాన్న గుర్తు చేసుకున్నారు. నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ నాకు పోలియో ఉన్నట్లు నిర్ధారణ అయింది. నా కుడి కాలు పని చేయలేదు" అని సుజాత అంటున్నారు.

తీవ్ర ఆవేదనతో...

చెన్నైలోని థౌజండ్ లైట్, క్రీమ్స్ రోడ్, తీదీర్ నగర్‌లో పెరిగిన తొమ్మిదేండ్ల సుజాతకు వరుస శస్త్రచికిత్సలు జరిగాయి. పాఠశాల కోసం ధరించే ప్రత్యేక షూలను అమర్చారు. మిగిలిన పిల్లలు నేలపై కూర్చోగా, ఆమెకు ఎక్కువ స్థలం అవసరం కావడంతో విడిగా కూర్చునేది. తన కాలు పని చేయడం లేదని ఇంట్లో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసేది. తన బూట్లను విసిరేసి సపోర్టుతో నడవడం ప్రారంభించింది. అలా 10వ తరగతి పూర్తి చేసింది. "నాకు లెక్కలంటే చాలా కష్టం. దాంతో పరీక్షల్లో ఫెయిలయ్యాను. దాంతో చదువును వదులుకోవాలని నిర్ణయించుకున్నాను" అని ఆమె నవ్వుతూ చెప్పింది. చదువు మానేసిన తర్వాత సేల్స్‌పర్సన్‌గా పని చేయడం ప్రారంభించింది.

హక్కుల న్యాయవాదిగా...

"నేను PCOని నిర్వహిస్తున్నప్పుడు వారి హక్కులు, ప్రభుత్వం నుండి వారు పొందగల ప్రయోజనాల గురించి పెద్దగా అవగాహన లేని చాలా మంది వికలాంగులను నేను సంప్రదించాను" అని ఆమె చెప్పింది. అలా వికలాంగుల హక్కుల న్యాయవాదిగా సుజాత ప్రయాణం మొదలైంది. వికలాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆమె వారికి సహాయం చేసేది. వారి తరపున ఫారమ్‌లను నింపి, తహశీల్, కలెక్టర్ కార్యాలయానికి వారితో పాటు వెళ్లేది. ప్రతి నెలా డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు వారిని బ్యాంకుకు తీసుకెళ్లేది. "నా కుటుంబం, స్నేహితుల ప్రేమ, మద్దతుతో నేను సాధారణ జీవితాన్ని గడిపాను. పింఛను అందజేసే రోజంతా నేను బిజీగా ఉంటాను. మిగిలిన సమయంలో నేను నా పనిపై దృష్టి సారిస్తాను. ప్రజలకు అవసరమైనప్పుడు సహాయం చేస్తాను" అంటుంది సుజాత.

పెన్షన్ నిలిపివేస్తే...

2017లో మొత్తం కమ్యూనిటీ పెరుంబాక్కంలో పునరావాసం పొందవలసి వచ్చింది. సుజాత ఆ ప్రాంతంలో దాదాపు 300-350 మంది వికలాంగులను గుర్తించారు. వారి తొలగింపు, పునరావాసం తర్వాత పెన్షన్ ఒక సంవత్సరం పాటు నిలిపివేశారు. ఎందుకంటే వారు మళ్లీ దరఖాస్తు చేయడానికి ముందు వారి చిరునామాను మార్చవలసి వచ్చింది. "పింఛను రూ. 1,000 మాత్రమే అయినప్పటికీ వీరికి అది పెద్ద మొత్తం. దాంతో పెన్షన్ ఆగిపోవడంతో ఎంతో నిరాశ చెందారు. వికలాంగులకు మాత్రమే కాకుండా వితంతువులు, ఇతరులకు పింఛను పునరుద్ధరించడానికి నేను చాలా కష్టపడ్డాను" అని ఆమె పంచుకున్నారు.

మహమ్మారి సమయంలో...

సుజాత వికలాంగులకు సహాయం చేస్తున్న ఎన్‌జీఓల గురించి, వారు తన కమ్యూనిటీకి ఎలా సహాయం చేయగలరు అనే సమాచారాన్ని కూడా సేకరించారు. వసంతం ఫౌండేషన్ ద్వారా తమిళనాడు వ్యాప్తంగా 50 మందికి వీల్ చైర్ల పంపిణీని ఆమె సులభతరం చేశారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో చిన్న దుకాణాలు లేదా పుష్కరాలను నడుపుతున్న వికలాంగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వారికి మద్దతు ఇవ్వడానికి, వారి వ్యాపారాలను పునఃప్రారంభించటానికి, ఆదాయాన్ని సంపాదించడానికి, సహాయం చేయడానికి ఆమె ఎన్‌జీఓలను సంప్రదించింది. చాలా మంది వికలాంగులు, వారి కుటుంబాలు రోజువారీ కూలీ కార్మికులు.

వ్యాపారాలు చేసుకునేలా...

"వికలాంగులకు ఉపాధి చాలా అరుదు. మా పిల్లలకు స్కాలర్‌షిప్‌లు లేవు. నేను 10 మంది కళాశాల విద్యార్థులకు (అందరూ వికలాంగుల పిల్లలే) రూ. 2 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు వచ్చేలా చేయగలిగాను" అని ఆమె జతచేస్తుంది. నిధుల రూపంలో సహాయాన్ని రూపొందించడం, పంపిణీ చేయడంతో పాటు, సుజాత వికలాంగులను వారి ఇళ్ల నుండి బయటకు రావడానికి, నమ్మకంగా ఉండటానికి, వ్యాపారాలను కూడా నిర్వహించేలా ప్రేరేపిస్తుంది. తనకు చిన్నప్పటి నుంచి తెలిసిన షీలా అనే వికలాంగ మహిళ ఉదాహరణను పంచుకుంటూ "షీలా తన ఇంటి నుంచి బయటకు రాలేదు. నేను ఆమెతో కలిసి గంటల తరబడి కూర్చునేదాన్ని. ఆమెని బయటకు వెళ్లి ఏదైనా చేయమని ప్రోత్సహించాను. ఆమె కోసం ఒక చిన్న గార్మెంట్స్ దుకాణాన్ని తెరిచాను. తర్వాత ఆమె ఆ దుకాణాన్ని విజయవంతంగా నడపడం ప్రారంభించింది. ప్రభుత్వం నుండి స్కూటీ పెప్ కూడా ఇప్పించగలిగాను" అని ఆమె జతచేస్తుంది.



కమ్యూనిటీ ఛాంపియన్‌గా

వికలాంగుల హక్కుల ఛాంపియన్‌గా చేస్తున్న కృషికి తోడుగా ఆమె డెవలప్‌మెంట్ ఫోరమ్ ఫర్ ఉమెన్ విత్ డిసేబిలిటీని ప్రారంభించింది. ఇది భారతదేశం నలుమూలల నుండి 300 మంది సభ్యులతో ఒక ట్రస్ట్‌ను ప్రారంభించింది. దీనితో పాటు డిప్రైవ్డ్ అర్బన్ కమ్యూనిటీస్ కోసం ఇన్ఫర్మేషన్ అండ్ రిసోర్స్ సెంటర్ స్థాపకురాలు వెనెస్సా పీటర్. గత ఆరు నెలలుగా సుజాత ఇండస్ యాక్షన్ సమాజ్/సముఘం 3.5శాతం కార్యక్రమంలో యాక్టివ్ ఛాంపియన్‌గా ఉంది. మరో ఇద్దరు తోటి ఛాంపియన్‌లతో కలిసి వారి ప్రాంతంలో RTE 12 (1) (c)పై అవగాహన కల్పించే బాధ్యతను తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 A ప్రకారం 6 నుండి14 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలకు ప్రాథమిక విద్య ప్రాథమిక హక్కు ఉంది. ఈ హక్కును అమలు చేయడానికి, ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009, సాధారణంగా విద్యా హక్కు (RTE) చట్టం 2009 అని పిలుస్తారు. ఇది 2009లో రూపొందించబడింది. 2010లో అమలులోకి వచ్చింది. వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్యను అందించడం, ఒక్కో తరగతిలో కనీసం నాలుగింట ఒక వంతు వికలాంగ పిల్లలను చేర్చుకోవాలని ఇందులో పొందుపరిచారు. సుజాత తన అనుభవాన్ని, నైపుణ్యాన్ని తన జట్టు సభ్యులకు మద్దతుగా, వారు ఎదుర్కొన్న సవాళ్లను పరిష్కరించడానికి ఉపయోగిస్తుంది.

భవన నిర్మాణ కార్మికులకు అండగా

ప్రస్తుతం సుజాత బృందం అసంఘటిత రంగ కార్మికుల జీవనోపాధి హక్కుపై కూడా దృష్టి సారిస్తోంది. తమిళనాడులోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన అవగాహన కల్పించడం, 50 మంది నిర్మాణ కార్మికులకు పథకాలను చేరువ కావడం ఈ కార్యకలాపాలలో భాగంగా ఉంది. వారు కనీసం 90శాతం మంది భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు పొందడానికి సహాయం చేస్తున్నారు. ఇ-సేవాయిపై ఇండస్ యాక్షన్ నిర్వహించిన పైలట్ అధ్యయనం ఫీల్డ్ టీమ్‌లో సుజాత కూడా భాగం, ఇ-సేవాయి ఆపరేటర్లు, పౌరులతో వారి విధులు, దృక్కోణాలను అర్థం చేసుకోవడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఆరు నెలలు సుజాత జీవితాన్ని గణనీయంగా మార్చేశాయి.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

"నేను Google డాక్స్, డ్రైవ్, మీట్ ఎలా ఉపయోగించాలో నేర్చుకున్నాను. సమావేశాలను ప్లాన్ చేశాను. చివరకు నా సోమరితనాన్ని వదిలించుకున్నాను. నేను చాలా కాలంగా ఫీల్డ్‌లో ఉన్నాను" అని ఆమె చెప్పింది. సౌత్ జోన్ ఆపరేషన్స్, ఇండస్ యాక్షన్ అసోసియేట్ అయిన జయసుందరి.ఎస్ మాట్లాడుతూ "మొదటి బృందంలోని ఐదుగురు కమ్యూనిటీ ఛాంపియన్‌ల శిక్షణలో ప్రభుత్వ పథకాల అవగాహన, డాక్యుమెంటేషన్, దరఖాస్తు ప్రక్రియపై దృష్టి సారిస్తుంది. ఇందులో శిక్షణ, భాగస్వామ్య పద్ధతి, దీర్ఘకాలంలో వారు సంఘం నాయకులుగా మారడం వంటివి ఉంటాయి. ఇది వాటాదారుల పరస్పర చర్యలు, ప్రభుత్వ అనుభవాలు, అనుభవపూర్వక శిక్షణను కలిగి ఉంటుంది. ప్రస్తుతం ట్రస్ట్ కార్యకలాపాల్లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం పట్ల సుజాత ఉత్సాహంగా ఉన్నారు. చివరగా ఆమె "నేను స్కూటర్ నడపడం ప్రారంభించాను" ఆమె గర్వంగా చెప్పి తన మాటలు ముగించింది.

- సలీమ

అవి మెడికల్ లీవ్స్ కావు



రుతుస్రావ సమయంలో సెలవులు కావాలని మహిళలు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నారు. కానీ దీనిపై పెద్ద ఎత్తున చర్చ అయితే జరుగుతంది. ఆచరణలోకి మాత్రం రావడం లేదు. ఇటీవల కొన్ని రాష్ట్రాలు పీరియడ్స్ లీవ్స్‌ను మంజూరు చేస్తున్నాయి. అయితే ముంబయికి చెందిన న్యాయవాది, ఉద్యమకారిణి ఇందిరా జైసింగ్ ఇటీవలె దీనిపై స్పందించారు.



ఆమె ప్రకారం 'రుతుస్రావ సెలవులు మెడికల్ లీవ్స్ కాదు. ఇది ప్రకృతి సహజమైన చర్య. అలాంటి దాన్ని వైద్య సెలవులుగా ఎలా పరిగణిస్తారు. అలాగే శబరిమల గుడిలోకి కూడా మహిళలను రానీయకపోవడం అంటరానితనం కిందకు వస్తుంది. మన దేశంలో అంటరాని తనం నేరం. అలాంటప్పుడు మహిళలను రుతుస్రావ సమయంలో అంటరాని వారిగా ఎలా చూస్తారు? మా ఇంట్లో కూడా నా చిన్నతనంలో ఇలాంటి పరిస్థితి చూశాను. అమ్మాయిలను ఆ సమయంలో వంటింట్లోకి రానిచ్చేవారు కాదు. నేను ఒకసారి శబరిమల వెళ్ళినపుడు అపవిత్రమైందని ప్రత్యేక పూజలు చేసి శుద్ధి చేసుకున్నారు. మన దేశంలో ఇలాంటి ఆచారాలను భరించవలసి వస్తుంది. మరొక ముఖ్య విషయం ఏమిటంటే రుతుస్రావ సమయంలో సెలవు కావాలని చాలా మంది మహిళలు ఎప్పటి నుండో అడుగుతూనే ఉన్నారు. ఇది కొత్త విషయం ఏమీ కాదు. ఈ సెలవుల విషయంలో సంస్థలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అయితే ఇందులో నాకు మరో భయం కూడా కనిపిస్తుంది. ఆ సమయంలో సెలవు మంజూరు చేయడం ఎందుకని అసలు మహిళలకు ఉద్యోగాల్లోకే తీసుకోరేమో అనిపిస్తుంది. ఏది ఏమైనా రుతుస్రావ సెలవులను వైద్య సెలవుగా పరిగణించకూడదు. వీటిని సాధారణ సెలవులుగానే పరిగణించాలి".

ఆకర్షణీయంగా...



ప్రతి వ్యక్తి తన వ్యక్తిత్వం ఆకర్షణీయంగా కనిపించాలని కోరుకుంటారు. కొన్ని విషయాలు మీ వ్యక్తిత్వాన్ని మెరుగుపరచడానికి పని చేస్తాయి. మరి ఆ చిట్కాలు ఏమిటో తెలుసుకుందాం.

- ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు నిటారుగా నిలబడి మీ ముఖంపై చిరునవ్వుతో మాట్లాడండి. ఎదుటి వ్యక్తి కళ్లలోకి చూస్తూ మాట్లాడండి. ఇది మీ విశ్వాసాన్ని చూపుతుంది. మాట్లాడేటప్పుడు అక్కడా ఇక్కడా చూడకండి. ఇది మీ వ్యక్తిత్వంపై చాలా చెడు ప్రభావం చూపుతుంది.
- మాట్లాడేటప్పుడు సరైన భాషను ఉపయోగించండి. మీ కమ్యూనికేషన్ నైపుణ్యాలు మీ వ్యక్తిత్వంపై కూడా గొప్ప ప్రభావాన్ని చూపుతాయి. అందుకే మీ మాట్లాడే, రాసే శైలిని మెరుగుపరచండి. కొంతమంది చాలా త్వరగా మాట్లాడతారు. దీని వల్ల చాలాసార్లు ఎదుటి వ్యక్తి మీ అభిప్రాయాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు.
- మన డ్రెస్సింగ్ సెన్స్ కూడా మన వ్యక్తిత్వంపై ప్రభావాన్ని చూపుతుంది. అందుకే ఎప్పుడూ శుభ్రంగా, మంచి నడవడికతో కూడిన దుస్తులు ధరించండి. సందర్భానుసారంగా దుస్తులను ఎంచుకోండి. సరైన దుస్తులు కూడా మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.
- ఎవరినైనా ఎప్పుడైనా కలవడానికి సమయానికి చేరుకోండి. ఆఫీస్‌కు వెళ్లాలనుకుంటే సరైన సమయానికి వెళ్లాలి. దీంతో మీ గౌరవం పెరుగుతుంది. దీని నుంచి ఇతరులు కూడా మీ నుండి నేర్చుకుంటారు.

నిన్న సీబీఐ..నేడు ఈడీ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన బెయిల్ పిటిషన్ కూడా విచారణకు వచ్చే అవకాశం ఉన్నది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించిన ఆరోపణలపై సీబీఐ.. ఆయనను గతనెల 26న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి మనీశ్ సిసోడియా ఢిల్లీ తీహార్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

ఈడీ అరెస్టు ఘటనపై ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ స్పందించారు. ఆయనను ఎలాగైనా లోపల ఉంచే లక్ష్యంతోనే ఈడీ ఈ చర్యకు దిగిందని ట్వీట్ చేశారు. "మనీశ్‌ను తొలుత సీబీఐ అరెస్టు చేసింది. సోదాల్లో ఎలాంటి ఆధారాలూ, నగదూ లభించలేదు. రేపు (శుక్రవారం) బెయిల్ విచారణ ఉన్నది. శుక్రవారం మనీశ్ విడుదలయ్యేవాడు. అందుకే ఈడీ ఆయనను అరెస్టు చేసింది. ప్రతి రోజూ నకిలీ కేసులు సృష్టించిన ఆయనను ఎలాగైనా లోపల ఉంచడమే వారి ఏకైక లక్ష్యం. ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు సమాధానం చెప్తారు" అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు.

ఢిల్లీ మంత్రులుగా అతిషి, సౌరభ్ ప్రమాణం

న్యూఢిల్లీ :ఆమాద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు సౌరభ్ భరద్వాజ్, అతిషి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో నూతన మంత్రులుగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. స్థానిక రాజ్‌నివాస్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిఎం కేజ్రీవాల్ సమక్షంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా వీరిద్దరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రామ్‌వీర్ సింగ్‌బిధుర్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఇటీవల దిల్లీ మద్యం కేసులో మనీశ్ సిసోడియాను సిబిఐ అరెస్టు చేయడం, అంతకముందు మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన సత్యేందర్ జైన్ తమ మంత్రి పదవులకు ఇటీవల రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ అయిన రెండు మంత్రి పదవులను భర్తీ చేశారు. సిసోడియా నిర్వహించిన విద్యాశాఖతో పాటు పబ్లిక్ వర్క్స్, విద్యుత్, పర్యాటక శాఖలను అతిషీ చూడనున్నారు.

మోటార్లకు మీటర్లే కాదు... మొత్తం కార్పొరేట్లకే

(మొదటిపేజీ తరువాయి)


వంటి కుల వృత్తులవారికి ఇస్తున్న ఉచిత విద్యుత్తు, పేద, మధ్యతరగతి ప్రజలకు టెలిస్కోపిక్ విధానంలో టారిఫ్ ద్వారా ఇస్తున్న రాయితీలు సహా అన్నింటిపై కోత పడుతుంది. కరెంటు చార్జీలు పెరుగుతాయి.

మోటార్లకు మీటర్లు : రైతులు పంటల కోసం వాడుకుంటున్న కరెంటుకు లెక్కలు చెప్పాలి. దానికోసం మోటార్ల దగ్గర మీటర్లు పెట్టాలని మోడీ సర్కారు 2022 సవరణ ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదట మీటర్లు పెట్టించడం, ఆ తర్వాత చార్జీలు వడ్డించడం ఈ సవరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపింది. దీనితో నేరుగా పొలాల్లో కాకుండా ప్రస్తుతానికి వ్యవసాయానికి కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర మీటర్లు పెట్టమని ఆదేశాలు జారీ చేసింది. ఊరి దాకా వచ్చిన ప్రమాదం...ఊర్లోకి రాకుండా పోదుకదా!

ప్రీపెయిడ్ మీటర్లు

ఇప్పటి వరకు కరెంటు వాడుకున్నాక వచ్చే బిల్లును చెల్లిస్తున్నాం. అలాకాకుండా ప్రీ పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేసి, రీచార్జి చేసుకుంటేనే కరెంటు సరఫరా చేస్తామని సవరణల్లో ప్రతిపాదించారు. ఈ ప్రీ పెయిడ్ మీటర్ల కంపెనీలను ఇప్పటికే అదానీ గ్రూప్ కొనేసింది. దశలవారీగా ఈ మీటర్లను ఇండ్లకు అమర్చమని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సిఈఆర్సీ) ముసాయిదా ప్రతిపాదనలు రూపొందించి, రాష్ట్రాల ఈఆర్సీలకు పంపింది. మొన్నటి వరకు సెల్‌ఫోన్ నెలవారీ రీచార్జి కూపన్ రూ.49 ఉంటే, ఇప్పుడు రూ.149కి పెరిగి, 28 రోజులకే కుదింపబడినట్టు... భవిష్యత్‌లో ప్రీ పెయిడ్ కరెంటు మీటర్ల వ్యవహారం కూడా ఇలాగే మారబోతుంది.

'పునరుత్పాదకం' తప్పనిసరి



బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నందున, ప్రకృతినుంచి సహజసిద్ధంగా వచ్చే పునరుత్పాదక విద్యు త్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ సవరణ బిల్లులో ప్రతిపాదించారు. అంటే సోలార్, విండ్, బయోగ్యాస్ వంటి వాటి నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనాలి. ఇవన్నీ పూర్తిగా ప్రయివేటు రంగంలోనే ఉన్నాయి. థర్మల్‌తో పోలిస్తే ఈ కరెంటు చాలా ఖరీదైంది. ఎక్కువ సొమ్ము పోసి ఈ కరెంటు కొన్నాక, వినియోగదారుడి నుంచి ఎక్కువ చార్జీనే వసూలు చేస్తారు కదా!

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామ్ చంద్ర పౌడెల్

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులు (332 మంది ఎంపీలు, 550 మంది ఎమ్మెల్యేలు)ఉండగా ఓటింగ్‌లో 831 మంది (313 మంది ఎంపీలు, 518 మంది ఎమ్మెల్యేలు) మాత్రమే పాల్గొన్నారు. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పిపి), నేపాల్ వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ ఓటింగ్‌లో పాల్గొనలేదు. పౌడెల్‌కు అనుకూలంగా 214 మంది ఎంపీలు, 352 మంది ఎమ్మెల్యేల ఓటు చేశారు.పౌడెల్‌కు నేపాలీ కాంగ్రెస్‌తోబాటు ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' నేతత్వంలోని ఎనిమిది పార్టీల కూటమి మద్దతు తెలిపింది. మొదట నేపాలీ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్) అభ్యర్థికి మద్దతు ఇస్తానని చెప్పి, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్లేటు ఫిరాయించి, నేపాలీ కాంగ్రెస్ అభ్యర్థిని బలపరుస్తున్నట్టు ప్రధాని ప్రచండ ప్రకటించడంతో ఆయన ప్రభుత్వానికి యుఎంఎల్ తన మద్దతు ఉపసంహరించుకోవడం.ఆ వెంటనే నేపాలీ కాంగ్రెస్ ఆయనకు మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. 'అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు నా స్నేహితుడు రామ్ చంద్ర పౌడెల్‌కి హృదయపూర్వక అభినందనలు' అని నేపాలీ కాంగ్రెస్ చీఫ్ షేర్ బహదూర్ దేవ్‌బా ట్వీట్ చేశారు.2008లో నేపాల్ రిపబ్లిక్‌గా అవతరించిన తర్వాత జరిగిన మూడవ అధ్యక్ష ఎన్నిక ఇది. ప్రస్తుత అధ్యక్షురాలు బిద్యా దేవి భండారీ పదవీ కాలం ఈ నెల 12తో ముగియనుంది. అధ్యక్షుని పదవీకాలం ఐదు సంవత్సరాలు ఉంటుంది. 1944 అక్టోబరు 14న ఓ మధ్యతరగతి రైతుల కుటుంబంలో జన్మించిన పౌడెల్ తన16 వయేటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా, పార్లమెంటు స్పీకర్‌గా, ప్రతిపక్ష నాయకునిగా వివిధ హెూదాల్లో పనిచేశారు.

ఏ విచారణనయినా ధైర్యంగా ఎదుర్కొంటా

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తు సంస్థలతో అన్నింటిని కంట్రోల్ చేయగలమని భావిస్తున్నాయని విమర్శించారు. అయితే, ప్రాకృతిక న్యాయం ఒకటి ఉంటుందనీ, అది కచ్చితంగా వస్తుందన్నారు. అప్పుడు న్యాయమే గెలుస్తుందని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తనకు ఈడీ ఇచ్చిన నోటీసులు, మహిళా బిల్లుపై భారత్ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న దీక్ష తదితర అంశాలపై స్పందించారు. 'ఎక్కడైతే ఎన్నికలు ఉంటాయో, అక్కడ మోడీ కంటే ముందు.. ఈడీ ఉంటుంది' అని విమర్శించారు. తెలంగాణ లోనూ ఇదే జరుగుతుందని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 500 లకు పైగా బిజినెస్ హౌజెస్ పై ఐటీ దాడులు, 100 చోట్ల సీబీఐ దాడులు, ఈడీ 200 చోట్ల దాడులు చేసిందన్నారు. ఎన్ ఐఏ ఏకంగా 500 నుంచి 600 మందిని పిలిచి వార్నింగ్ ఇచ్చిందన్నారు. 'ఇది నా ఒక్కరిపై జరుగుతున్న దాడి కాదు. బీఆర్ఎస్‌లో ఇప్పటి వరకు 15 మందికి పైగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలను టార్గెట్ చేసి విచారణ పేరుతో ఇబ్బంది పెట్టారు' అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి, తాము చేసిన అభివృద్ధి గురించి చెప్పుకోవాలని బీజేపీ నేతలకు హితవు పలికారు. 'ముందు ప్రజల హృదయాలు గెలవండి, తర్వాత ఎన్నికల్లో గెలవండి' అంటూ ఫైర్ అయ్యారు. దర్యాప్తు సంస్థల బెదిరింపులు, బ్యాక్ డోర్ నుంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కుట్రలు బీజేపి చేస్తుందన్నారు. ఇప్పటి వరకు 9 రాష్ట్రాల్లో ఇదే విధానం అవలంభించారనీ, తెలంగాణలో ఇది సాధ్యం కాలేదన్నారు. అందువల్లే.. ఈడీ, సీబీఐ లను ఉసిగొల్పి భయపెట్టాలని బీజేపి చూస్తుందన్నారు. అయితే, మోడీ, బీజేపీ, ఈడీలకు తాము భయపడమని స్పష్టం చేశారు.

ఈడీకి అంతతొందరెందుకో...

లిక్కర్ స్కాంలో తనను విచారించేందుకు ఈడీకి అంతతొందరెందుకని కవిత అన్నారు. విచారణకు రెండు రోజుల సమయం ఇస్తే, ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు వస్తాయో తనకు అర్థం కావడం లేదన్నారు. మార్చి 16న విచారణకు హాజరవుతానని ఈడీకి రిప్లై ఇచ్చినట్లు చెప్పారు. కానీ, ఈడీ విచారణకు హాజరుకావాలని పట్టుబట్టిందన్నారు. అందుకే ధర్నా తర్వాత రోజు, మార్చి 11న విచారణకు వస్తానని సమాధానమిచ్చినట్టు వెల్లడించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతర దర్యాప్తు సంస్థలు ఒక మహిళను విచారించాలంటే ప్రాథమిక హక్కులు ఉంటాయని చెప్పారు. ఆ మహిళ ఇంటికి వచ్చి విచారణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. చట్టంలో మహిళలకు ఇలాంటి మినహాయింపులు ఉన్నాయని, కోర్టు లు సైతం ఇలాంటి తీర్పులనే ఇచ్చాయని గుర్తు చేశారు. అందువల్ల 'ఇన్వెస్టిగేషన్ కోసం ఈడీ అధికారులే మా ఇంటికి రావాలని కోరాం. ఎవరితో అయితే కలిపి విచారించాలనుకుంటున్నారో, వారిని తీసుకొని రండీ' అని ఈడీని కోరినట్టు చెప్పారు. అయితే తన విజ్ఞప్తిని తిరస్కరించిన ఈడీ అధికారులు... తమ ముందు హాజరుకావాలని పట్టుబట్టినట్టు వెల్లడించారు.

వీసీ ద్వారా మహిళల ఇంట్రాగేషన్ జరపాలి...

పోలీసులు, ఈడీ, ఇతర దర్యాప్తు సంస్థలు మహిళల ఇంట్రాగేషన్ వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా జరపాలని కవిత డిమాండ్ చేశారు. కరోనా టైంలో వీసీ ద్వారా మందులు, ట్రీట్మెంట్ ఇచ్చినప్పుడు ఇంట్రాగేషన్ ఎందుకు సాధ్యం కాదన్నారు. రానున్న రోజుల్లో ఈ అంశంపై పోరాటం చేస్తానన్నారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్తామని చెప్పారు. దేశంలో ఈడీ డైరెక్టర్, సెబీ డైరెక్టర్, ఎస్‌బీఐ డైరెక్టర్, ఎల్ ఐసీ డైరెక్టర్లకు రిటైర్మెంట్ తర్వాత కూడా ఎక్స్‌టెన్షన్ దొరుకుతుందన్నారు. కేంద్రం చెబుతున్నట్లు వ్యవహరిస్తున్నందుకే... వీళ్లకు ఎక్స్‌టెన్షన్స్ పై ఎక్స్‌టెన్షన్స్ వస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఆర్మీలో మూడున్నర లక్షల వెకెన్సీలు ఉన్నాయన్నారు. అగ్ని వీర్ కింద తీసుకున్న జవాన్లకు ముందు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగేండ్లు వాడుకొని వారిని రోడ్డు పై పడేస్తారా? అని ప్రశ్నించారు. బీజేపి ఆఫీసులో చౌకిదార్లుగా పెట్టుకుంటారా? అని మండిపడ్డారు.

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే..

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎక్కడైతే ఎన్నికలు ఉన్నాయో... ఆయా రాష్ట్రాల్లో ఈడీ, సీబీఐ దర్యాప్తు సంస్థలతో కేసులు పెడుతుందన్నారు. కేంద్రంతో సఖ్యతగా ఉన్న పార్టీలు, వారి బిజినెస్ హౌజ్ లపై ఈ దాడులు ఎందుకు జరగడం లేదన్నారు. ఆదానీ, ఇతర నేతలకు ఏమీ కాదన్నారు. అయితే తెలంగాణ సిట్ ముందు హాజరుకావాలని బీఎల్ సంతోష్‌కు కూడా చెప్పాలని బీజేపి నేతలకు సూచించారు. 'మాకు ఈడీ అంటే భయం లేదు. రేపు విచారణకు వెళ్తా, అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తాను. అన్ని విధాలుగా సహకరిస్తాం. కానీ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తూ బీఎల్ సంతోష్ కు ఎందుకు స్టేలు తెస్తున్నారు?' అని ప్రశ్నించారు. 'గాంధీ పుట్టిన ఈ దేశంలో ప్రస్తుతం అబద్దాల పాలన సాగుతోంది. జీడీపీ, అభివృద్ధిపై, పార్లమెంట్ లోనూ మోడీ అబద్దాలపై అబద్దాలు చెబుతున్నారన్నారు. ఇలాంటి రాజకీయాలు మనకు అవసరమా?' అని ఫైర్ అయ్యారు. అధికారం కావాలంటే ప్రజల వద్దకు వెళ్లాలని సూచించారు. 'వన్ నేషన్.. వన్ ఫ్రెండ్' కా సర్కార్‌కు అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు.

27 ఏండ్లుగా కోల్డ్ స్టోరేజ్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లు...

దాదాపు 27 ఏండ్లుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు కోల్డ్ స్టోరేజ్ లో ఉందని కవిత అన్నారు. అప్పటి నుంచి దేశంలో మహిళ రిజర్వేషన్ల బిల్లుపై చర్చ చాలా ఏండ్లుగా సాగుతుందని చెప్పారు. 1996 రాజ్య సభలో ఆమోదం పొందిందన్నారు. ఆ తర్వాత ఆ బిల్లు ల్యాప్స్ అయిందన్నారు. కానీ ఇంత వరకు లోక్ సభలో ఈ బిల్లు పాస్ కాలేదని గుర్తు చేశారు. 1998, 1999, 2008లో మళ్లీ మళ్లీ మహిళా బిల్లు తీసుకువచ్చేందుక ప్రభుత్వాలు కృషి చేశాయన్నారు. 'ఎన్ని ప్రభుత్వాలు మారినా దానికి మాత్రం ఆమోదం లభించలేదు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ఈ బిల్లు కోసం మా పోరాటం కొనసాగిస్తాం. 2014, 2019 ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపి హామీ ఇచ్చింది. ప్రజలు 300కి పైగా స్థానాలు ఆ పార్టీకి ఇచ్చినా బిల్లును ఆమోదించలేదు. శుక్రవారం మహిళా బిల్లుపై ఢిల్లీలో దీక్ష చేస్తామని మార్చి 2న ప్రకటన విడుదల చేశాం. మా దీక్షకు మద్దతిస్తూ విపక్షాలు కూడా ముందుకొచ్చాయి.' అని చెప్పారు. మహిళ బిల్లుకోసం చారిత్రకమైన రోజు వచ్చిందనీ, మహిళలు పార్టీలకు అతీతంగా తాను చేస్తోన్న ఆందోళనకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఉమెన్ రిప్రజెంటేషన్ లో గ్లోబల్ ఇండికేటర్స్‌ను పరిశీలిస్తే... 193 దేశాల్లో భారత్ 148 స్థానంలో నిలిచిందన్నారు.

అవి మోడీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలకు ఎర కేసు విచారణలో బీజేపీ జాతీయ నేత బీఎల్ సంతోష్ ఎందుకు ముఖం చాటేశారని ప్రశ్నించారు. ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా, బీజేపీలో చేరగానే పునీతులు ఎలా అవుతున్నారంటూ సీఎమ్ రమేష్, సుజనాచౌదరి తదితరుల కేసుల విచారణను ప్రస్తావించారు. కర్ణాటకలో అవినీతి డబ్బు కట్టలతో బీజేపీ ఎమ్మెల్యే కొడుకు పట్టుబడినా ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారన్నారు. అదానీ వ్యవహారంతో ఎల్ఐసీ, ఎస్‌బీఐ వంటి సంస్థలు వేలకోట్లు నష్టపోతే ప్రధాని నరేంద్రమోడీ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది ప్రజాప్రతినిధులపై మోడీ నేతృత్వంలోని ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలు దాడులు చేశాయని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఒకటి మోడీ.. మరొకటి అదానీ అని ఎద్దేవా చేశారు. మోడీ, ఈడీ దాడుల్ని ప్రజాకోర్టులో ఎదుర్కొంటామన్నారు. దేశంలో బీజేపీ నేతలపై నమోదు చేసిన కేసులను ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలు చూపించగలవా? అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కేసులతో, ప్రజలపై ధరలతో దాడి చేస్తున్నదనీ, పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ, మోడీ చీకటి స్నేహం గురించి అందరికీ తెలుసన్నారు. ముంద్రా పోర్టులో రూ.21వేల కోట్ల డ్రగ్స్ దొరికినా అదానీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదానీపై శ్రీలంక చేసిన ఆరోపణల్లో నిజం లేదని ప్రజలకు ఎందుకు చెప్పలేకపోతున్నారన్నారు. మోడీకి బినామీగా అదానీ చేస్తున్న వ్యాపారాలకు మోడీ మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని ఆరోపించారు. బీబీసీ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల మీద దాడులు చేయడం ద్వారా తమకు అనుకూలంగా లేకుంటే జరిగే పరిణామాలపై హెచ్చరికలు జారీ చేశారని చెప్పారు. మోడీ తొమ్మిదేండ్లలో ప్రతిపక్షాలపై 5,422 కేసులు పెట్టించారనీ, వాటిలో కేవలం 23 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చిందని తెలిపారు.

మీడియాను మాఫియా నడిపిస్తోంది :మంత్రి కేటీఆర్ విమర్శ

మాఫియాను నడిపించినట్టే మీడియానూ నడిపిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలంటే తమకు గౌరవం ఉందనీ, కానీ మీడియా యాజమాన్యాల గొంతు నులిమి పట్టుకుని ఈడీ, సీబీఐ కేసులు పెడుతుంటే వారు మాత్రం ఏం చేస్తారన్నారు. మద్య నిషేధం ఉన్న గుజరాత్‌లో లిక్కర్ తాగి 42 మంది చనిపోతే ఎన్ని పత్రికలు రాసాయని ఓ మీడియా సంస్థను ఉద్దేశించి అడిగారు. "మీరు ఏం మాట్లాడుతారో, ఏం చూపెడుతారో, ఏం డ్రామాలో చేస్తారో తెలుసు. మిమ్మల్ని ఎప్పుడు బ్యాన్ చేయాలో కూడా మాకు తెలుసు" అని ఆ సంస్థ ప్రతినిధిని ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో బీజేపీ మౌత్ పీసెస్‌గా ఉన్న చిల్లర సంస్థలను కచ్చితంగా ప్రజల ముందు ఎండగడుతామని హెచ్చరించారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్రుల గాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధ, జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, మంచాల మండల అధ్యక్షులు ఎండి అజ్మత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలునాయక్, యాచారం అధ్యక్షులు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు మోతిలాల్, మండల కార్యదర్శి వెంకటచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో జోష్

- యాత్ర ఫర్ ఛేంజ్.. బహిరంగసభ సక్సెస్
- భారీగా తరలివచ్చిన జనం.. కిక్కిరిసిపోయిన అంబేద్కర్ స్టేడియం
- జై కాంగ్రెస్ నినాదాలలో మార్మోగిన ప్రాంగణం
- బైబై కేసీఆర్ ఫ్లకార్డులతో కార్యకర్తల ప్రదర్శన
- రాత్రి 10గంటలవరకూ సాగిన బహిరంగ
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్
- ఇల్లుకట్టుకునేందుకు రూ.5లక్షలు.. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ



బహిరంగసభలో పాల్గొన్న ప్రజలు

2004 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధినేత్రిగా ఉన్న సోనియాగాంధీ వచ్చినప్పుడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలోనే బహిరంగసభ నిర్వహించారు. అప్పుడు పార్టీ నేతలు, కార్యకర్తలు నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చిన రోజది. ఇన్నేండ్ల తరువాత అదే గడ్డపై కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగసభకు అదే సంఖ్యలో జనం రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. యాత్ర ఫర్ ఛేంజ్ పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్ర 23వ రోజు కరీంనగర్‌కు చేరుకుంది. రెండు రోజుల విరామం తరువాత కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్ బైపాస్‌రోడ్డు నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు నిర్వహించిన కవాతుతో నగర రోడ్లు కిక్కిరిసిపోయాయి. బహిరంగ సభ ప్రాంగణమంతా జనంతో నిండిపోగా.. జై కాంగ్రెస్ అంటూ చేసిన నినాదాలు మార్మోగాయి. బైబై కేసీఆర్ నినాదాలతో ఫ్లకార్డుల ప్రదర్శనతో కొందరు కార్యకర్తలు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి 10గంటలవరకూ సభ సాగడం గమనార్హం. నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్



బహిరంగసభలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు పేదలకు రూ.5లక్షల నగదు ఇస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు రాబోయే తమ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఇదే గడ్డపై రాష్ట్రాన్ని ఇస్తామని చెప్పిన సోనియా గాంధీ ' మాట తప్పకుండా మడప తిప్పకుండా' తెలంగాణను ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి తెలంగాణ దొంగపాలైందని, బంగారుతెలంగాణ చేస్తామని చెప్పిన కేసీఆర్ తాగుబోతుల తెలంగాణ చేశారని ఎద్దేవా చేశారు. ఊరూరికి వైన్స్‌షాపులు పదులకొద్ది బెల్టుషాపులు పెట్టి రాష్ట్ర ఆదాయంలో సగం మద్యంమీదనే సంపాదిస్తున్నారని అన్నారు. 'తెలంగాణ ఉద్యమకారులకు, నిరుద్యోగులకు ఈ వేదికగా ప్రశ్నిస్తున్నా..ఇక్కడ ఎంపీలుగా గెలిచిన కేసీఆర్, తన కుటుంబం కరీంనగర్ కు ఏం చేశారు? పొన్నం ప్రభాకర్ ను గెలిపిస్తే.. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారు. జైపాల్ రెడ్డి చొరవతో, వ్యూహంతో ఆనాడు తెలంగా రాష్ట్రం ఏర్పడింది. తల్లిని చంపి పిల్లను బ్రతికించారని మోదీ అవహేళన చేశారు. తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదు. ఇక్కడ గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ కు ఏం చేశారు?' అంటూ ప్రశ్నించారు. ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని టీపీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్వేషాన్ని వీడి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారని గుర్తు చేశారు. రాబోయే తమ ప్రభుత్వంలో నిరుద్యోగులకు రూ. 3000 భృతి అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ స్థలం చాలా చరిత్రాత్మక స్థలమని, దశాబ్దాల తెలంగాణ ప్రజల కోరికను తీర్చేందుకు సోనియాగాంధీ ఇక్కడే మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టువిక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులలో పారే నీటితోనే రాష్ట్రంలో పంటలు పండుతున్నాయని అన్నారు. తెలంగాణలో రూ.5లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందని, పక్కనున్న ఛత్తీస్‌గఢ్ అప్పు కేవలం రూ.83వేల 125 కోట్లు మాత్రమే ఉందని వివరించారు. మనం తెచ్చుకున్న తెలంగాణ లక్ష్యం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా అన్యాయాలు, అక్రమాలేనని, దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ దొందూ దొందేననిఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే అన్నారు. గుజరాత్ మోడల్ లో ఒక క్రికెట్ స్టేడియం మాత్రమే కనిపిస్తోందని, ఛత్తీస్‌గఢ్ మోడల్ లో రైతుల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని ఏఐసీసీ నేత జైరాంరమేష్ అన్నారు. చరిత్రలో తానీషా, నిజాం నిరంకుశ పాలన గురించి పుస్తకాల్లో చదివామని, కేసీఆర్ ఎనిమిదవ నిజాం లా వ్యవహరిస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షన నిర్వహించిన సభలో కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, షబ్బీర్‌అలీ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరమణరావు సహా నేతలు ప్రసంగించారు. సభలో సీతక్క పాడిన పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్



పద్మనగర్ బైపాస్ నుంచి అంబేద్కర్ స్టేడియం వైపు కవాతు నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి



పాదయాత్రలో ఓ మెకానిక్‌ను పలకరిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

వాడీవేడిగా సర్వసభ సమావేశం

చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచుల ఆవేదన

నవతెలంగాణ-శంకరపట్నం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస రెడ్డి, 24 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరై గడిచిన మూడు నెలల అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో బషీరుద్దీన్ మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిన పనులకు బిల్లులు రాకుంటే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు పంపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పల్లె సంజీవ రెడ్డి, ఎంపీటీసీల అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తిమ్మాపూర్: బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుం టామని, మా బలం, బలగం బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులేనని రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధి లోని అల్గునూర్ 8వ డివిజన్ లో తొలిపొద్దు పర్యటనలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. గుర్రాల క్రిష్టారెడ్డి అనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రసమయి స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి రూ. 2.లక్షల బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం డివిజన్‌లో విస్తృతంగా పర్యటిస్తూ బాధితుల ఇళ్లకు నేరుగా వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తూ, ప్రజలతో మమేకమవుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, పోరండ్ల సహకార సంఘం సింగిరెడ్డి స్వామి రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సల్ల రవీందర్, కంది అశోక్ రెడ్డి, సిరిసిల్ల అంజయ్య, సిల్ల పర్శరాములు, దాసం కమలాకర్, సల్ల మహేందర్ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

మానకొండూర్ నియోజక వర్గంలోని తిమ్మాపూర్ మండ లంలో గురువారం రాష్ట్ర సాం స్కృతిక సారథి ఛైర్మన్ మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పలు వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వ దించారు. తిమ్మాపూర్ మండ ల కేంద్రంలో ఎంపీటీసీ వేల్పుల మమత, ఇందిరా నగర్ పరిధిలోని దామా అంజ య్య కూతురు వివాహానికి హాజరై శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కేతిరెడ్డి వనితా దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు దుండ్ర రాజయ్య యాదవ్, ఆత్మ కమిటీ ఛైర్మన్ పాశం అశోక్ రెడ్డి, సర్పంచులు దుండ్ర నీలమ్మ, జక్కని శ్రీవాణి, వేల్పుల మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని నల్లగొండ గ్రామంలో గల శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా గురువారం జాతర నిర్వహిం చారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యే రసమయిని శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఆలయ కమిటీ ఛైర్మన్ దన్నమనేని శ్రీనివాస రావు, ఆత్మ కమిటీ ఛైర్మన్ పాశం అశోక్ రెడ్డి, నాయకులు గాండ్ల శ్రీనివాస్, ఆలయ కమిటీ డైరెక్టర్లు దుర్గం శ్రీనివాస్, కనకయ్య, మధునయ్య, ఎల్లయ్య, ఆలయ ఈవో వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మహిళలను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్లో గురువారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ సల్ల శారద, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్ రెడ్డి, మండల వైద్యాధికారి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వీఓలను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్త్రీ లేకపోతే గమనం లేదని అన్ని రంగాల్లో మహిళలు అందివచ్చిన అవకాశాలతో ముందుకు సాగాలని కార్పొరేటర్ సల్ల శారద రవీందర్ అన్నారు. మహిళలకు పురుషులతో సమాన హక్కులు కల్పించాలని ఆనాడు అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి వారి హక్కుల సాధన కోసం చేసిన పోరాటం వల్లే మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కేడీసీసీబీ డైరెక్టర్ సింగిరెడ్డి స్వామి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది రామచంద్ర రెడ్డి, సిల్ల పర్శరాములు, దాసం కమలాకర్, జాప రాఘవరెడ్డి, పి.రమేష్, యాశ్వాడ శ్రీకాంత్, జాప లక్ష్మారెడ్డి, కర్ర కిషన్, సిబ్బంది సిరిసిల్ల రాములు, జహీర్, మేడి రాములు పాల్గొన్నారు.

సీబీఎస్సీ నేషనల్ గణిత ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఛైర్మెన్ ప్రసాద్ రావు

నవతెలంగాణ-కరీంనగర్: ఇటీవల జరిగిన ఆర్య భట్ట గణిత్ ఒలంపియాడ్ పరీక్షలో నగరంలోని స్థానిక పారమిత హెరిటేజ్ పాఠశా లకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు చామల శ్రీని జ, చవట లక్ష్మీ హాసిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రీజియన్ లెవల్ టాప్-100లో స్థానం పొందారని ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సరైన రీతిలో పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం ద్వారా ఇలాంటి అద్భుతమైన ఫలితాల ను సాధించగలరని, ఈ విజయం పారమిత విద్యార్థుల ప్రతిభాపాటవాలకు నిదర్శనమని పాఠశాలల ఛైర్మెన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భం గా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ అనూకర్ రావు, రశ్మిత, ప్రసూన, రాకేష్, వినోద్ రావు, వీయూఎం ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు లక్ష్మిదీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆచరణలో ఏమి లేదు..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్లపు రమేష్, కోమల ఆంజనేయులు



నవతెలంగాణ-కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు మహిళల సంక్షేమానికి ఎంతో చేశామని గొప్పలు చెప్పారని, ఆచరణలో మాత్రం ఏమి చేయలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్లపు రమేష్, కోమల ఆంజనేయులు విమర్శించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మంత్రులుగా ఎంతమందికి అవకాశం కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని అన్ని వర్గాలు భావించాయని, కానీ తెలంగాణలో అందుకు విరుద్ధంగా పాలన కొనసాగుతుం దన్నారు. కేసీఆర్ సర్కార్ ఉద్యమకారుల ఆకాంక్షలను తుంగలో తొక్కిందని, హామీల అమల్లో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్‌కు చేసిందేమి లేదని, కేంద్ర పథకాలు రాష్ట్ర పథకాలుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయంలో కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నియంతృత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాస సత్యనారాయణ రావు, శివరామకృష్ణ, వాసుదేవ రెడ్డి, రమణా రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా వారోత్సవాలు



ముగ్గులను చూస్తున్న మేయర్ సునీల్ రావు

నవతెలంగాణ-కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా కరీం నగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళా వారో త్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. సమాజంలో మహిళల శక్తిని, పాత్రను తెలిపేలా 8 నుంచి 14వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మహిళ ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా సిబ్బందికి ముగ్గులు, మెహందీ పోటీలు జరిగాయి. ఈ పోటీలను మేయర్ సునీల్ రావు, కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్త్రీ లేనిదే జననం లేదని, స్త్రీ లేనిదే ఈ ప్రపంచమే లేదని, అలాంటి స్త్రీ శక్తిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. చివరి రోజు క్లోజింగ్ సెర్మనీ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించి ఉత్తమ మహిళలకు ఘనంగా సన్మానం చేసి, మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం విజేతలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగిత్యాల: జగిత్యాల పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుకు వెళ్లాలని, మేరు మహిళలు చేస్తున్న కుట్టు పనిలో ఆధునిక సాంకేతికతను వినియోగించి ఫ్యాషన్ డిజైన్‌లో పేరు ప్రతిష్టలు సాధించాలని, ఎలాంటి పరిస్థితులలోనైనా దృఢత్వంతో ఆయా రంగాల్లో విజయాలు సాధించాలని వార్డు కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్, టి-లైఫ్ ఆర్గనిజేషన్ జిల్లా బాధ్యులు పొన్నాల శిరీషరెడ్డి సూచించారు. కార్యక్రమంలో మహిళలు ఆటపాటలతో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మేరు మహిళలను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మేరు సంఘం సహాయ కార్యదర్శి రాపర్తి రమ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వోదెల యమున, పోల్కం గంగభావాని, సభ్యులు రాపర్తి రాధిక, గట్ల జాన్సీ పాల్గొన్నారు.





21 మంది ఇన్స్పెక్టర్ల బదిలీ

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం: మల్టీ జోన్ వన్ పరిధిలో పని చేస్తున్న 21 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ పి.చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాజీపేటలో పని చేస్తున్న జి.మహేందర్ రెడ్డిని మందమర్రి సర్కిల్ కు, భూపాలపల్లి సిసిఎస్‌లో పని చేస్తున్న వాసుదేవరావును చెన్నూరుకు, చెన్నూరులో పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను శ్రీరాంపూర్ మహిళా పోలీస్ స్టేషన్‌కు, నిజామాబాద్ ఎస్‌బీలో పని చేస్తున్న శ్రీహరిని ఖానాపూర్‌కు, కొత్తగూడెం డీఎస్పీలో పని చేస్తున్న స్వామిని ఖమ్మం ఒకటవ పోలీస్ స్టేషన్‌కు, కొత్తగూడెం ఒకటో పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న సత్యనారాయణను ఖమ్మం మూడవ పోలీస్ స్టేషన్‌కు, భూపాలపల్లిలో పని చేస్తున్న రాజిరెడ్డిని ఖమ్మం రూరల్‌కు, కొత్తగూడెం డిసిఆర్‌బిలో పని చేస్తున్న వేణుచందర్‌ను చిట్యాల సర్కిల్‌కు, మందమర్రిలో పని చేస్తున్న ప్రమోదరావును గోదావరిఖని వన్ టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే వరంగల్ వీఆర్‌లో ఉన్న రమేష్‌ను మహబూబాబాద్ రూరల్‌కు, మహబూబాబాద్ పిసిఆర్‌లో పని చేస్తున్న రవి రాజును వరంగల్ కమిషనరేట్‌కు, మహబూబాబాద్ రూరల్‌లో పని చేస్తున్న రవి కుమార్‌ను మహబూబాబాద్ పిసిఆర్‌కు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌బిలో పని చేస్తున్న సర్వర్‌ను ఐజీపీ కార్యాలయానికి, గోదావరిఖని వన్ టౌన్ లో పని చేస్తున్న రమేష్ బాబును రామగుండం ఎస్ బి3 కు, రామగుండం ఐటీలో పని చేస్తున్న కర్ణాకర్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌బికి, వెయిటింగ్‌లో ఉన్న రవీందర్‌ను వరంగల్ కమిషనరేట్‌కు, ఖానాపూర్ హవేలీలో పనిచేస్తున్న రామ కృష్ణను ఐజిపి కార్యాలయానికి, ఖమ్మం ఒకటవ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న చిట్టిబాబు, ఖమ్మం మూడవ స్టేషన్‌లో పని చేస్తున్న సర్వయ్య, ఖమ్మం రూరల్ లో పని చేస్తున్న శ్రీనివాసును ఐజిపి కార్యాలయానికి, చిట్యాలలో పని చేస్తున్న వెంకట్‌ను భూపాలపల్లి సిసిఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు అంగారక టౌన్ షిప్ ప్రీ బిడ్ సమావేశం

జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్



నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని నుస్తు లాపూర్ గ్రామంలో అంగారక టౌన్ షిప్‌లో సందేహాల నివృత్తి కోసం నేడు శుక్రవారం ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ తెలిపారు. అంగారికా టౌన్షిప్‌లో గల తుది విడత 157 ప్లాట్ల అమ్మకానికి వాసర గార్డెన్‌లో వేలం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామ రైతు వేదిక లో అవగాహన సదస్సు (ప్రీ బిడ్) నిర్వహించబడుతుందని, సందేహాల నివృత్తి కోసం దరఖాస్తుదారులు, ఔత్సాహికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు .వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేల డిపాజిట్ జిల్లా కలెక్టర్ కరీంనగర్ (రాజీవ్ స్వగృహ) పేరున డిమాండ్ డ్రాఫ్ట్‌ను కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న సుడా ఆఫీసులో సమర్పించాలని అన్నారు.

జగిత్యాల పట్టణ మున్సిపల్ సాధారణ సమావేశం

ఎజెండాలో పొందు పర్చిన అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-జగిత్యాల టౌన్: ఆదాయ, వ్యయాలకు సంబంధించి నవంబర్ నుంచి జనవరి మూడు మాసాలకు సంబంధించి నెల వారీగా కాకుండా 3 మాసాలకు సంబంధిచి ఒకే మొత్తంగా చూపడం నిబంధనలకు విరుద్ధమని 35 వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ అన్నారు..సెంట్రల్ మీడియన్‌కు మొక్కలు (12 కర్జూర చెట్లు) మిగిలిన మొక్కలు నర్సరీ నుండి పెట్టిన వాటి ఖర్చు రూ.6,05,129 రవాణాకు ట్రాక్టర్ కిరాయి పేరు మీద రూ.2,29,554 ఇక్కడ ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. చెట్లకు కలర్స్ పేరిట కేవలం సున్నం వేసి దాదాపు రూ.20 లక్షలు చెల్లించారని, స్వీపింగ్ మిషన్ అనేది అధికారులకు ఆదాయ వనరుగా మారిందని, 45 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి రిపేర్ల పేర్ల మీద లక్షల రూపాయలు ఖర్చు చూపుతూ పనికిరాని దాని పేరు మీద ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కలెక్టర్ అధ్యర్యంలో జరగాల్సిన నియామకాలు సానిటేషన్ లేబర్లు గాని, ఆపరేటర్లు గాని, సిబ్బంది కానీ కొత్త వారు వస్తున్నారని, ఈ అంశాలపై కూడ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ధ్వని కాలుష్యానికి కారణమైన 6 బైక్‌లు పట్టివేత

నవతెలంగాణ-జగిత్యాల: ధ్వని కాలుష్యాన్ని సృష్టిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న 6 ద్విచక్ర వాహనాలను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుకున్నామని ట్రాఫిక్ ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు. జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. బైకులకు ఎక్కువగా ధ్వని వచ్చే సైలెన్సర్లు బిగించుకొని పట్టణంలో అతి వేగంగా నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు ఫిర్యాదులు అందాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 6 వాహనాలు స్వాధీనం చేసుకుని ఎంవీఐకి అప్పగిస్తామని చెప్పారు. అదే విధంగా బైపాస్ నుండి చిన్న కెనాల్, గోవిందుపల్లి మీదుగా గొల్లపల్లి రోడ్డు, మంచి నీళ్ళ భావి వరకు బైక్ రైడింగులు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేసి ఇలాంటి పనులు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ' తెలంగాణ బచావో ' సదస్సు

సదస్సును విజయవంతం చేయండి

టీజేఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి



నవతెలంగాణ-జగిత్యాల టౌన్: మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా మార్చ్ 10న శుక్రవారం ఉదయం 10 గంటలకు వీఎస్‌టీ ఫంక్షన్ హాల్, ఆర్టీసీ కళ్యాణ మండ పం ఎదురుగా, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ లో జరిగే తెలంగాణ బచావో సదస్సుకు జగిత్యాల జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు, మేధావులు, విద్యా వంతులు స్వచ్ఛందంగా తరలి రావాలని తెలంగాణ జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమాల రథసారథి ప్రొఫెసర్ ఎం.కోదండరాం సారథ్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ప్రజల-ప్రజాస్వామిక ఆకాంక్షల సాధన కోసం 'ఉమ్మడి ఉద్యమ నిర్మాణం' చేయడమే సదస్సు లక్ష్యమని తెలిపారు. ఉద్యమాల, హక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజా యుద్ధనౌక గద్దర్, రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి, మందకృష్ణ మాదిగ, అంబటి నాగయ్య, ప్రముఖ ఆక్టివిస్ట్, సింగర్ జయరాజ్, విమలక్క, సంధ్యతో పాటు అనేక మంది ఉద్యమ నేతలు, ప్రొఫెసర్లు తదితరులు హాజరై ఉమ్మడి ఉద్యమ నిర్మాణానికి మార్గ నిర్దేశనం చేస్తారని ఆయన సూచించారు. ప్రజా స్వామిక తెలంగాణ కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ సదస్సుకు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ కవితను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ



బత్తుల లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-చొప్పదండి: తెలంగాణ ముఖ్యమంత్రి గారాల కూతురైన ఎమ్మెల్సీ కవితను రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం పాలిస్తోందని, అత్యున్నత పదవిలో ఉన్న ఎమ్మెల్సీ కవిత ప్రజల సమస్యలు పరిష్కరించాలే తప్ప సొంత స్వలాభం కోసం ఢిల్లీలో లిక్కర్ స్కామ్ దందా చేస్తూ తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని ఆరోపించారు. కవితను వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పదవి నుండి తొలగించిన తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు ఒక న్యాయం, కవితకి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో అధికార పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

తెలంగాణ యువత సినిమాల్లోనూ సత్తా చాటాలి

'నేడే విడుదల' సినిమా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



నవతెలంగాణ-జగిత్యాల: రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పన్నాల రాంరెడ్డి దర్శత్వం వహించి, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'నేడే విడుదల' సినిమా పోస్టర్‌ను స్థానిక ఇందిరా భవన్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఆవిష్కరించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీరామ థియేటర్‌లో శుక్రవారం సినిమా విడుదల చేయనున్నారని దర్శకుడు రాంరెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పన్నాల రాంరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ యువత తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని, అభిరుచికి అనుగుణంగా కృషి చేస్తే విజయం సాధించవచ్చన్నారు. రాం రెడ్డిని కుటుంబ సభ్యులు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యువత సమాజ హితం కోసం నడుం బిగించాలని, తెలంగాణ నుండి మరింత మంది సినిమా రంగంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మారు గంగారెడ్డి, గొంటి మొగిలి, పూర్ణచంధర్ రెడ్డి, స్వామి రెడ్డి, అంకతీ గంగాధర్, సురేష్, మహేష్, లక్ష్మీపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



నవతెలంగాణ-మెట్‌పల్లి రూరల్ : మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ఆకుల రాజగంగు, ఉప సర్పంచ్ గంట రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి హేమలత సబ్బులు, నూనెలు, గ్లౌజులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్లౌజులు , మాస్కులు ధరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ ఆకుల రాజగంగు సూచించారు.

పంట రుణాలను వెంటనే చెల్లించాలి

పీఏసీసీఎస్ ఛైర్మన్, కేడీసీసీ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్ రెడ్డి

నవతెలంగాణ-మేడిపల్లి: మేడిపల్లి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరపతి పరిధిలోని దీర్ఘకాలిక లోన్‌లు, పంట రుణాలను, ఇతర సంబంధ రుణాలను మార్చి నెలలో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని పీఏసీసీఎస్ ఛైర్మన్, కేడీసీసీ కరీంనగర్ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్ రెడ్డి, సీఈవో బొందయ్య సొసైటీ పరిధిలోని రైతులను కోరారు.

కంటి వెలుగు దేశానికి ఆదర్శమైన పథకం



నవతెలంగాణ-బుగ్గారం: మండల కేంద్రంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్-రాజమణి రెండో విడత కంటి వెలుగును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు, అలసత్వం వల్ల కొందరు వారి కంటి చూపును కోల్పోయిన పరిస్థితులు తెలంగాణలో ఉండడంతో అలాంటివి పునరావృతం కాకూడదని కేసీఆర్ దృఢ సంకల్పంతో ప్రారంభించిన పథకమే ఈ కంటి వెలుగు అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదినేని రాజమణి, గ్రామ సర్పంచ్ మూల సుమలత-శ్రీనివాస్ గౌడ్, వైస్ ఎంపీపీ జోగినిపెల్లి సుచేందర్, మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ రహమాన్, గంగాపూర్ సర్పంచ్ దొరగాండ్ల జగన్, ఎంపీడీవో తిరుపతి, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రాజేశం, పంచాయతీ కార్యదర్శి నరేందర్ గౌడ్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోటో: 9 సైదాపూర్ ఫైల్ 1

తడి, పొడి పద్ధతిలో వరి సాగు చేయాలి



వరి సాగు గురించి వివరిస్తున్న కోఆర్డినేటర్

నవతెలంగాణ-సైదాపూర్: తడి, పొడి పద్ధతిలో వరి సాగు చేయాలని సర్పంచ్ పల్లేని పరిణీత అన్నారు. గురువారం మండలంలోని అమ్మనగుర్తి గ్రామంలో పద్మపాని స్వచ్ఛంద సంస్థ కరీంనగర్, కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వరి సాగులో తడి,పొడి విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తడి, పొడి విధానం పాటించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ విధానంలో వరి సాగు చేయటం ద్వారా వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది చేను కింద పడిపోదు చీడపీడలు ముఖ్యంగా దోమపోటు ఉధృతి తక్కువగా ఉంటుందని, తడి, పొడి వరి సాగుతో మీథేన్ విష వాయువు తగ్గించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ పల్లేని ప్రవీణ్ రావు, ఉప సర్పంచ్ గోనెల శైలజ, వార్డు సభ్యులు, ఎండీ సల్మా, పూదరి బుచ్చయ్య, వీరమల్ల భాస్కర్ రెడ్డి, సాగర్ రావు, గజ్జెల రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సతీష్, క్లస్టర్ కోఆర్డినేటర్ మధుకర్ రెడ్డి, మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ బిక్షపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును పట్టణ ప్రజలు వినియోగించుకునేలా చేయాలి

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ-చొప్పదండి: టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును చొప్పదండి పట్టణంలోని ప్రజలు వినియోగించుకునేలా చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. చొప్పదండి పట్టణంలోని 10వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు ఉచిత శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేసి, సిబ్బంది ఇంటింటా సర్వే చేసి కార్యక్రమాన్ని వినియోగించుకునేలా చేయాలన్నారు. కంటి వెలుగు శిబిరంలో వైద్య, మున్సిపల్ సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ పి శాంతి కుమార్, 10వ వార్డు కౌన్సిలర్ కొత్తూరి స్వతంత్ర భారతి నరేష్, 2వ వార్డు కౌన్సిలర్ మాడూరి శ్రీనివాస్, దండే కృష్ణ, సి హెచ్ ఓ ప్రసాద్, మాజీ స్పార్క్ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు కస్తూరి శుభ శేఖర్, కొక్కుల తిరుపతి, పెంటి గంగారాం, చీకట్ల శ్రీనివాస్, కొండిశ్ల శంకర్, వడ్లకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో ఈశ్వర్ యువజన సంఘం వారు పోచమ్మ గుడి పునర్నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పోచమ్మ గుడికి గ్రామ సర్పంచ్ తాళ్ల పెల్లి సుజాత శ్రీనివాస్ గౌడ్ భూమిపూజ చేశారు. ఈ గుడి నిర్మాణం గ్రామ సర్పంచ్ తాళ్ల పెల్లి సుజాత శ్రీనివాస్ గౌడ్ తల్లి స్వర్గీయ తాళ్ల పెల్లి జననమ్మ జ్ఞాపకార్థం గుడి నిర్మిస్తున్నట్లు తెలిపారు. గుడిని నిర్మిస్తున్న సర్పంచ్ తాళ్లపల్లి సుజాత శ్రీనివాస్ గౌడ్‌ను ఈశ్వర్ యువజన సంఘం వారు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట కోటేష్ పటేల్, ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ సర్పంచ్ కనకయ్య, డైరెక్టర్ సత్తు నరసయ్య, వార్డు సభ్యులు పోగుల సునీత రమేష్, ఆకుల సురేష్, మల్లయ్య, చంద్రయ్య, మల్లేష్, రమేష్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


కార్డన్ సర్చ్



నవతెలంగాణ-జగిత్యాల టౌన్: జిల్లా ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు టీఆర్. నగర్‌లో తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలు-డ్రగ్స్‌ను పసికట్టే ప్రత్యేక శిక్షణ పొందిన రెండు పోలీస్ జాగిలాలతో డీఎస్పీ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రతి ఇల్లు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్లు లేని 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 100 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ నారాయణపూర్ ప్రాజెక్టుకు చేరిన నీరు

- వరి పొలాలు జీవం
- సంపుల వద్ద సంబురాలు



సంపుల వద్ద ఎగిసి పడుతున్న నీరు

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం నారాయణపూర్ ప్రాజెక్టులకు మళ్లీ ఎల్లంపల్లి జలాలు చేరుతున్నాయి. ఫిబ్రవరి 28 న ఎల్లంపల్లి నీటిని నారాయణపూర్ జలాశయానికి మోటార్లు స్టార్ట్ చేసి వదలగా, నందిమేడారం పంపుహౌజ్ వద్ద పైపులైన్లు పగిలి నిలిచి పోయింది. దీంతో యాసంగి పంటలు సాగు చేసి నీళ్ల కోసం ఎదిరి చూసే రైతులకు నిరాశే ఎదురైంది. నీటిపారుదలశాఖ అధికారుల తప్పిదం లేకున్నా పంపహౌజ్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం, పైపులైన్లు వగిలి ఎల్లంపల్లి నీటి పంపింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి రైతులు పంటలను కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. ఎత్తిపోతల పథకం కింద ఎల్లంపల్లి నీరు నారాయణపూర్‌కు ఎప్పుడు వదులుతారా అని ఎదిరి చూసిన రైతాంగానికి ఎట్టకేలకు ఊరట లభించినట్టే. ఎల్లంపల్లి జలాలపై ఎన్నో ఆశలు పెట్టుకుని రైతులు పంటలు సాగు చేయగా, ఎండ తీవ్రత పెరిగి బావులు, బోర్ల నీరు అడుగంటి సాగు చేసిన అనేక ఎకరాల్లోని వరి పొలాలు నీరు లేక ఇప్పటికే ఎండి పోయాయి. అయితే కాస్తో కూస్తో ఉన్న నీళ్లతో కాపాడుకున్న వరి పొలాలకు ప్రస్తుతం వదిలిన నీరు జీవం పోస్తుందని రైతులు ఆశ పడుతున్నారు. ప్రస్తుతం నారాయణపూర్ జలాశయానికి వదిలిన నీరు 15 రోజులు గడిస్తే తప్పా సాగునీటి కాలువలు, వాగు ద్వారా నీరు ప్రవహించే అవకాశాలు లేవు. అంతేకుండా ఎల్లంపల్లి జలాశయం నిండితే తప్పా ఇస్లాంపూర్ వద్ద గల పంప్‌హౌజ్ స్టార్ట్ చేసి పోతారం, ఫాజుల్‌నగర్‌లోని చెరువుల్లోకి నీటి మళ్లింపు చేసే అవకాశాలు లేవు. అయితే నిరాటంకంగా మేడారం నుండి నారాయణపూర్ ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేస్తే తప్పా ఇది సాధ్యపడదు. అయితే ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మంత్రుల ఒత్తిడితో ప్రారంభించిన పంపింగ్ కొనసాగిస్తే తప్పా ఎండుతున్న పంటలకు నీరందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. చొప్పదండి నియోజక వర్గంలోని ఆరు మండలాల రైతాంగం నీరెప్పుడొస్తుందని ఎదిరి చూస్తుండగా, ఉన్న నీటితో ఎండుతున్న వరి పొలాలను కాపాడుకుంటే తప్పా ఇప్పటికిప్పుడు నీరందే పరిస్థితి మాత్రం లేదు. పది, పదిహేను రోజులు గడిస్తే తప్పా చొప్పదండి నియోజక వర్గంలోని చెరువులు, కుంటల్లోకి నీటి మళ్లింపు జరిగే అవకాశాలు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సంపుల వద్ద నేతల సంబురాలు



ఎగిసి పడుతున్న నీళ్లలో పసుపు, కుంకుమ చల్లుతున్న నేతలు

ఎల్లంపల్లి నుండి నారాయణపూర్ జలాశయానికి వదిలిన సంపుల వద్ద బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, రైతులు సంబురాలు జరుపుకున్నారు. సంపుల వద్ద ఎగిసి పడుతున్న నీళ్లలో పసుపు, కుంకుమ చల్లి, టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, సర్పంచ్‌లు మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, జోగు సాగర్, పొట్టాల కనుకయ్య, లక్ష్మినారాయణ, కనుకయ్య ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు అట్ల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వేముల అంజి, సురెందర్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

ప్రస్తావనలు బోలెడు.. పరిష్కారమయ్యేటివి సొరెడు

- బెల్ట్‌షాప్‌లపై నియంత్రణ శూన్యమని ప్రస్తావించిన సర్పంచులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

నవతెలంగాణ-గన్నేరువరం: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు తలెత్తుతున్న సమస్యల పరిష్కారం, ప్రభుత్వపరంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల తీరు, ఆయా శాఖల అధికారుల పని తీరుపై సమీక్ష నిర్వహించుకోవడమే సర్వసభ్య సమావేశం ముఖ్యోద్దేశం. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు లింగాల మల్లారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు గైర్హాజర్ కావడం ఆనవాయితీగా నడుస్తోంది. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు సభా దృష్టికి తీసుకెళ్లితే ఆయా శాఖల అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు ఈ సభ ఎంతో దోహదపడుతుంది. ముందుగా సర్పంచులు పుల్లెల లక్ష్మీ, తీగెల మోహన్ రెడ్డి, జక్కనపల్లి మధు మాట్లాడుతూ.. ఉదయం 5 గంటలకే తప్పతాగి యువకులు రోడ్ల మీద పడుతున్నారు.మందు బాబుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, గ్రామ గ్రామాన పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాప్‌లు విపరీతంగా పెరిగిపోతున్నా ఎక్సైజ్‌శాఖ అధికారుల నియంత్రణ శూన్యంగా మారిందని సభా దృష్టికి తీసుకొచ్చారు.పారువెల్ల సర్పంచ్ మాట్లాడారు.డి7 కాల్వ కోసం అధికారులు సర్వే చేపట్టారు. ఈ కాల్వ వల్ల రైతులు ఉపయోగం కన్నా అధికంగా నష్టాలే ఉన్నాయి. పెన పారువెల్ల చెరువు,కింద బట్టపెల్లికుంట ఉంది. మధ్యలోంచి ఈ కాల్వకు సర్వే చేపట్టిన దాన్ని రైతులు అడ్డుకొన్నారు. ఎమ్మెల్యేకు కూడా వినతిపత్రం అందజేశారని సభా దృష్టికి తీసుకువచ్చారు. ఐకెపి ఏపిఎం మాట్లాడుతూ శ్రీనిధిలో గన్నేరువరం మండలం జిల్లాల్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు.ఇందులో భాగంగా సోలార్ సిస్టిమ్ 2కెవి,3కెవి అందుబాటులో ఉందన్నారు.అలాగే ప్రధానమంత్రి ఫుడ్ యోజన పథకం కింద నిరుద్యోగులకు కారంపొడి,మినీమిల్లులు,అటుకులు,ఇతరత్రా యూనిట్ల పెట్టుకోవడానికి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని తమను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు.హన్మాజిపల్లి, మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. గదులలో విద్యార్థులకు ఫ్యాన్లు లేవన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు వెంటనే ఫ్యాన్లు బిగించాలని కోరారు. మండలంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధిలో జిల్లాలో ముందంజలో ఉన్నామన్నారు. డి8, డి9 ఉపకాల్వలకు డీబీలు క్లియర్ చేసి రైతుల పంటలకు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మన ఊరు మన బడి కార్యక్రమ పనులను వేగవంతం చేయాలన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులందరూ వంద శాతం హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నర్సింహా రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు తీగల మోహన్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు సర్కార్ కానుక కళ్యాణలక్ష్మి

- సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం తెలంగాణ
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ-రామడుగు: ఆడబిడ్డలకు సర్కారు కానుక కళ్యాణలక్ష్మి పథకమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు 60,06,960 రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. 2014 ముందు ఆడపిల్లల పెళ్లి చేయాలంటే పేదవాళ్లు అప్పు చేసి పెళ్లి చేసేవారని, టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డలకు మేనమామగా మారి ఒక లక్ష 116 రూపాయలను పేద ప్రజలకు చెక్కుల రూపంలో నేరుగా ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పడిగెల రాజ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ మామిడి తిరుపతి, వైస్ ఛైర్మన్ చాడ ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ వంచ మహేందర్ రెడ్డి, సర్పంచులు, నాయకులు పూడూరి మల్లేషం, శనిగరపు అనిల్, శనిగరపు అర్జున్ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



వధూవరులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

నవతెలంగాణ-రామడుగు: పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పదివేల ఆర్థిక సాయం అందజేసి తోడ్పాటు నందించారు దుబాయ్ ఎల్లాల శీనన్న సేవా సమితి ప్రధాన కార్యదర్శి రామడుగు మండలంలోని రంగాసయిపల్లి గ్రామానికి చెందిన చిలుముల రమేశ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన చెన్నవేని నర్సవ్వ భూమయ్య పేద దంపతుల కూతురు గంగాలక్ష్మి అనే అమ్మాయికి పెళ్లి కుదిరింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో దాతల సహాయంతో కొండగట్టు దేవాలయంలో పెళ్ళి చేయాలని అనుకున్నారు. విషయం తెలుసుకున్న వారి బంధువు దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సహాయం కోరారు. వెంటనే స్పందించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొండగట్టు పంచముఖ దేవాలయంలో వధూవరులను ఆశీర్వదించి పదివేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు, నర్సింహునిపేట సర్పంచ్ బాబుస్వామి, కొండబట్టిని నరేష్, కోకిల నరేష్, చిలుముల వినోద్, జోగు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

5వ రోజు విజ్ఞాన యాత్ర



నవతెలంగాణ-వెల్గటూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాలకవర్గం కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా మార్కెట్ యార్డును ఐదో రోజు సందర్శన యాత్ర లో భాగంగా సందర్శించారు. అక్కడి వ్యవసాయ ఉత్పత్తులు వేరుశనగపై అధ్యయనం చేసినట్లు ఏఎంసీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ తెలిపారు. పంటల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ పొడేటి రవి, సభ్యులు జల్లెల కనకయ్య, బూరగడ్డ రవి, మెరుగు మురళి, కుతాడి నాగరాజు, జాబు రాజన్న, మార్కెట్ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

బీజేపీలో అవినీతికి పాల్పడుతున్న నాయకులను ఎందుకు ఉపేక్షిస్తున్నారు?

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ-చొప్పదండి: బీజేపీలో అవినీతికి పాల్పడుతున్న నాయకులను ఎందుకు ఉపేక్షిస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో బీజేపీకి బీఆర్ఎస్ ప్రత్యామ్నాయంగా మారబోతుందన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ గొంతు ప్రజలు నొక్కే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తోందని తెలిపారు. ఆ పార్టీ అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. నిలువెల్లా విషం చిమ్ముతున్న మోడీ, అమిత్‌షా లఅసలు రూపును బయట పెడతామని, ప్రజల మధ్య దోషులుగా నిలబెడతామని అన్నారు.

ఉప సర్పంచ్ కి ఉత్తరం ఇచ్చిన వీడీసీ

రెండు కోట్ల ఆరు లక్షల లెక్క చెప్పాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-జగిత్యాల: నూతనంగా బాధ్యతలు చేపట్టిన బుగ్గారం ఉప సర్పంచ్ నగునూరి రామకృష్ణకు గ్రామ అభివృద్ధి కమిటీ పక్షాన గురువారం ఒక ఉత్తరం అందజేశారు. గ్రామ పంచాయతీలో బ్యాంక్ ఖాతాల నుండి డ్రా చేసిన రెండు కోట్ల ఆరు లక్షల ఇరవై ఐదు వేల ఒక వంద ఎనిమిది రూపాయల లెక్క ప్రజలకు చెప్పాలని వారు విజ్ఞప్తి చేశారు. గత మూడేండ్లుగా ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు లెక్కలు తేల్చడం లేదన్నారు. మీరైనా వాటిని బయటికి తీసి ప్రజల సొమ్ము కాపాడాలని ఉప సర్పంచ్ ను కోరారు. ఈ డబ్బులతో బుగ్గారం గ్రామంలో ఎక్కడెక్కడ ఏ ఏ పనులు చేశారో గ్రామ ప్రజలకు పూర్తి వివరంగా ఆధారాలతో సహా చూపెట్టాలని కోరారు. మీరు కూడా అలాంటి పొరపాట్లు చేసి కేసుల పాలు, ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడం జరుగొద్దని ఉప సర్పంచ్ రామకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నక్క చంద్రమౌళి, కోర్ కమిటీ ఛైర్మన్ చుక్క గంగారెడ్డి, వీడీసీ సభ్యులు కప్పల మల్లేష్ పాల్గొన్నారు.

లలితా మాత అమ్మవారికి ఘనంగా పూజ కార్యక్రమాలు

కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు



నవతెలంగాణ-జగిత్యాల: జగిత్యాల గ్రామీణ మండలంలోని పోలాస గ్రామంలో గల స్థానిక జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన నూట ఎనిమిది శ్రీ చక్ర సహిత లలితా మాత అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం వేళలో జగిత్యాలకు చెందిన ప్రముఖ వేద పండితులు శ్రీమాన్ నంబి వేణు గోపాల చార్య కౌశిక్ పర్యవేక్షణలో రుత్వికులచే నూట ఎనిమిది శ్రీ చక్రాలకు ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లలితా మాత సేవా ట్రస్ట్ సభ్యులు, ఆలయ కమిటీ ఫౌండర్ ఛైర్మన్ చెల్లం స్వరూప-సత్తయ్య, రంగ ప్రసన్న-శ్రీనాథ్, ఓట్టరి విద్యా దేవి-మహేష్, కోమురవెల్లి అంజలి-అశోక్, రేగోండ నాగరాణి-సతీష్, సామ రజిత-సునీల్ కుమార్, నాలుమాస్ రమ- మహేందర్, పెద్ది అశ్విని, ఉటూరి కళ్యాణి, పాంపట్టి సులోచనలతో పాటు, సేవా ట్రస్ట్ సభ్యులు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు, జగిత్యాల పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

నవతెలంగాణ - మానకొండూర్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ డే వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే రసమయి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు పిట్టల మధు, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ వి.అంజనేయరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ - మానకొండూర్ : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 95మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. రోగాల బారిన పడకుండా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వినత, వెల్ది పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బియబాని, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంఈవో మధుసూదనాచారి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా ఎల్‌ఎం కొప్పుల ట్రస్టు

ఎంపీపీ గోలి శోభ సురేందర్ రెడ్డి



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న ఎంపీపీ గోలి శోభ సురేందర్ రెడ్డి

నవతెలంగాణ - పెగడపల్లి : దివ్యాంగులకు అండగా ఎల్‌ఎం కొప్పుల సోషల్ ఆర్గనైజేషన్ సేవలు మరువలేనివని ఎంపీపీ గోలి శోభ సురేందర్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద గ్రామానికి చెందిన వికలాంగుడు చాతల్ల మల్లేశంకు గురువారం ఎల్‌ఎం కొప్పుల సోషల్ ఆర్గనైజేషన్ సహకారంతో ట్రై బ్యాటరీ సైకిల్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ గోలి శోభ సురేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని. వికలాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాటరీ సైకిల్ అందజేసినందుకు రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ఛైర్మన్ స్నేహలతకు లబ్దిదారుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు శ్రీనివాస్, నందగిరి సింగిల్ విండో ఛైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాదారపు కరుణాకర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి భూమి పూజ

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్



రెడ్డి ఫంక్షన్ హాల్‌కు భూమి పూజ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్

నవతెలంగాణ - పెగడపల్లి : మండల కేంద్రంలో రెడ్డి పంక్షన్ హాల్ నిర్మాణానికి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, నంచర్ల సర్పంచ్ గోలి మహేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ ఒరుగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంది మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి చాట్ల విజయభాస్కర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పటేల్ సత్యనారాయణ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు కాటం నర్సిహరెడ్డి, రాజరాజేశ్వర స్వామి దేవాలయం ఛైర్మన్ బుమాడి గంగారెడ్డి, స్థానిక రెడ్డి సంఘం నాయకులు కాటం సురేందర్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, పాశం మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ - చొప్పదండి : పట్టణంలో సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబా ప్రధాన ఆలయ నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా పట్టణ ప్రజల మధ్యలో నిర్వహించారు. ఆలయంలో గణపతి, దత్తాత్రేయ సాయిబాబా ప్రధాన ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఉదయం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి పట్టణ పురవీధుల్లో సందడిగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ సాయిబాబా ప్రధాన ఆలయ నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు భక్తులుపాల్గొన్నారు.

నేడు ధర్మపురి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేయనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

దేశంలో అరుదైన సనాతన సాంప్రదాయం

నవతెలంగాణ-జగిత్యాల: ధర్మపురిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నేడు సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రికార్డులను తనిఖీ చేసి, శాంతిభద్రతల అంశాలను పర్యవేక్షించి, ఘనంగా పూజలు అందుకోనున్నారు. భారతదేశంలో ఏ ప్రాంతంలో లేని అరుదైన సనాతన సంప్రదాయం, ఆచారం, అనాదిగా ధర్మపురి క్షేత్రంలో కొనసాగుతోంది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్తర, దక్షిణ, దిగ్విజయ యాత్ర కొనసాగడం, ఇందులో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం సనాతన సంప్రదాయం. ఇందులో భాగంగా పోలీసు అధికారులు ఆలయానికి వెళ్లి స్వామి వారిని సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించడం ఆనవాయితీ. స్వామి వారిని మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల ఘోషతో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మంగళహారతులతో స్వామివారిని ఆలయ ప్రాంగణం నుండి పట్టణ క్షేత్రంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడం ఆచారం. పోలీస్ స్టేషన్ ఆవరణ ప్రాంగణంలోకి స్వామి చేరుకోగానే పోలీస్ కుటుంబ సభ్యులు మంగళ హారతులతో స్వాగతం పలికి స్టేషన్ ప్రాంగణంలో అందంగా అలంకరించిన వేదికపై స్వామి వారిని ఆహ్వానిస్తారు. ఆలయ వేద పండితులు, అర్చకులు, ఘనంగా వేద మంత్రాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పోలీస్ కుటుంబ సభ్యులను వేద మంత్రాలతో ఘనంగా ఆశీర్వదిస్తారు. స్వామివారి పల్లకీని పోలీస్ అధికారులు భుజానికెత్తుకుని పోలీస్ స్టేషన్ ఆవరణలోకి తీసుకువెళ్తారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. పూజా ద్రవ్యాలతో పాటు కొన్ని రికార్డులు స్వామి ముందు ఉంచుతారు. ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పుర ప్రముఖులు, ఆలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో భక్తజనం ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

నట్టల నివారణకు మందుల పంపిణీ

నవతెలంగాణ-వెల్గటూర్: పైడిపల్లి గ్రామంలో మండల పశు వైద్యాధికారిని శ్రీప్రియ ఆధ్వర్యంలో 3300 గొర్రెలు, 928 మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి గ్రామ సర్పంచ్ గంగుల నగేష్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ సాటకుల రాయమల్లు, గొర్రెల మేకల సొసైటీ ప్రెసిడెంట్ నక్క సత్తయ్య, సంఘ శీను, పశువైద్య సిబ్బంది కె.కుమార్ స్వామి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చినా ఆగని అక్రమ నిర్మాణాలు

మంథని మున్సిపల్‌లో చట్టాలు అపహాస్యం


నోటీసులు ఇచ్చిన మంథనిలో ఆగని అక్రమ నిర్మాణాలు

నవతెలంగాణ - మంథని : మంథని మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతోన్నాయి. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా ఖాతరు చేయడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని గణపతి దేవాలయం సమీపంలో పడావు పడిన మున్సిపల్ ఆధీనంలో ఉన్న విలువైన స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా రెండు అంతస్తుల స్లాబ్ నిర్మాణం, ఓ రేకుల షెడ్ నిర్మాణం పూర్తికావస్తుంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యమేమిటని స్థానిక పట్టణ ప్రజల ఆరోపణలు ఉన్నాయి. దీంతో మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చట్టం అపహాస్యం పాలవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. మంథనిలో నిర్మాణం చేసిన రెడ్డి సంక్షేమ సంఘం పేరిట జరుగుతున్న కట్టడంపై మంథని మున్సిపల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. ఆ గడువు ముగిసి రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు 'అంతా నేను చూసుకుంటా.. మీ పని కానివ్వండి' అని ఓ స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ మేరకు మళ్లీ రెండు రోజులుగా యథేచ్ఛగా నిర్మాణం చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు కొందరు వినతిపత్రాలు అందజేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసేవారిని కొందరు బెదిరిస్తున్నట్టు సమాచారం. మంథనిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంపై గురువారం మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పేద జంటలకు సామూహిక వివాహాలు


నూతన జంటలతో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెంట రాజేష్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : వివాహం చేసుకునే పేద జంటలకు అన్నీ తానై అండగా నిలిచాడు ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు పెంట రాజేష్. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త డాక్టర్ రాజేష్ చేతుల మీదుగా నిరుపేద కుటుంబాలకు చెందిన 7జంటలకు ప్రధాన వేద పండితులు కొండపాక శ్రీనివాచార్యులు, సహాయ పండితులు గులుసు నాగేశ్వరశర్మ వివాహం చేయించారు. సంగీత్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసి సామూహిక వివాహాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏడేండ్ల నుంచి పెద్దపల్లి జిల్లాలోని పరిసర ప్రాంత నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు పెంట రాజేష్ వివాహాలను జరిపిస్తున్నారు. తల్లితండ్రి లేని ఆడపిల్లలకు పెంట రాజేష్ దంపతులు స్వయంగా వరుడి కాళ్ల కడిగి కన్యాదానం చేయడం గమనార్హం. వివాహం చేసుకునే జంటలకు బంగారు పుస్తెలు కాళ్ల మట్టెలు నూతన వస్త్రాలు ఉచితంగా అందించి వైభవంగా వివాహాలు జరిపించి, వివాహానంతరం బంధువులు, అతిథులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, బిఆర్ఎస్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండి సతీష్, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి, రామగుండం 45 డివిజన్ కార్పరేటర్ కొమ్ము వేణు, కాపు సంఘం నాయకుడు తూముల శ్రీనివాస్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమ సంస్థ ద్వార ఇప్పటి వరకు 112 జంటలకు వివాహాలు చేసినట్లు తెలిపారు. ఆసరా ఫౌండేషన్ సభ్యులు దీలీప్ కత్రీ, రాజు యాదవ్, మోహన్‌జీ, పులి కొమురయ్య, కొత్త సాయి, ఆకుల సాంబశివరాజు, ఉప్పు సదానందం, శరత్ మోహన్, దొడ్ల దేవేందర్ పటేల్, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్‌లకు సన్మానం


ట్రైనీ ఐఏఎస్‌లను సన్మానిస్తున్న మంథని విద్యార్థి యువత అధ్యక్షుడు కొండల మారుతి

నవతెలంగాణ - మంథని : మంథని మండలం నాగారం గ్రామంలో సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ అధికారుల విలేజ్ స్టడీ టూర్‌లో భాగంగా 5వరోజు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద శ్రమదానం చేశారు. అనంతరం మంథని తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. ధరణి పోర్టల్ పనితీరు, పహాని, రైతుబంధు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల గురించి ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.గిరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంథని విద్యార్థి యువత, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు జాగ్రతి గోయల్, అనిష గౌహర్ ,రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయ సిబ్బంది సునంద, సీనియర్ సహాయకులు మానస, సీనియర్ సహాయకులు సీమానిక్కత్, కంప్యూటర్ ఆపరేటర్ తిరుమల, అంజలి గ్రామ రెవెన్యూ సహాయకులను స్వచ్ఛంద సేవా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి సన్మానించారు. కార్యక్రమంలో మంథని ఆర్‌డిఓ కె.వీరబ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి తూము రవీందర్, ట్రైనీ అధికారులు అభిషేక్ తివారి, సుజిత్ పధన్, లక్ష్మీనారాయణ వర్మ, ఎంపీడీవో బి.రమేష్, ఎంపీఓ ఆరీష్, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మజీద్‌కు జెడ్పీటీసీ పరామర్శ



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల సీనియర్ జర్నలిస్టు నవతెలంగాణ విలేఖరి ఎండి మజీద్‌ను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు గురువారం పరామర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మజీద్‌కు వైద్యులు ఎంజోగ్రామ్, టూ డీ కో, పలు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డిలు జెడ్పీటీసీ సభ్యులు చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి మజీద్‌ను పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడుకోవాలని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆయనకు సూచించారు.

నిజామాబాద్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



నవతెలంగాణ - కొనరావుపేట: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నిజామాబాద్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన ఈర్ల వంశీ(21) కడుపు నొప్పితో బాధపడుతూ గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపి వైద్యుడి దగ్గర చూపించుకుని మందులు తెచ్చుకున్నాడు. అనంతరం గంట తరువాత బాత్రూంకు వెళ్లి ఎంత సేపటికి బయటకి రాకపోవడంతో వంశీ తండ్రి తలుపు పగులగొట్టి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వంశీ గుండె పోటుతో గాని లేదా మరేదైనా కారణంతో గానీ చనిపోయి ఉండవచ్చని మృతుడి తండ్రి ఈర్ల సాయాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి



నవతెలంగాణ - జూలపల్లి : ఆయిల్ పామ్ సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి అన్నారు. జూలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన రైతు బొజ్జ నరసయ్యకు చెందిన రెండెకరాల భూమిలో గురువారం శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. ఆయిల్ పామ్ సాగు, మార్కెటింగ్, ప్రభుత్వ సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో ప్రత్యూష, ఏఈవో కిరణ్మయి, తిరుమల ఆయిల్ పామ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కళాంకర్, ఫీల్డ్ ఆఫీసర్ మహేష్, రైతులు గోపాలకృష్ణ, స్వామి, నరేష్ ఉన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీల తొలగింపుపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ - మంథని : మంథని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత పెట్రోల్ బంక్, బ్రిడ్జ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఏకపక్షంగా తొలగించి, అధికార పార్టీ ఫ్లెక్సీలు నెలలు తరబడి ఉంచడాన్ని ప్రశ్నిస్తూ గురువారం మంథని మున్సిపల్ కమిషనర్‌కు యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ కిషోర్‌రెడ్డి, ఆర్ల నాగరాజు ఫిర్యాదు చేశారు. తీసివేస్తే అన్ని ఫ్లెక్సీలను తీసివేయాలని, అలా కాకుండా కేవలం కాంగ్రెస్ పార్టీవి తీసేసి అధికార బీఆర్ఎస్ పార్టీవి ఉంచుతున్నారని ఆరోపించారు.

నగరంలో సమస్యలు పరిష్కరించాలి

రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు, వినతి అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ - గోదావరిఖని : నగరంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్, రాష్ట్ర సమితి సభ్యుడు గోషిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్ మాట్లాడారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో అనేక కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు డివిజన్లలోని సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 25వ డివిజన్ విట్టల్ నగర్ రైతు బజార్, చిల్డ్రన్స్ పార్కులో పనులు ప్రారంభించి 20 సంవత్సరాలైనా నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. దాదాపు 80 వేల గృహాలకు శుద్ధిచేసిన మంచినీటిని అందించడంలో కార్పొరేషన్ అధికారులు, పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. 28వ డివిజన్‌లో 2009లో శంకుస్థాపన చేసిన కళాభవనం పునాదులకే పరిమితమైందన్నారు. 15సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, మాటేటి శంకర్, మడ్డి ఎల్లాగౌడ్, కన్నం లక్ష్మీనారాయణ, పడాల కనకరాజు, శనిగరపు చంద్రశేఖర్, ఆశాల రమా, ఎంఏ గౌస్, రేణిగుంట్ల ప్రీతం, సిరిసిల్ల మల్లేష్, చిలుముల రాజయ్య, వై లెనిన్, తాళ్లపల్లి సురేందర్, వనపాకల విజయ్, శనిగరపు రాజ కొమురయ్య, తాని రాజబాబు, కలవల జగన్, పెరుమాండ్ల రమేష్, బూడిద మల్లేష్, గంగారపు చంద్రయ్య, ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ అర్బన్ మండలం అనుపురం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన వనపట్ల లచ్చిరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, ఎర్రం రవి, సతీష్, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

ఎదురుగట్లలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో సర్పంచ్ సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోయినేని లహరి, తదితరులు పాల్గొన్నారు.

కాలువ నీళ్లు రావడంపై రైతుల హర్షం

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - ఓదెల : ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో గురువారం డి86 కెనాల్ వద్ద ఉపసర్పంచ్ గట్టు మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి కాలువ నీళ్లు అందించినందుకు పెద్దపల్లి ఎమ్మెల్యేకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సదారెడ్డి, రాజుల కిషన్, యూత్ అధ్యక్షుడు బొమ్మక నరేష్, వార్డు సభ్యులు మర్రి కుమార్, గాధం శీను, చందర్‌రావు, సాగర్ల లింగన్న, అజయ్ పాల్గొన్నారు.

'టిబిజికెఎస్‌తో సింగరేణిలో రాజకీయ జోక్యం'

నవతెలంగాణ - గోదావరిఖని : టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా గెలిచిన నాటి నుండి సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జిడికె 1వ ఇంక్లయిన్‌లో గురువారం జరిగిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సు లేఖలతోనే సింగరేణిలో పాలన కొనసాగుతుందని, కొంతమంది అధికారులు ప్రభుత్వానికి పూర్తిగా తొత్తులుగా మారి వారికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల పక్షాన పోరాడే దేశంలోనే అత్యధిక మెంబర్షిప్ కల్గి, పటిష్టమైన నాయకత్వం కల్గిన ఐఎన్‌టియుసిని గెలిపించాలని కోరారు. ఆర్జీ 1 ఉపాధ్యక్షులు సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నరసింహరెడ్డి, ధర్మపురి, గుడేటీ శ్రీనివాస్, సాగర్, ఆంజనేయులు, చంద్ర రెడ్డి, సత్యనారాయణ, జనగామ రాజేశం, ప్రసాద్, కోటి, రమేష్, జన్ను మహేష్, తాటి రాజయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాయమ్మపల్లిలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం



నవతెలంగాణ - ఓదెల : ఓదెల మండలంలోని బాయమ్మపల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మంజూరైన సిసి రోడ్లను రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ రాజు యాదవ్, సర్పంచ్ తెల్సూరి కొమురయ్య యాదవ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తమ గ్రామానికి 17లక్షల నిధులు మంజూరుతో పాటు జీపి బిల్డింగ్‌కు 20 లక్షలు, అదేవిధంగా ఎస్‌డిఎఫ్ ద్వారా 10 లక్షలు మంజూరు చేయించినందుకు గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శారదసంపత్, వార్డు సభ్యులు కుక్కల మహేందర్ యాదవ్,మద్దూరి లతజగన్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు ఆలేటి స్వప్న శ్రీనివాస్‌రెడ్డి, ఆయాల కనకారావు,మద్దూరి శ్రీనివాస్ యాదవ్, సంఘం అధ్యక్షుడు గాలి రాజు యాదవ్, అంబాల సమ్మయ్య పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - ఓదెల : ఓదెల మండల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో గురువారం సైకాలజిస్ట్ కే.అనిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సుమారు 300మంది విద్యార్థులకు రానున్న పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, భయాన్ని వీడి విజయం ఎలా సాధించాలో అనే అంశంపై గైడెన్స్, వివరించారని ఎంఈఓ రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన



నవతెలంగాణ - గోదావరిఖని: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఏరియా ఆసుపత్రి డివైసిఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో ఆర్జీ 1 పరిధిలోని జిడికె 2వ గనిపై ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.సుమన్ మూత్రపిండాల పనితీరు, కిడ్నీ వ్యాధుల లక్షణాలు, వాటి ఆరోగ్య సంరక్షణ, నివారణ చర్యలు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గని మెనేజర్ రామస్వామి, అధికారులు వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, పి.మాధవరెడ్డి, డి.గణేష్, డి.నర్సయ్య, ఎండి.సల్మాన్, కార్మికులున్నారు.

స్వరాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం

సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



నవతెలంగాణ - కొనరావుపేట : తెలంగాణ స్వరాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కానుకగా వడ్డీ రాయితీకి నిధులు మంజూరు చేసిన రాయితీ కాపీలను మహిళా సంఘాలకు అందచేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అలాగే మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ పోకల రేఖసంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై ఆరోపణలు మానుకోవాలి'



నవతెలంగాణ - ఓదెల : ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని ప్రెస్ క్లబ్ ఓదెలలో టిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పని సుదర్శన్ మాట్లాడుతూ ఇటీవల రామగుండం పారిశ్రామిక ప్రాంతాల్లో ఎన్టిపిసి బూడిద అక్రమ రవాణాపై వార్త పత్రికలో మంగళవారం వార్త కథనాన్ని ప్రచురించారు. ఈ వార్త కథనాన్ని రాసిన గోదావరిఖని వార్త పత్రిక విలేకరి నాయిని మదనయ్యకు అక్రమార్కులు ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అని ఖండించారు. మీకు ఎన్టిపిసి బూడిద రవాణాపై పర్మిషన్ ఉంటే సమాచారాన్ని విలేకరుల సమావేశం నిర్వహించి బూడిద తరలించడానికి అన్ని పర్మిషన్లు ఉన్నాయని ఎందుకు చూపించడం లేదన్నారు. అది అక్రమ రవాణా కాకుంటే రాసిన విలేకరికి ఫోన్ చేసి బెదిరించడం ఏమిటని, వాస్తవ కథనాలు రాసే విలేకర్లపై ఆరోపణలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకు శంకరయ్య మాట్లాడుతూ జర్నలిస్టులపై ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేసిన, దాడులు చేసిన ఊరుకోబోమని హెచ్చరించారు. ఓదెల ప్రెస్‌క్లబ్ కార్యదర్శి వంగ మహేష్, సభ్యుడు రాచర్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్, కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ - గోదావరిఖని : మార్చి 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆత్మ గౌరవ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఫోరం రామగుండం నియోజకవర్గం అధ్యక్షుడు, కన్వీనర్ పిడుగు కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీల నాయకులతో, ట్రేడ్ యూనియన్ నాయకులతో, బార్ అసోసియేషన్ మెంబర్స్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఆవిష్కరించిన వారిలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రాల శైలజ, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, జెడ్పిటిసి కందుల సంధ్యారాణి, బిజెపి నాయకులు కాసిపేట లింగయ్య, బిజెపి నాయకులు కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కౌశిక హరి, బిఆర్ఎస్ సీనియర్ నేతలు నడిపెల్లి మురళీధర్ రావు, గుంపుల ఓదెలు యాదవ్, కార్పొరేటర్ దుబాసి లలిత మల్లేశంతో కలిసి వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాడ నారాయణరెడ్డి, నూనె రాజేశం, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కవితను బీజేపీ ఇబ్బందులకు గురిచేస్తోంది

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



నవతెలంగాణ - మంథని : భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కావాలనే ఇబ్బందులకు గురి చేస్తోందని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితకు మంథని నియోజకవర్గం తరపున పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టాక బీజేపీలో భయం మొదలైనదన్నారు. తమకు అడ్డువచ్చిన వాళ్లను ఈడీ, సిబిఐ పేర్లతో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు హర్షిణిరాకేష్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ప్యాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మహా లింగేశ్వర రైస్‌మిల్ ప్రారంభం



నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మహా లింగేశ్వర ఇండస్ట్రీస్ (రైస్ మిల్)ను గురువారం సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏష వాణితిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ ఆకుల దేవరాజం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సర్పంచ్ జంకే విజయశ్రీనివాస్, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, అల్లాడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాచాపూర్ 400 కేవీ సబ్ స్టేషన్ రోడ్డును పరిశీలించిన ఆర్డీఓ



నవతెలంగాణ - జూలపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన 400 కేవీ సబ్ స్టేషన్‌కు సంబంధించిన రోడ్డును పెద్దపల్లి ఆర్డీఓ వెంకటమాధవరావు గురువారం పరిశీలించారు. రోడ్డుకు సంబంధించిన భూముల వివరాలను తహసీల్దార్ జయశ్రీని, రైతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ సంపత్, కరెంట్ ఏడీఈ భూమయ్య ఉన్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

గత ఎన్నికల్లో జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు పూదరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు స్వర్ణయుగం ప్రారంభమైనట్లేనని ప్రగల్భాలు పలికిన కెసిఆర్ హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు, నివాస స్థలాలు, ఆరోగ్య బీమా, జిల్లాకో జర్నలిస్టు కాలనీ, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక చేయూత వంటి తదితర హామీలను ఇచ్చిన కెసిఆర్, ఒక్కటి అమలు చేయడం లేదని విమర్శించారు.

రాజన్నను దర్శించుకున్న ఏఎస్పీ చంద్రయ్య



నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట ప్రోటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఎస్సై వెంకట్రాజం, తదితరులు ఉన్నారు.

కాలువ నీరు వృథా..

ఆయకట్టు రైతుల ఆందోళన


కుడికాలువ నుండి వృథాగా పోతున్న నీరు

నవతెలంగాణ - కొనరావుపేట : మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. కుడి కాలువ తూము నుండి భారీగా నీరు వృథాగా పోతుంది. దీంతో 2500 ఎకరాలు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ గేట్లు బిగుసుకుపోయి నీరు పోతుండడంతో వేసిన పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - ధర్మారం : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం స్థానిక ఎస్సై ఎం.శ్రీనివాస్, ఆర్టీసీ కరీంనగర్-2 డిపో మేనేజర్ వి.మల్లయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలగందుల అశోక్, సెక్రటరీ ఇప్ప మల్లేష్, ట్రెజరర్ దాడి భూమన్న, పీఆర్ఓ నాడెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ - కొనరావుపేట

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ అరుణారాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ భారతిబాపురెడ్డి, పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపిటిసి లక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీ.2 లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం



నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ : సింగరేణి ఆర్జీ-2 ఏరియా సేవా సమితి భవన్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఆరోగ్య అధికారి పద్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించిన సివిల్ సర్వీసెస్ అధికారులు

నవతెలంగాణ - వేములవాడ రూరల్


రైతులతో శిక్షణ అధికారులు

వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి రైతు వేదికలో గురువారం శిక్షణలో ఉన్న అఖిల భారత సివిల్ సర్వీస్ అధికారులు రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం, జడ్పీటిసి ఏషా వాణి, మర్రిపల్లి,నాగయ్య పల్లి, బాలరాజుపల్లి గ్రామాల సర్పంచులు, ఎంపీడీఓ రామ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, ఏఈవో అనూష, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పట్టాదారులకు 'రైతుబంధు' బ్రేక్

ఖాతాల్లో జమగాని డబ్బులు
పెద్దపల్లి జిల్లాలో 4,360 మంది ఎదురుచూపు
వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షణలు

నవతెలంగాణ - పెద్దపల్లి

కొత్తగా భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకొని రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుండి డబ్బులు జమ చేయడంలో బ్రేకు పడింది. రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ కావడం లేదు. ఈ విధంగా పెద్దపల్లి జిల్లాలో 4,360 మంది పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్న రైతులు ఉన్నారు. వారంతా రైతుబంధు కోసం గత నెలలో దరఖాస్తులు చేసుకున్నారు. రైతుబంధులో డబ్బులు జమ కాకపోవడం వల్ల వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరగవలసిన పరిస్థితి వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకంలో భాగంగా సీజనల్ వారీగా రెండుసార్లు పంటల సాగుకు పెట్టుబడి నిమిత్తం ఎకరానికి పదివేల చొప్పున డబ్బులు వారి ఖాతాలో జమచేస్తూ వస్తుంది. అందులో భాగంగా 2022 వానాకాలం సీజన్‌లో ఇప్పటికే రైతుబంధు డబ్బులు జమకగా 2022-23 ఎండాకాలం పంట పెట్టుబడి సాయం కింద గత ఏడాది డిసెంబరు 28 నుండి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తూ వస్తుంది. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో ఎండాకాలం పంటల సాగుకు సంబంధించిన లక్షా 40వేలా 59 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వారికి రూ.133కోట్లా 95లక్షలా 47వేలా 656 డబ్బులు జమ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఒక లక్షా 38వేలా 831మంది రైతులకు రూ.129కోట్లా 82లక్షలా 82వేలా 250 డబ్బులు రైతుల ఖాతాలో జమచేశారు. 1,228 మంది రైతులకు 4కోట్లా 13లక్షల డబ్బులు రావాల్సి ఉంది.

కాగా ఈ ఎండాకాలం సీజన్ సంబంధించి ఇటీవల కొత్తగా భూములకు పట్టాలు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారికి రైతుబంధు డబ్బులు జమ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు కరువైనట్లుగా సమాచారం. దీనివల్ల కొత్తగా పట్టాలు పొంది రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు వారి ఖాతల్లో డబ్బులు జమ కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెద్దపల్లి జిల్లాలో 4,360 మంది కొత్త పట్టాదారులు

ఎండాకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు పథకంలో భాగంగా కొత్తగా పట్టా పొందిన రైతులు కూడా రైతు బంధు పథకం కోసం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్లో ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా డిసెంబరు 26 నుండి ఈ ఏడాది జనవరి 7 వరకు దరఖాస్తులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్వీకరించి రైతుబంధు డబ్బుల కోసం ఎంట్రీ చేశారు. అయితే ఈ విధంగా పెద్దపల్లి జిల్లాలో 4,360 మంది కొత్తగా పట్టా పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారందరికీ ఎండాకాలం పంటల సాగు కోసం పెట్టుబడి నిమిత్తం రైతుబంధు డబ్బులు జమ కావాల్సి ఉంది. కానీ రెగ్యులర్‌గా రైతుబంధు డబ్బులు తీసుకుంటున్న రైతులకు డబ్బులు తమ ఖాతాలో జమ అవుతున్నా కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు డబ్బులు జమ కావడం లేదు. దీనివల్ల తమ డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడం పై కొత్తగా పట్టా పొందిన రైతులు బ్యాంకర్ల చుట్టూ, వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొత్తగా పట్టాలు పొందిన రైతుల దరఖాస్తులను రైతుబంధు కోసం ఎంట్రీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం నుండే వారి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని, ఈ సమస్య ఎటువంటి సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వమే దాని గురించి చూసుకుంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

డబ్బులు వచ్చే అవకాశం లేదు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి

కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు రైతుబంధు డబ్బుల కోసం కొత్తగా ఎంట్రీ చేసుకున్నప్పటికీ వారికి డబ్బులు వచ్చే అవకాశం లేకుండా ఉంది. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల ఖాతాలను రెవెన్యూ పట్టా ప్రకారం ఎంట్రీ చేసి పంపించాం. కానీ వారి ఖాతాలు లో డబ్బులు జమ అయినా వివరాలు లాగిన్‌లో కనిపించడం లేదు. ఈసారికి కొత్త రైతులకు రైతుబంధు డబ్బులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. అదేవిధంగా ఇప్పటివరకు రెగ్యులర్ రెగ్యులర్ పాత రైతుబంధు సంబంధించిన రైతులకు పెండింగ్‌లో ఉన్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది.

డబ్బులు పూర్తిగా అందజేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంట సాగు కోసం పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు పథకం కింద డబ్బులు ఇస్తామని చెప్పింది. కానీ కొంతమంది రైతులకు మాత్రమే డబ్బులు పంపిణీ చేసి మిగతా వారందరికీ గత రెండు నెలలుగా పెండింగ్ పెట్టింది. దీంతోపాటు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తిగా డబ్బులు ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న రైతుబంధు పథకం కింద డబ్బులను రైతులకు అందజేయాలి.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

4 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ట్రాలీ స్వాధీనం
వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ




వివరాలు వెల్లడిస్తున్న సీపీ

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు వివరాలను సీపీ వెల్లడించారు. వరుస దొంగతనాలకు పాల్పడ్డ సిసిసి నస్పూర్ షిర్కే కాలనీకి చెందిన రాజవరపు వెంకటేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సిసిసి నస్పూర్ ఎస్ఐ బి.రవి కుమార్ గురువారం ఉదయం తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాయల్ టాకీస్ చౌరస్తా వద్ద అనుమానాస్పద స్థితిలో ద్విచక్రవాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించిన వెంకటేష్‌ను పట్టుకొని విచారించగా దొంగతనాలను ఒప్పుకున్నట్లు సీపీ వెల్లడించారు. వెంకటేష్ నెల్లూరు నివాసి కాగా, కొన్ని సంవత్సరముల కిందట శ్రీరాంపూర్ చెందిన ఒక అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకొని ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. 2019లో మొదటి చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. నిందితుడు మద్యానికి బానిసగా మారి, ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతూ చెడు వ్యసనాలకి అలవాటు పడి తన విలాసవంతమైన జల్సాల ఖర్చులను కోసం అతను దొంగతనాలను చేయడంకి అలవాటు పడ్డాడని తెలిపారు. ఇతనిపై నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7, లక్సెట్టిపేటలో 6, చెన్నూరులో 7, మందమర్రిలో 11, రామక్రిష్టాపూర్‌లో 17, కాసిపేటలో 2, శ్రీరాంపూర్‌లో 1, మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో 5, గోదావరిఖని వన్‌టౌన్‌లో 14, బీమారం పోలీస్ స్టేషన్‌లో 2 దొంగ తనాలు చేశాడని తెలిపారు. 72 కేసులలో దొంగిలించిన సొత్తు 2.89 కిలోల గోల్డ్, 4.07 కిలోల సిల్వర్, 19లక్షల రూపాయల నగదు, వాటి మొత్తంలో విలువ రూ.కోటీ 20లక్షలు ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు అతని వద్ద నుంచి 4 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ట్రాలీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో, నేర పరిశోధనలో సహకరించి చాకచక్యంగా వ్యవహరించి మంచిర్యాల డిసిపి సుధీర్ కేకన్ రామ్‌నాథ్, ఎసిపి బి.తిరుపతి రెడ్డి, మంచిర్యాల రూరల్ సిఐ టి.సంజీవ్, నస్పూర్ సిసిసి ఎస్ఐ బి.రవికుమార్. సిబ్బంది ఆమె అభినందించారు.

చిన్నారి ఆపరేషన్‌కు మంత్రి కేటీఆర్ బాసటా

రూ.పది లక్షల ఖర్చులు మొత్తం భరిస్తానని హామీ
మంత్రికి సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట


సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న చిన్నారి

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది.. ఆ దంపతులకు పుట్టిన పాప కొద్ది రోజులకు మూగ, చెవుడని తెలియగానే నిరాశకు గురయ్యారు. పాపకు ఆపరేషన్ చేయించి నయం చేయడానికి పలు ఆసుపత్రులకు చెప్పులు అరిగేలా తిరిగారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రంజాన్ మేఘన నర్సయ్య దంపతుల ఆవేదన ఇది. చికిత్స కోసం అపోలో హాస్పిటల్ వైద్యులను సంప్రదించారు. పాపకు ఆపరేషన్ చేస్తే చెవుడు, గొంతు వస్తాయని.. పది లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలుపగా గత ఆరు, ఏడు సంవత్సరాల నుండి ఈ పాప పరిస్థితి చూసుకుంటూ దు:ఖంతో కృంగిపోతున్న తల్లిదండ్రులు ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన నేవూరి వెంకట్‌రెడ్డి ఆ పాప పరిస్థితిని తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆ పాప ఆపరేషన్‌కు అయ్యే పది లక్షల రూపాయలు మొత్తం ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆపరేషన్ చేయించడానికి ఏర్పాట్లు చేపిస్తున్నట్లు సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి తెలిపారు. పాప పరిస్థితి ఎంతో మందికి తెలియచెప్పినప్పటికి ఎవరు స్పందిచలేదన్నారు. ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఐటిశాఖ మంత్రి కేటీఆర్ స్పందించినందుకు వారికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆ పాప తల్లిదండ్రులు తెలిపారు.

ఆరోగ్యంపై మహిళా పారిశుధ్య కార్మికులు శ్రద్ధ వహించాలి : రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - గోదావరిఖని

మహిళా పారిశుధ్య కార్మికులు పనితో పాటు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మహిళా వారోత్సవాలు పురస్కరించుకొని గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు, ఊరు సౌభాగ్యంగా ఉంటుందని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసిఆర్, మునిసిపల్ శాఖామంత్రి కెటిఆర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య మహిళ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ మహిళా పారిశుధ్య కార్మికులు ప్రతి నెలా ఒక రోజు వైద్య పరీక్షలకే కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ బి.సుమన్‌రావు, సూపరింటెండెంట్ మనోహర్, నాయకులు తానిపర్తి గోపాల్‌రావు, తిరుపతి, గణేష్, సలీం, మునిసిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు నడిపల్లి మురళీధర్ రావు, యాకయ్య, రూప, సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికులందరికీ శాలువాకప్పి సత్కరించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలోనే మెప్మా ఆర్‌పిలతో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మెప్మా డిఎంసి రజనీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఊర్మిళ, స్వరూప, స్వప్న, కవిత పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్నం చేయాలని చూస్తే సింగరేణి వ్యాప్తంగా విస్తరిస్తాం

ఓబి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు


నాయకులతో మాట్లాడుతున్న జిఎం


ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - గోదావరిఖని

వేతనాలు పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి రామగుండం రీజియన్‌లోని ఓబి కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె 4వ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె విచ్ఛిన్నం చేయాలని చూస్తే సింగరేణి వ్యాప్తంగా విస్తరిస్తామని ఓబి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ పార్క్ నుంచి జిఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ర్యాలీకి ముందు పోలీసులతో వాదనలు జరిగాయి. రాస్తారోకోకు బయలుదేరిన నాయకులతో పోలీసు అధికారులు చర్చించారు. దీంతో జిఎం కార్యాలయం ముందు ధర్నాకు వెళ్లారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కౌశిక్ హరి, బుర్ర తిరుపతి, వేల్పుల కుమారస్వామి, పూసాల తిరుపతి, ఏ.వెంకన్న, తోకల రమేష్, మద్దెల శ్రీనివాస్, కట్ట విశ్వనాథ్ పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం, ఓబీ కాంట్రాక్టర్లు కలిసి కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. చట్టప్రకారం వేతనాలకై ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఎన్ని రోజులైనా సమ్మె కొనసాగుతుందని, యాజమాన్యాలు దిగివచ్చేదాకా పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఆర్జీ 1 జిఎం కల్వల నారాయణ ధర్నా ప్రాంతానికి వచ్చి సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతున్నామని, సమస్య పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ఉన్నామని కార్మికుల ప్రశాంతంగా ఉండాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికన 'మన ఊరు - మన బడి' పూర్తిచేయాలి

సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి
ఎల్లారెడ్డిపేట మండలంలో పరిశీలన

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, దుమాల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించి మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంకటాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఈజీఎస్, మన ఊరు - మన బడి నిధులు 13లక్షల 37వేల రూపాయలతో చేపడుతున్న కిచెన్ షెడ్, టాయిలెట్లు, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఈజీఎస్, మన ఊరు - మన బడి నిధులు 33లక్షల 50వేల రూపాయలతో చేపడుతున్న కంపౌండ్‌వాల్, డైనింగ్ హాల్, ఎలక్ట్రీకల్ పనులు, ఫ్లోరింగ్, టాయిలెట్లు, ఇతర అభివృద్ధి పనుల నిర్మాణాల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం దుమాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఈజీఎస్, మన ఊరు - మన బడి నిధులు 21లక్షలా 62వేల రూపాయలతో చేపడుతున్న కంపౌండ్‌వాల్, టాయిలెట్లు, కిచెన్ షెడ్, పెయింటింగ్, ఎలక్ట్రీకల్ పనుల తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులతో ముచ్చటించి, మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం దుమాల గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపును జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పకడ్బందీగా, ఎలాంటి తప్పులు జరుగకుండా చేయాలని ఆదేశించారు. అద్దాలు పంపిణీ చేసే సమయంలో యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి వీలుగా ఫొటోలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం దుమాల గ్రామంలోని ఇంకుడు గుంతలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. డ్రైనేజి ఎండ్ పాయింట్‌ను పరిశీలించారు. గ్రామంలోని నర్సరీలో నాటిన మొక్కలన్నీ సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా వైద్యధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, ఎంపిడివో చిరంజీవి, ఎంఈవో రఘుపతి పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సీనియర్ పాత్రికేయుడికి ఆర్థిక సాయం అందించిన చల్లా

నవతెలంగాణ - రామగిరి



ఆర్థిక సాయం అందిస్తున్న చల్ల నారాయణరెడ్డి

నవతెలంగాణ దినపత్రిక మంథని సీనియర్ పాత్రికేయుడు ఆర్ల బాపును కాటారం పిఎసిఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆర్ల బాపు ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో స్టంట్ వేయించుకున్నారు. ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న చల్లా నారాయణరెడ్డి ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. మంథని నియోజకవర్గంలోని ప్రజలైన, పాత్రికేయులైన ఆపదలో ఉంటే ఆదుకుంటానని, అదేవిధంగా కెసిఆర్, కేటీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గం మొత్తం సేవ చేసే అదృష్టం కలుగుతుందని అన్నారు. ఆర్ల బాపును పరామర్శించి సరైన సమయంలో మందులు వాడాలని, అదేవిధంగా చికిత్సకు మరే విధమైన అవసరమైనా తన సహకారం ఉంటుందని ఆయన అన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

నవతెలంగాణ - గోదావరిఖని : రామగుండం 37వ డివిజన్ సంతోష్‌నగర్‌కి చెందిన నాగమణి అనే నిరుపేద యువతి వివాహానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విజయమ్మ ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే తల్లిదండ్రులు లక్ష్మి మల్లయ్య చేతుల మీదుగా పుస్తె, మెట్టెలను గురువారం వారి నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో విజయమ్మ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, సెక్రటరీ సిద్ధు తదితరులున్నారు.

మహిళా కాంట్రాక్టు కార్మికులకు చీరలు పంపిణీ



నవతెలంగాణ - గోదావరిఖని : సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చీరలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నాయకుడు పల్లె రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాని ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోలేటి శ్రీను హాజరై అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు శ్రీనివాస్, సురేష్ తదితరులున్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన నాయకులు



నవ తెలంగాణ- వేములవాడ : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నేతృత్వంలో నాయకలు తరలివెళ్లారు. వేములవాడ పట్టణం, అర్బన్, రూరల్ మండలాల నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వెళ్లారు.

ప్రతీ మహిళా తమను తాము నిరూపించుకోవాలి

లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్య

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం



స్త్రీ తలుచుకుంటే సాధించలేదని ఏదీ లేదని, నేటి సమాజంలో ప్రతి ఒక్క మహిళ తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్యఅరుణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సొమారపు లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు, నిరంతరం కష్టపడే మహిళలకు సరదాగా కాసేపు ఆటవిడుపు కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తుందని సూర్యదేవర జ్యోతి, సునీత, సంతోషరెడ్డి, పద్మ, బాసాని రూపీనికి సుష్మా స్వరాజ్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దుబాసి లలిత, శ్వేత, రజిత, భవాని, భారతి, విమలత, డాక్టర్ సంక్షేమ, పద్మ అనిత, కళ్యాణి, సుష్మ, స్వరూప, సంధ్యారాణి, అర్చన తదితరులున్నారు.

గర్భిణులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - జూలపల్లి

ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారికి పౌష్టికాహారం రక్తహీనత, సాధారణ ప్రసవాలు, ప్రాధాన్యత, వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పించారు. జన ఔషధ దివస్‌లో భాగంగా బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్‌రెడ్డి, సిహెచ్‌ఓ కలీముద్దీన్, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, స్టాఫ్ నర్స్, హెల్త్ అసిస్టెంట్ అనంతరావు, ఫార్మసిస్ట్ రమేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

నవతెలంగాణ - గోదావరిఖని

కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి నిరంజన్ గురువారం పరామర్శించారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోదరుడు శైలేందర్ సింగ్ ఇటీవల మృతి చెందగా, ఆయన చిత్ర పటానికి నిరంజన్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనవెంట కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, దూళికట్ట సతీష్, దాసరి విజయ్, తదితరులున్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ - గోదావరిఖని



రామగుండం కార్పొరేషన్ 48వ డివిజన్‌లో శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పొన్నం విద్యలక్ష్మణ్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. దంత సమస్యలతో బాధ పడుతున్న వారికి ఈ సందర్భంగా డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఖవాజ శతకం

- తొలి రోజు ఆసీస్‌దే ఆధిపత్యం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 255/4

ఆసీస్, భారత్ నాల్గో టెస్టు తొలి రోజు

ఎట్టకేలకు అందివచ్చిన ఫ్లాట్ వికెట్‌పై కంగారూలు కంగారు లేకుండా పరుగులు పిండుకున్నారు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 255/4తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ (104 బ్యాటింగ్) అజేయ శతకంతో కదం తొక్కగా.. కామెరూన్ గ్రీన్ (49 బ్యాటింగ్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మహ్మద్ షమి (2/65) రెండు వికెట్లకు తోడు అశ్విన్, జడేజా మాయ చేసినా.. తొలి రోజు ఆస్ట్రేలియా ఆధిపత్యం కనిపించింది.

నవతెలంగాణ-అహ్మదాబాద్


సహనం ఫలించె : శతక బాదిన ఉస్మాన్ ఖవాజ (104 నాటౌట్)

భారత్‌లో రెండు పర్యటనలు. ఎనిమిది టెస్టుల్లో బెంచ్‌కు పరిమితమై డ్రింక్స్ మోసుకెళ్లిన ఉస్మాన్ ఖవాజ.. చివరగా అందివచ్చిన అవకాశాన్ని రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. భారత్‌పై అహ్మదాబాద్ టెస్టులో అజేయ శతకంతో చెలరేగాడు. బౌలర్లపై ఎదురుదాడి చేయాలనే ఈగోను దూరం పెట్టిన ఖవాజ (104 బ్యాటింగ్, 251 బంతుల్లో 15 ఫోర్లు) సంప్రదాయ ఇన్నింగ్స్‌తో సెంచరీ కొట్టాడు. కామెరూన్ గ్రీన్ (49 నాటౌట్, 64 బంతుల్లో 8 ఫోర్లు), ట్రావిశ్ హెడ్ (32), స్టీవ్ స్మిత్ (38) సైతం రాణించటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 255/4తో భారీ స్కోరు దిశగా సాగుతోంది. భారత బౌలర్లలో మహ్మద్ షమి (2/65) రాణించాడు. ఐదో వికెట్‌కు 19.2 ఓవర్లలో 85 పరుగులు జోడించిన ఖవాజ, కామెరూన్ జోడీ.. చివరి సెషన్లో ఆసీస్ పరం చేసింది!.

తొలి సెషన్ : ఆసీస్ ఓపెనర్ల మెరుపులు

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. సిరీస్‌లో టాస్ నెగ్గిన జట్టు మ్యాచ్ నెగ్గిన సంప్రదాయం లేదు. అయినా, ఆసీస్ తొలుత బ్యాటింగ్‌కు మొగ్గుచూపించింది. ఓపెనర్లు ట్రావిశ్ హెడ్ (32, 44 బంతుల్లో 7 ఫోర్లు), ఉస్మాన్ ఖవాజ (00) తొలి వికెట్‌కు శుభారంభం అందించారు. ఇండోర్ ఊపులో ఉన్న ట్రావిశ్ హెడ్.. ఆరంభం నుంచీ దూకుడుగా ఆడేందుకు మొగ్గు చూపాడు. మరో ఎండ్‌లో ఉస్మాన్ ఖవాజ ఎంతో సహనంగా బ్యాటింగ్ చేశాడు. ఏడు ఫోర్లతో మెరిసిన ట్రావిశ్ హెడ్..తొలి గంట ఆసీస్ పరం చేశాడు. ఓపెనర్లు రాణించటంతో డ్రింక్స్ విరామానికి ఆస్ట్రేలియా 56/0తో మంచి స్థితిలో నిలిచింది. కొత్త బంతితో 14 ఓవర్లు సంధించినా భారత్‌కు వికెట్ బ్రేక్ లభించలేదు. విరామం అనంతరం భారత్ రేసులోకి వచ్చింది. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ వలలో చిక్కుకున్న ట్రావిశ్ హెడ్.. పెవిలియన్‌కు చేరుకున్నాడు. తక్కువ ఎత్తులో వచ్చిన క్యాచ్‌ను ఒడిసిపట్టుకున్న జడేజా.. ఆసీస్ ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఫామ్‌లో ఉన్న నం.3 బ్యాటర్ మార్నస్ లబుషేన్ (3) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. అద్భుతమైన బంతితో దూసుకొచ్చిన మహ్మద్ షమి.. లబుషేన్ వికెట్‌ను గాల్లో గిరాటేశాడు. ఆఫ్ సైడ్ పడిన బంతి సీమ్ ప్రభావంతో లబుషేన్ బ్యాట్, ప్యాడ్ మధ్య గ్యాప్‌లోకి దూసుకెళ్లి లెగ్ వికెట్‌ను గిరాటేసింది. రెండు వరుస వికెట్లతో మ్యాచ్ మళ్లీ సమతూకంలోకి వచ్చింది. లంచ్ విరామానికి ఆస్ట్రేలియా 75/2తో నిలిచింది. ఓపెనర్ ఖవాజ, కెప్టెన్ స్మిత్ క్రీజులో నిలిచారు. ఈ సెషన్‌లో ఆస్ట్రేలియా రెండు వికెట్లు కోల్పోయి 29 ఓవర్లలో 75 పరుగులు చేసింది.

రెండో సెషన్ : ఖవాజ, స్మిత్ అడ్డుగోడ

లంచ్ విరామం అనంతరం భారత్ మరింత ఉత్సాహంగా వికెట్ల వేట సాగిస్తుందని అనుకుంటే.. పరిస్థితి పూర్తి భిన్నంగా సాగింది. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజతో కలిసి కెప్టెన్ స్టీవ్ స్మిత్ (38, 135 బంతుల్లో 3 ఫోర్లు) భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచాడు. క్రీజులో నిలబడి వికెట్లకు అడ్డుగోడ కట్టిన స్మిత్.. ఖవాజకు గొప్ప సహకారం అందించాడు. స్మిత్ బౌలర్లను విసిగించగా ఖవాజ తెలివిగా పరుగులు రాబట్టాడు. రెండో సెషన్ డ్రింక్స్ విరామ సమయానికి ఆసీస్ 110/2తో మెరుగ్గా నిలిచింది. ఆ తర్వాత సైతం స్మిత్, ఖవాజ డిఫెన్స్‌ను భారత బౌలర్లు ఛేదించలేదు. 9 ఫోర్ల సాయంతో 146 బంతుల్లో 50 పరుగులు పూర్తి చేసిన ఖవాజ ఆస్ట్రేలియా శిబిరంలో ఆత్మవిశ్వాసం నింపాడు. ఖవాజ, స్మిత్ జోడీ మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించింది. రెండో సెషన్‌లో భారత్‌కు వికెట్ నిరాకరించిన ఈ జోడీ.. ఆసీస్‌ను భారీ స్కోరు దిశగా నడిపించింది. టీ విరామ సమయానికి ఆస్ట్రేలియా 149/2తో పటిష్టంగా కనిపించింది. ఈ సెషన్‌లో ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 33 ఓవర్లలో 74 పరుగులు చేసింది.

మూడో సెషన్ :

తొలి రోజు ఆట భారత్ చేజారుతున్న తరుణంలో టీమ్ ఇండియా పుంజుకుంది. మూడో సెషన్ ఆరంభంలోనే రెండు వికెట్లు నేలకూల్చింది. స్టీవ్ స్మిత్ ఆత్మవిశ్వాసంతో ఆడుతుండగా.. రవీంద్ర జడేజా ఓ సాధారణ బంతితో అతడికి కథకు ముగింపు పలికాడు. ఫోర్త్ వికెట్ దిశగా వెళ్తోన్న బంతిని అడ్డంగా ఆడేందుకు ప్రయత్నించిన స్మిత్ బంతిని ప్యాడ్‌పైకి ఆడుకున్నాడు. ఫలితంగా బంతి వికెట్లను ముద్దాడింది. దీంతో స్మీవ్ స్మిత్ ఇన్నింగ్స్ అనూహ్యంగా ముగిసింది. పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (17, 27 బంతుల్లో 3 ఫోర్లు)ను మహ్మద్ షమి మ్యాజిక్ బాల్‌తో సాగనంపాడు. లెగ్ సైడ్ ప్రణాళికతో ఆడుతున్న పీటర్ హ్యాండ్స్‌కాంబ్ డిఫెన్స్‌ను మహ్మద్ షమి ఛేదించాడు. అతడి వికెట్లను కూల్చేశాడు. దీంతో 170 పరుగుల వద్ద ఆస్ట్రేలియా నాల్గో వికెట్ కోల్పోయింది.


లబుషేన్ వికెట్ తీసిన ఆనందంలో షమి

తొలి రోజు ఆట చివరి 15 ఓవర్లలో ఆస్ట్రేలియా పట్టు సాధించింది. డ్రింక్స్ విరామం అనంతరం భారత బౌలర్లు వికెట్ల వేటలో విఫలమయ్యారు. ఇదే సమయంలో కామెరూన్ గ్రీన్, ఉస్మాన్ ఖవాజ పరుగుల వరద పారించారు. కామెరూన్ గ్రీన్ దూకుడుబు బౌండరీలు రాబట్టగా.. ఖవాజ క్లాస్ షో కొనసాగించాడు. షమి వేసిన తొలి రోజు ఆఖరు ఓవర్లో బౌండరీ బాదిన ఖవాజ.. 246 బంతుల్లో శతకం సాధించాడు. సిరీస్‌లో ఆసీస్ తరఫున నమోదైన ఏకైక సెంచరీ ఇన్నింగ్స్ ఇదే కావటం విశేషం. చివరి సెషన్లో 2 వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 28 ఓవర్లలోనే 106 పరుగులు పిండుకుంది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : ట్రావిశ్ హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32, ఉస్మాన్ ఖవాజ బ్యాటింగ్ 104, మార్నస్ లబుషేన్ (బి) షమి 3, స్టీవ్ స్మిత్ (బి) జడేజా 38, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (బి) షమి 17, కామెరూన్ గ్రీన్ బ్యాటింగ్ 49, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (90 ఓవర్లలో 4 వికెట్లకు) 255.**

వికెట్ల పతనం : 1-61, 2-72, 3-151 , 4-170,

బౌలింగ్ : మహ్మద్ షమి 17-2-65-2, ఉమేశ్ యాదవ్ 15-2-58-0, రవిచంద్రన్ అశ్విన్ 25-8-57-1, రవీంద్ర జడేజా 20-2-49-1, అక్షర్ పటేల్ 12-4-14-0, శ్రేయస్ అయ్యర్ 1-0-2-0.


భారత్, ఆసీస్ జట్ల కెప్టెన్లతో ఇరు దేశాల ప్రధాన మంత్రులు

75 వసంతాల మైత్రీ సంబురం

భారత్, ఆస్ట్రేలియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్టుకు ఇరు దేశాల ప్రధానమంత్రులు హాజరయ్యారు. భారత ప్రధాని నరెంద్ర మోడీ, ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంటోని ఆల్బనిస్‌లు అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో సందడి చేశారు. భారత్, ఆస్ట్రేలియా క్రికెట్ స్నేహ బంధానికి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా.. 75 ఏండ్ల క్రికెట్ మైత్రిని ఇద్దరు ప్రధానులు సెలబ్రేట్ చేశారు. బాహుబలి స్టేడియంలో ల్యాప్ ఆఫ్ హానర్ తీసుకున్న మోడీ, ఆంటోనిలు.. టాస్‌కు ముందు ఇరు జట్ల కెప్టెన్లను క్యాప్‌లు అందజేశారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మకు ప్రధాని మోడీ టోపీ అందివ్వగా.. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు ఆ దేశ ప్రధాని ఆంటోని బ్యాగీ గ్రీన్ టోపీ అందించారు. అనంతరం ఇరువురు ప్రధానులు ఇరు జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. భారత్, ఆస్ట్రేలియా ప్రధాన మంత్రుల రాకతో నాల్గో టెస్టు మ్యాచ్ టాస్ కాస్త ఆలస్యమైంది. గ్రామీ అవార్డు గ్రహీత ఇండో అమెరికన్ గాయకుడు ఫాల్గుణి షా పలు పాపులర్ గీతాలను ఆలపించగా, స్థానిక కళాకారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనిని సత్కరించగా, భారత ప్రధాన మంత్రి నరెంద్ర మోడిని బీసీసీఐ కార్యదర్శి, కేంద్ర మంత్రి అమిత్ షా కుమారుడు జై షా సన్మానించారు. కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, గుజరాత్ క్రికెట్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తొలి సెమీస్ డ్రా

- హైదరాబాద్ 0, ఎటికె మోహన్ బగాన్ 0
- ఇండియన్ సూపర్ లీగ్ 2023



నవతెలంగాణ, హైదరాబాద్ : ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 2023 రెండో సెమీఫైనల్ తొలి అంచె పోరు డ్రాగా ముగిసింది. డిఫెన్స్‌లో అగ్ర జట్లు హైదరాబాద్ ఎఫ్‌సీ, ఎటికె మోహన్ బగాన్‌లు ప్రత్యర్థులకు గోల్ ఇచ్చేందుకు నిరాకరించాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన తొలి అంచె సెమీఫైనల్ పోరులో గోల్ నమోదు కాకపోవటంతో 0-0తో మ్యాచ్ డ్రాగా ముగిసింది. మ్యాచ్‌లో 51 శాతం బంతిని నియంత్రించిన హైదరాబాద్ ఎఫ్‌సీ.. ఎదురుదాడిలో రెచ్చిపోయింది. ఏకంగా 14 సార్లు ఎటికె మోహన్ బగాన్ గోల్ పోస్ట్‌పై దాడి చేసింది. ప్రథమార్థంలో స్టార్ ఆటగాడు ఒగ్బాచే లేకపోయినా హైదరాబాద్ గోల్ దిశగా దూసుకెళ్లింది. ద్వితీయార్థం ఆట 60వ నిమిషంలో ఒగ్బాచే మైదానంలోకి రావటంతో హైదరాబాద్ ఎఫ్‌సీ గోల్ ఆశలు చిగురించాయి. కానీ బాక్స్ లోపల బంతిని అందుకునేందుకు ఒగ్బాచే ఇబ్బంది పడ్డాడు. అతడికి సరైన పాస్ ఇవ్వటంలో సహచరులు సైతం విఫలమయ్యారు. దీంతో 90 నిమిషాల పూర్తి ఆటకు తోడు ఐదు నిమిషాల అదనపు సమయంలోనూ ఇరు జట్లు గోల్ చేయటంలో విఫలమయ్యాయి. దీంతో మార్చి 13న కోల్‌కతలో జరుగనున్న రెండో అంచె సెమీఫైనల్ పోరు ఇరు జట్లకు నాకౌట్‌గా మారనుంది. ఇండియన్ సూపర్ లీగ్‌లో సెమీఫైనల్లో రెండు సార్లు తలపడాల్సి ఉంటుంది. రెండు మ్యాచుల అనంతరం గోల్స్ వ్యత్యాసంతో మెరుగైన జట్టు ఫైనల్‌కు చేరుతుంది. తొలి అంచె సెమీఫైనల్లో ఏ జట్టుకూ ఆధిక్యం లభించలేదు. దీంతో రెండో సెమీఫైనల్లోనే ఫైనల్స్ బెర్త్ ఖరారు కానుంది.

టెన్నిస్‌లో సదాశివ సత్తా



హైదరాబాద్ : 70 ఏండ్ల వయసులో రాకెట్ పట్టి, కోర్టులో పాదరసంలా కదులుతూ విజయాలు సాధిస్తున్నారు సదాశివ రెడ్డి. ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నీల్లో సత్తా చాటుతున్న సి.సదాశివ రెడ్డి ఇటీవల ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పతకం సాధించాడు. మెన్స్ డబుల్స్ (70 ప్లస్ విభాగం)లో వి రామ్మోహన్ రావుతో కలిసి మెడల్ సొంతం చేసుకున్నారు. ఏడు పదుల వయసులో ఆల్ ఇండియా స్థాయిలో సుమారు 20 టోర్నీల్లో పోటీపడిన సదాశివ రెడ్డి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. కెపిహెచ్‌బిలో రెండు టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేసిన సదాశివ రెడ్డి యువత క్రీడల్లో రాణించేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారు. సదాశివ రెడ్డి, రామ్మోహన్‌రావులను హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం అధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి అభినందించారు.

నవచిత్రం

ఆ బడ్జెట్‌తో 10 సినిమాలు తీస్తా..

ఆస్కార్ కోసం ఆర్‌ఆర్‌ఆర్ రూ.80 కోట్ల బడ్జెట్




తమ్మారెడ్డి భరద్వాజ

ఆస్కార్.. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డు. అయితే ఈ అవార్డుని సొంతం చేసుకోవాలంటే కేవలం ప్రతిభ మాత్రమే సరిపోదు. కనీసం వంద కోట్లు ఖర్చు పెట్టాల్సిందేనని 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా చెప్పకనే చెప్పింది. విదేశాల్లో ప్రమోషన్ల కోసం 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందం ఇప్పటి వరకు దాదాపు 80 కోట్ల రూపాయలను వెచ్చించింది. అంతేకాదు టీమ్ మొత్తం మూడు నెలల విలువైన సమయాన్ని ప్రమోషన్ల కోసం కేటాయించింది. 'గోల్డెన్ గ్లోబ్', 'హాలీవుడ్ క్రిటిక్స్ ఛాయిస్' వంటి పురస్కారాలను దక్కించుకుని ఆస్కార్ బరిలో గట్టి పోటీలో ఉంది. ఈనెల 13న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణంలో ఆస్కార్ కోసం 'ఆర్‌ఆర్‌ఆర్' ఖర్చు పెట్టిన బడ్జెట్‌తో కనీసం 10 సినిమాలు తీసి, ముఖాన కొడతానని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఘాటుగా స్పందించిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్‌మీడియాలో దుమారం రేపుతున్నాయి. ఆస్కార్ వస్తే చరిత్రే.. రాకపోతే రూ.80 కోట్లు వృథా అయినట్టే కదా అని కొంతమంది వాదిస్తుంటే, తెలుగు సినిమా సత్తా విశ్వవ్యాప్తంగా 'ఆర్‌ఆర్‌ఆర్'తో మరోమారు తెలిసింది. అంతేకాదు హాలీవుడ్ సంస్థలు మన సినిమాల్లో పెట్టుబడులు పెట్టడానికి 'ఆర్‌ఆర్‌ఆర్' తలుపులు తెరిచిందని మరికొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా వాదిస్తున్నారు.

అలరిస్తున్న తెలుసా..తెలుసా


మంచు లక్ష్మీ

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీ ప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వం వహించారు. లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్స్‌మెంట్స్ బ్యానర్లపై మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మీ నిర్మించిన ఈ సినిమాలోని 'తెలుసా తెలుసా...' పాటను ఉమెన్స్ డే సందర్భంగా అగ్ర నాయిక సమంత సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ పాటకు ప్రేక్షకులు నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాటలో లక్ష్మీ ప్రసన్నతో పాటు ఆమె తనయ విద్యా నిర్వాణ మంచు కూడా కనువిందు చేయడం విశేషం. త్వరలో ఈ చిత్ర విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు. ప్రముఖ మలయాళ నటుడు సిద్దిక్, విశ్వంత్, చైత్ర శుక్లతో పాటు భారీ తారాగణంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సంగీతం - అచ్చు రాజమణి, సినిమాటోగ్రఫీ-గోకుల్ భారతి, ఎడిటర్-మధు రెడ్డి.



వి.వి.వినాయక్, కిరణ్ అబ్బవరం

సరికొత్త లవ్, యాక్షన్ డ్రామా..

కిరణ్ అబ్బవరం హీరోగా శివం సెల్యులాయిడ్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం: 2గా ఒక సరికొత్త లవ్ యాక్షన్ డ్రామా రూపొందనుంది. ఈ చిత్రం ద్వారా విశ్వకరుణ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరిగింది. హీరోపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టగా, నిర్మాతలు సురేష్ బాబు, ఎ.ఎం.రత్నం కెమెరా స్విచాన్ చేశారు. ఈ కార్యక్రమానికి నిర్మాతలు కె.ఎస్.రామారావు, జెమిని కిరణ్, శిరీష్, వల్లభనేని వంశీ, నల్లమలపు బుజ్జి, రామ్ తాళ్లూరి, దామోదరప్రసాద్, కె.కె. రాధామోహన్, బెక్కెం వేణుగోపాల్, ప్రసన్న కుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలియజేశారు. ఈ చిత్రానికి నిర్మాతలు: రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సహ నిర్మాతలు: బి.సురేష్ రెడ్డి, సంతోష్, సంగీతం: సామ్ సిఎస్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, డీఓపీ: విశ్వాస్ డానియేల్, ఎడిటర్: ప్రవీణ్ కె.ఎల్.

బాలీవుడ్ దర్శకుడు, నటుడు

సతీష్ కౌశిక్ కన్నుమూత


సతీష్ కౌశిక్

ప్రముఖ నటుడు, దర్శకుడు సతీష్ కౌశిక్ (66) కన్నుమూశారు. హోలీ వేడుకల కోసం ఢిల్లీలో ఉన్న స్నేహితుడు జావేద్ అక్తర్ ఇంటికి వెళ్లిన ఆయన గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంట్లో నలతగా అనిపించడంతో డ్రైవర్‌తో కలిసి కారులో ఆస్పత్రికి బయలుదేరారు. అయితే ఆయన మార్గం మధ్యలోనే గుండెపోటుతో మృతిచెందినట్లు సన్నిహితులు తెలిపారు. 'రూప్‌కీ రాణీ చోరోస్ కా రాజా', 'ప్రేమ్', 'తేరే నామ్', 'షాదీ సే పెహ్లే' వంటి చిత్రాలకు సతీష్ దర్శకత్వం వహించారు. 'ఉత్సవ్', 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'రాజాజీ', 'బాఘీ 3' వంటి తదితర ఎన్నో చిత్రాల్లో ఆయన కీలక పాత్రలు పోషించి, నటుడిగానూ మెప్పించారు. సతీష్ కౌశిక్ అకాల మృతి పట్ల పలువురు బాలీవుడ్ సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నీతో ఈ గడిచిన కాలం..


నాగశౌర్య, మాళవిక నాయర్

'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత నాగ శౌర్య, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ఫీల్ గుడ్ రొమాంటిక్ ఫిల్మ్‌లో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'కనుల చాటు మేఘమా' పాట, టైటిల్ సాంగ్ విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాట విడుదలైంది. గురువారం సాయంత్రం మేకర్స్ విడుదల చేసిన 'నీతో ఈ గడిచిన కాలం' అనే పాట 'కనుల చాటు మేఘమా', 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' టైటిల్ సాంగ్ తరహాలోనే వినసొంపుగా, వినగానే నచ్చేలా ఉంది. 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' చిత్రాలలోని మెలోడీ పాటలు ఎంతలా ఆకట్టుకున్నాయో.. ఈ చిత్రం నుంచి విడుదలవుతున్న ఒక్కో పాట అంతకుమించి అనేలా ఉన్నాయి. మెలోడీలను స్వరపరచడంలో కళ్యాణి మాలిక్‌ది ప్రత్యేక శైలి అని ఈ పాటతో మరోసారి రుజువు చేసుకున్నారు. ఈ పాటకు భాస్కర భట్ల రవికుమార్ అద్భుతమైన సాహిత్యం అందించారు.

నీతో ఈ గడిచిన కాలం.. నడిచిన దూరం ఎంతో ఇష్టం చెవిలో చెప్పే కబురులు అన్నీ ఇష్టం ఇష్టం ఇష్టం" అంటూ సాగిన పాటలోని ప్రతి వాక్యం ఆకట్టుకుంటోంది. గాయని గీతామాధురితో కలిసి కళ్యాణి మాలిక్ ఈ పాటను ఎంతో అందంగా ఆలపించారు. పాటలోని వాక్యాల మాదిరిగానే ఈ పాట వెన్నెల్లో గోదారిలా ఉంది. నాయకా నాయికలకు ఒకరిపై ఒకరికున్న ఇష్టాన్ని, ప్రేమని తెలిపేలా సాగిన ఈ సాంగ్ లిరికల్ వీడియో ఎంతగానో ఆకట్టుకుంటోంది. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీ, విజువల్స్ కట్టిపడేస్తున్నాయి. పాట ఎంత అందంగా ఉందో.. లిరికల్ వీడియోలోని ప్రతి ఫ్రేమ్ అంత అందంగా ఉన్నాయి. ఈ పాటకు రఘు మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు.
- మేకర్స్

భిన్న కాన్సెప్ట్‌తో మూడో కన్ను


సాయికుమార్

సెవెన్ స్టార్ క్రియేషన్స్, ఆడియన్స్ పల్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సునీత రాజేందర్, 'ప్లాన్ బి' డైరెక్టర్ కె.వి.రాజమహి నిర్మిస్తున్న చిత్రం 'మూడో కన్ను'. అమెరికాలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ ఆంథాలజీ చిత్రం ద్వారా నలుగురు కొత్త దర్శకులు సూరత్ రాంబాబు, కె బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయి సురేంద్రబాబు పరిచయం అవుతున్నారు. ఈ కథలో ప్రధాన పాత్ర పోషించిన సాయికుమార్ మాట్లాడుతూ, 'నాలుగు కథలు, నలుగురు దర్శకులు, కొత్త వాళ్లను ఎంకరేజ్ చేయడానికి ఈ సినిమా చేస్తున్నాను' అని చెప్పారు. 'కథ అత్యంత ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది' అని మరో ప్రధాన పాత్ర చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలుగు ఫిలిం దర్శకుల సంఘం అధ్యక్షుల కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ, 'ఫస్ట్ టైం తెలుగు ఫిలిం చరిత్రలో మా యూనియన్‌లో మెంబర్ షిప్ ఉన్న నలుగురు కొత్త దర్శకులను ఇంట్రడ్యూస్ చేస్తున్న మా మెంబెర్ దర్శకుడు కె.వి రాజమహికి ధన్యవాదాలు. ఈ చిత్రంలో నేను కూడా భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని తెలిపారు. నిర్మాతలు కె.వి రాజమహి, సునీత రాజేందర్ మాట్లాడుతూ,'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాం. షూటింగ్ పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్న మా చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.